53592

శ్రీ

(1)

# ఆత్మ సౌరభము

(తాత్పర్య సహితము)



గ్రంథకర్త

'కవితావిశారద', 'కవిమిత్ర', 'కవివతంస'

లేళ్ళ వేంకట రామారావు

బాపట్ల - 522 101

శ్రీ

# ఆత్మ సారథము

( పద్య కావ్యము )




గ్రంథకర్త

కవితావిశారద - కవిమిత్ర - కవివతంస

తేళ్ల వేంకటరామారావు

భీమావారివీధి, బాపట్ల - 522 101

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి.

శ్రీ ధాతనామ సం॥ పుష్యమి
ఫిబ్రవరి 1997

O25, ITV,

ప్రతులు - 800

ఈ కావ్యము "శ్రీతిరుమల తిరుపతి దేవస్థానమువారి
ఆర్థిక సహాయ్యముతో ముద్రింపబడినది.

'This book is Published with the financial assistance of
Tirumala Tirupati Devastanams under their Scheme
Aid to Publish Religious Books"

మూల్యము రు. 10/-

ముద్రణ
శ్రీ R.K ప్రింటర్స్
జి.బి.సి. రోడ్, బాపట్ల - 522 101

శ్రీ

# మహిత వేంకటేశ!

నీమోము వెలుఁగులో నిగ్గుఁదేరినవాఁడు
సర్వపర్వంసహా చక్రమేలు!
నీ పల్కుతీపిలో నిల్చి పల్కెడివాఁడు
మకరందమానఁగ మానుకొనును!
నీ గుణక్రియలకు నేస్తమిచ్చెడివాఁడు
సర్వమేకముకాఁగ సంచరించు!
నీ కూర్పుప్రేమకు నియతిమైఁ గనువాఁడు
భక్తిబాంధవమునఁ బ్రాకులాఁడు!

ఎఱిఁగియెఱిఁగి నిన్ను నెమకుటెఱుఁగకున్న
వానికేగతి పట్టునో! పలుకుమయ్య!
శ్రీ తిరుమలేశ! బృహదాంధ్ర చిద్విలాస!
విమలగుణనివేశ! మహిత వేంకటేశ!

ఓ మహిత వేంకటేశ్వరా! కలియుగ ప్రభువ!

నీమోము వెల్గుచేత నిలబడి ప్రసన్నము చేసుకొనినవాడు భూచక్రము నేలునవియు, నీ పల్కెడి పల్కుతీపిలో నిల్చి, తన కార్యక్రమములు జరుపు కొనువాడు, ఇతరమైన మధువులను, మకరందములను త్రాగుట మానుననియు నీ గుణక్రియలకు స్నేహమును సంపాదించి, ఆచరించెడివాడు సమస్తమును సమానముగా చూచుకొని యేకముగా సంచరించుననియు, నీ విచ్చెడి, చూపెడి ప్రేమకు, నియమముగా నిలబడి యాచరించువాడు, భక్తిబాంధవ ముతో ప్రాకులాడుననియు, నీ సంగతి తెలిసికూడ నీవెవరివో తెలిసికూడ నిన్ను గూర్చి గాంచగలుటకు ప్రయత్నము చేయనివానికేగతిపట్టునో స్వామి! చెప్పు మా తండ్రియని భావము. నీవు దైవమని తెలిసి నిన్ను ఒకరోజుకూడ స్మరించనివానికేగతి గల్గునో యని తాత్పర్యము.

కఠినంపుశిలరూపుఁ గైకొన్న నీకు నై
మెత్తని హృదయాల పొత్తులేల?
నింగికి నెగఁదన్ను నీ గుణక్రియలకుఁ
బాగుత్తిమాలల పూజలేల?
నీలిరంగుల నీను నీ మేనిచాయకు
నగరుగంధపుఁ బొడుములముటేల?
బోలికఁ గసరాని నీలోతు మహిమకు
ముల్లోకములు నిన్నుఁ బొగడనేల?

చాలు నిను వంటి వానిక పొగిలఁబడి
మ్రొక్కువానికే సిరులను బ్రోదివిత్తు!
శ్రీ తిరుమలేశ! బృహదాంధ్ర చిద్విలాస!
విమలగుణనివేశ! మహిత వేంకటేశ!

శ్రీ తిరుమల వేంకటేశ! స్వామీ!

నీవు కఠినమైన శిలరూపములోనున్న నీకొఱకు మెత్తని హృదయాలు కలిగిన వారిపొత్తు లెందుకనియు, ఆకాశముదాక ప్రాకిన నీ గుణక్రియలకు మెచ్చి మెత్తని పూలగుత్తుల పూజలేల అనియు, నీలిరంగుతో వికసించు నీ మేనిఛాయకు అగరు, సుగంధములాది పొడుములను పులుముటేలనియు, నీలో యున్న నీ మహత్తు యింతని చెప్పుటకు వీలులేనిదానికి మూడులోకాలు నిన్ను బొగడనేలనియు, చాలునిక యిటువంటివానికి మ్రొక్కినవానికి లాభము ఏమి కలుగునో, వారిక ఏమి నీవు యిచ్చెదవో అని, చెప్పవలసినదని వ్యాజస్తుతి చేయుటమైనది. దీనినే నిందాస్తుతికూడ యందురు. భక్తులు రకరకాలు నిన్ను ప్రార్థింతురు. (అందులోనిది యొకరకము అని తాత్పర్యము).

# ఆ ధ్యా త్మ రా మా య ణ ము

విజ్ఞానజానకి వినువీధి మార్గాన
లంకకుఁ జేర్చితి బింకముడఁగ!
సగుణవారాశిని సద్భక్తి మార్గము
మెఱయంగ దాటితి మేలుసేయ!
పాంచభౌతికదేహ పాంచజన్యమునూఁది
యణచితివహంకారమను దశాస్యు!
సత్త్వగుణాత్మక శాంతిరూపమ్మున
రాజ్యమేలితి "రామరాజ్య" మనఁగ

దేవదుందుభుల్ మొఱయంగఁ జేవఁబూని
యఖిలలోకాల నెలకొన్న యాత్మ నిలిచి
త్రిభువనీ పరమాత్మవై ప్రభుఁడవైతి!
రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర!

<u>ఓ రామచంద్రా!</u>

విజ్ఞానమను జానకీదేవిని ఆకాశమార్గాన లంకకు జేర్చితివి సగుణమను సముద్రమందు భక్తియను వంతెననుగట్టి దాటితివి. పంచభూతములతో పుట్టుకవచ్చిన శరీరమును పాంచజన్యముగా ప్రయోగించి ఆ శరీరములోనున్న అహంకారమను రావణాసురుని అణచివేసితివి. రామరాజ్యమను పేరుతో శాంతిరూపముతో సత్త్వగుణాత్మకమైన నీవు యేలితివి జగములు, దేవదుందుభులు మెఱయంగ మూడు లోకాలకు నీవే పరమాత్మరూపుడవై ప్రభుడవై యేలుచుంటివి అని తాత్పర్యము. (సత్త్వగుణమే నీవని భావము).

# గురుదేవులు

శతావధాని - శ్రీ వేలూరి శివరామశాస్త్రి గారు

అభినవతిక్కన - శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారు

సాహిత్యరత్న - శ్రీ ఆకుల కోటయ్య గారు

— వీరికి మన్నమోవాకశతము

# విన్నపము

ఇయ్యది మా తండ్రి యాజ్ఞమేరకు వ్రాయఁబడినది. మా తండ్రి గారైన రేళ్ళ రామకృష్ణయ్యగారు శ్రీరామభక్తులు. వారి చిన్నతనమునుండి ఎప్పొద్దు రాముని స్మరించుచు, మహాభక్తవర్యులై, భాగవతోత్తములరై పేరు గడించి, జాతికి మేలు సేకూర్చుచు, కాలముం గడిపిరి. వారొకదినమున నన్నుఁబిల్చి, ఉపనిషత్తులు చూపి దానిలోనున్న సారాంశములను పద్య రూపముగా వ్రాయుచు మునుముందుగా "ఆత్మ యనఁగా నేమిటో వ్రాసి చూపించమని కోరిరి. అందు"మీఁదట నేనీపని కొడిగట్టి ముందుగా "ఆత్మను గురించి ఒక పద్యమును వ్రాసి చూపించితిని

"ఆనందవాసియై, యమృతంపు బావియై
సత్యనిరూపణ స్థానమగుచు
నిత్యవిలాసమై, నెలఁగూర్చు పదమునై
వినమిత సేవ్యమై వెలయుఁ బ్రీతి,
సగుణ నిర్గుణములు సవరింప నెలవునై
యాధ్యాత్మభావము నలరుచుండు
భక్తిమార్గముమెయి, భద్రము లొసఁగుచు
బ్రహ్మతేజస్సునఁ బ్రజ్వరిల్లు!

నయ్యది యె యాత్మ నాఁ గొనియాఁడనగును
సర్వలోకాలు నిండిన సత్యమయము
దాని వర్ణింపనలవియే! ధాతకైన!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర!

అందుమీఁదట నిద్దానిఁ జదివి నన్ను దీవించి, బాగుందని ప్రశంసించి, యిటులని బల్కెను. మనమందరము గృహస్థాశ్రమ వాసులముగదా! కనుక రాముని పేరుతో "మార్జాల కిశోర న్యాయ్యమున" పద్యకావ్యము సృష్టింపమనఁగా నిద్దాని వ్రాసితిని.

అందున దీనిని నిర్గుణోపాసన కొంతవఱకు, సగుణోపాసన మఱి కొంతగా వ్రాసి పూర్తిగావించితిని.

దీని యోగ్యతా యోగ్యతలు చదువఱుల బాధ్యతలయి యున్నవని తలంచుచు మీకు నమస్కరించుచున్నాఁడను.

మీ

తెళ్ల వేంకట రామారావు

గ్రంథకర్త

# ఆత్మసౌరభ విలాసం

డా॥ ఆర్. అనంతపద్మనాభరావు
స్టేషన్ డైరక్టర్,
ఆల్ ఇండియా రేడియో, విజయవాడ.
ది. 20-2-97

బాపట్ల సాహితీ ప్రియంభావుకుల నెలవు. అక్కడ 'చిగురుగొమ్మ చేవ' అని చెప్పవచ్చు. పద్యకవితలో చేయిదిరిగిన కవులు, ఆధునిక కవితావిశారదులు, నవలా, కథారచయితలు, నాటక రచయితలు ఇలా అన్ని ప్రక్రియలలో ధిషణగల వ్యక్తుల పుట్టినిల్లు బాపట్ల. వారిలో తలస్పర్శి లేళ్ళ వేంకట రామారావుగారు సాహితీ వయోవృద్ధులు, కురువృద్ధులు, కవితావిశారదులు. వారి గురు పరంపర తుమ్మలవారితో, వేలూరి శివరామశాస్త్రిగారితో పరిపుష్టమైనది.

తండ్రి యానతి తలదాల్చి రామారావుగారు ఈ గ్రంథం రచించారు. తండ్రి రామభక్తిపరులు. భాగవతోత్తములు తనయుడు పితౄణాన్ని ఈ విధంగా తీర్చుకొన్నారు. ఉపనిషత్తులగూర్చి, అనేక ఆధ్యాత్మికవిషయాలను గూర్చి శతకరూపంలో ఈ గ్రంథం వెలువరించారు.

'రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర!' అనే మకుటంతో 107 సీసాలు, వాటికి తాత్పర్యాలు వివరణాత్మకంగా ఇచ్చారు. ధర్మపత్నుల ధర్మ్యవ్రతాన్ని వివరిస్తూ గాంధారి, దమయంతి, అహల్య, ద్రౌపదులను పేర్కొన్న పద్యం (73) హృద్యం! పద్యరచనలో కవి సిద్ధహస్తులనడానికి పద్యాల అలవోకనడక పేర్కొనవచ్చు. తాత్పర్యాలను వివరణాత్మకంగా ఇవ్వడం వల్ల అన్నితరగతుల పాఠకులకు సులభగ్రాహ్యంగా వుంది.

భక్తిప్రభావంగా సాగిన ఈ పద్యాలలో కవి భావుకత, ఆర్తియుత దివ్యానుభూతి వెల్లివిరిశాయి. అన్నివేళలా, అన్ని ప్రదేశాలలో కవికి రామచంద్రుడే దృగ్గోచరమయ్యాడు. ఆయనకు తన హృదయనివేదనం చేసుకొన్నారు కవి.

'వేదాంత మదియెంత వింతగా బల్కిన
మానవాళికి దాని మమతలేల?'

'ఆత్మయొకటి దాని నావరించి కదలి
కలబొంగి నిండార నిలిచియాడు'

'పుణ్యఫలములవ్వి పుట్టుక బుట్టును
వెనుకటివాసన వెలయుకొలది'

—ఇలా ఎన్ని పద్యాలనైనా ఉదాహరించవచ్చు.

కవితాఝరికి ప్రవాహశైలి వుంది.
కవితాత్మకు గంభీరత ప్రధానం.
రామారావుగారి కది పుష్టిగా లభించింది.
వయోవృద్ధులు, సాహితీభీష్ములు అయిన
రామారావుగారికి భగవంతుడు పరిపూర్ణ
ఆయురారోగ్యాలు ప్రసాదించాలని తప్ప
మరేమి కోరుకోగలను?
ఆత్మసౌరభ విలాస భాసిత కవితాధురంధరుడు రామారావు ధన్యజీవి!

# ఆత్మ సౌరభము - ఆప్రాణ ప్రతిపత్తి

నెమ్మాని సీతారామయ్య, ఎం.ఏ.
రిటైర్డ్ - ఆంధ్రశాఖాధ్యక్షులు,
ఆర్ట్సు కళాశాల, బాపట్ల.

కవితావిశారద - కవిమిత్ర - కవివతంస ఇత్యాది బిరుదాంచితులైన మాన్యులు శ్రీ లేళ్ళ రామారావుగారు కవితా తపస్విగా, కవిలోక ప్రథిత యశస్విగా, ఉత్తమ భావుకతా మనస్విగా ప్రసిద్ధి నొందినవారు. శారదాదేవి పరిపూర్ణ కటాక్ష వీక్షణంచేత కవితావిశారదులైనవారు. వాగ్దేవి గళసీమకు అవతంసములైన కావ్యాలు రచించి కవి వతంసులైనవారు. సహృదయ సమ్మానసమాదరంతో కవిమిత్రులైనవారు. ఇప్పటికే వీరి దైవస్తుతులు క్షేత్ర వైభవములు ఖండకృతులు సహృదయుల మెప్పు పొందినవి. ధర్మచక్రము - తపోవనమువంటి కావ్యములు కవిపండితలోక ప్రశస్తి గాంచినవి. ప్రస్తుతము వెలువడుచున్న రచన - ఆత్మసౌరభము. ఇది ఒక శతకం. "రమ్యగుణసాంద్ర రఘుకులరామచంద్ర"–మకుటంతో ఇష్టదైవమైన శ్రీరామచంద్రుని స్తుతిస్తూ, ఆత్మనుకూర్చిన చర్చ ప్రధానాంశంగా సాగిన ప్రకృష్టమైన రచన ఇది. భక్తి శృంగార - వైరాగ్య - నీతి వైవిధ్యంతోకూడిన శతకరచన మనకు అనాదిగా ఉన్నదే వ్యాజనింద - వ్యాజస్తుతులతో తమ ఇష్టదైవాలను ఆరాధించిన శతకకర్తలెందరో ఉన్నారు. కానీ ఆత్మవిచారచర్చతో శతకం వ్రాయడం తేలికకాదు. ఇది నేలవిడచి సాము చేయడంవంటిది అయినా భావుకతాసంపన్నులు - గభీరతాలక్షణలక్షితులు - వైయాకరణ మనీషులు అయిన శ్రీ రామారావుగారు దీనిని కరతలామలకంగా చూపించారు.

ఆత్మనుగూర్చిన చర్చ ఈనాటిదికాదు ఎన్ని ఉద్గ్రంథములు ఈ గహనమైన విషయాన్నిగూర్చి చెప్పెనో లెక్కలేదు. ఇక ఈ విషయాన్ని శతకంగా కూర్చడంలో వీరు చూపిన భావచాలనం నావ్యతో దర్శనీయం. పిత్రు

నాజ్ఞ ననుసరించి ఈ రచన చేయబడినదని పేర్కొనడం వారి పితృభక్తికి నిదర్శనం. ఉపనిషత్తులను అనేక గ్రంథాలను శోధించి - సాధించిన ఈ ఆత్మసౌరభం సహృదయహృదయరంజకం కాగలదని నా నమ్మకం. సగుణం నుండి నిర్గుణోపాసనకు ఎగబ్రాకడం - జీవాత్మను పరమాత్మగా గుర్తించడం వంటి విషయాలు చక్కగా స్పష్టీకరించారు. పద్యరచనాశిల్పంలో వీరు అందె వేసినచేయి. సీసములనే పుష్పస్తబకంలో ఆత్మనే సౌరభాన్ని గుబాళింప చేస్తున్నారు. అంతేకాదు ఆంధ్రసరస్వతికి ఆత్మసౌరభమనే ఆణిముత్తెపు హారాన్ని అందించారు ఇందులో సీసాలన్నీ ఆణిముత్యాలే! విషయాలన్నీ జగమెరిగిన సత్యాలే! క్షరమెరుగని నిత్యాలే!! ఏ ఛందంలోనైనా ఉద్దిష్టభావాన్ని సరళ సుందరంగా ఉద్దీపనం చేయగల ఉద్దండులు. ధారాశుద్ధిగల ధురంధరులు. నాపై వీరికిగల ఆదరాభిమానములకు జోతలర్పిస్తూ, ఇంకను వీరి లేఖినినుండి అనేక మహాకావ్యాలు వెలుగుచూడాలని ఆ తిరుమల శ్రీనివాసుని ప్రార్థిస్తూ

కైతకన్నె మీకు కైవశమై నిల్చి
కావ్యరచన సేయఁ గనికరించె
శక్తియుక్తినిచ్చి రక్తిని బ్రోవంగ
రాణకెక్కితయ్య! రామరాయ!

బాపట్ల
24-2-97,

ఇతి శేషమ్

శ్రీ హయగ్రీవాయ నమః

# సౌ ర భా రా మ ము

విద్వాన్, ఆర్షవిద్యానిధి, ఉపన్యాస వాచస్పతి, బోధకసుధీమణి

## శ్రీమాన్ కె. ఇ. తి. రామానుజాచార్యులు, M.A.

"సర్వగంధః, సర్వరసః" అని ఉపనిషత్తులలో సురభిగా శ్లాఘింపబడినవాఁడు పరమాత్మ. తత్సృష్టియంతయు సౌరభమే. ఆ సౌరభమునకు ఆరామమే యీ వేంకట రామారాయ కవివతంసము. వీరి తండ్రి రామకృష్ణయ్యగారు, దవనం, మరువం, మల్లెపూల ఆరామమును పెంచి అనుదినము శ్రీ భావనారాయణస్వామి కైంకర్యధుర్యులై తరించిన నిష్ఠాగరిష్ఠులైన శ్రీ వైష్ణవ భాగవతాగ్రగణ్యులు. వీరి పినతండ్రిగారు వీరరాఘవయ్యగారును అట్టివారే. వారిని నేను బాగుగా నెఱుఁగుదును. తండ్రియందలి నామైకదేశమే రామారావు. రామారామము. రమ్యారామము. ఆత్మసౌరభారామము. వేంకటరామారామము కవితాసారామము.

ఇది శతకమా? కాదు. శతకమనెడి పేరుపెట్టి యుండలేదు. కనుక అయినచో శతకముకాదా? అవును శతకమే. ప్రతిపద్యము తుదను "రమ్య సుగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర" అను మకుటము ఉన్నదికదా? 91వ పద్యములో కంచర్ల రామదాసు కాసుల పురుషోత్తమకవి గజేంద్ర మోక్షకవి పోతనయు స్మరింపబడినారు. వారి శతకముల సంస్కారమిందుఁగలదు. "విమల రవికోటి సంకాశ! వేంకటేశ!" అను మకుటముగల తాళ్ళపాక పెద తిరుమలార్యుని వేంకటేశ శతకమువలె, బల్లాల పేరయ్య కవి రచిత భద్రగిరి శతకమువలె, కాసుల పురుషోత్తముని ఆంధ్రనాయక శతకముపోలె, కొమ్మరాజు వేంకటశివుని రేపాల రాజలింగశతకము మాడ్కి, అడిదము సూరన రామలింగేశశతకము భాతి, గంగాధరకవి రచిత కీరవాణి శతకము పగిది, ఇదియు నొక సీసపద్యాత్మక శతకమనవచ్చును. మఱి పద్యకావ్యమనాదురుకదా అననీ శతకముమాత్రము పద్యకావ్యముకాదా!

108 పద్యములున్నచో అష్టోత్తర శతనామస్తుతి అయ్యెడిదిగదా! 107 పద్యములే లెక్కవేసినారేమి? అనుకున్నాను. అధ్యాత్మ రామాయణము అన్న శీర్షకము క్రిందగల పద్యముకూడ కలుపుకున్నాను. 108 పూర్తియైనవి. పుటలసంఖ్య 108 కన్పించినవి. అర్థికముగా అనుకున్న వేంకటేశుని మహిమవ

లేదు. వేంకట రామారావుగదా! మహిత వేంకటేశ! అని తాత్పర్యముతో వ్యాజస్తుతితో పలుకరించినాడు కవిమిత్రుడు.

చక్కని ధారాశుద్ధి - పలుకుల మెలకువలు - సహజసిద్ధములై తోఁచినవి. కవి, దేశభక్తిగల్గినవాఁడగుటవలనను గాంధి ఆస్థానకవి తుమ్మలవారి శిష్యుఁడగుటవలనను వాల్మీకి, సీత - ధృతరాష్ట్రులతోఁగూడ తాత గాంధిని భగవంతుని సాక్షాత్కరించిన పురాణపురుషులలోఁ జేర్చినాఁడు పదుమూఁడవ పద్యములో 27వ పద్యమున 'విజ్ఞాన దివిటీలు' భారతమున వ్యాసుని "కపిల గడ్డములను చూపినవి 2?వ పద్యమున శ్రీరాముని గాథకు వాల్మీకిని, గేయమునకు త్యాగయ్యను, తెల్గుకైతకు మొల్లను, గోపురాల్ కట్టుటకు గోపన్నను, కనుల పండువుగా నిలిపినాడు కవితావిశారదుడు. 4?వ పద్యమున సకల దేవతలకును మూలము నీవేయని "సర్వదేవ నమస్కారః" కేశవం ప్రతిగచ్ఛతి "అన్న భావము" తేపి మామేవ కౌంతేయ! యజంత్యవిధి పూర్వకమ్ అను గీతా దార్యభావము నిక్షిప్తమైయున్నది 68వ పద్యమున కుడిచికూర్చున్న రాముని తనడెందాన కొంచెము సేపు నిలిచి విసుగు దీర్చుకొనుమనుట చాల చమత్కార విషయము 73వ పద్యములో హరిశ్చంద్రుని హరిశ్చంద్రుని చేయుట సాహసము. 7?వ పద్యము శ్రీకృష్ణ చేష్టితముతో రసభరితమైయున్నది. 81వ పద్యము అర్థపరిపుష్టితో నలరారుచున్నది. 93వ పద్యమున "పరపతి" అను పదము వ్యావహారికము. సంస్కృతము గాదు

ఇందు చాల జాతీయములు పలుకుబడులు చోటుచేసికొనియుండుట విశేషము. 2 విలువగట్టుట, 6. దిగఁజాఱు, 12. రూపురేఖలు, 13. ఓటిపాటిమాటలు 22. కాలిగోటికెనయై, 2?. మనుగడ సాధింప, అల్లారుముద్దుగ 26. తలదాచుకొనఁబోవు కాయకష్టములకు, 27. అడపదడప, 50. కనుజూపుమేర, 53. ప్రాకులాడుదును, 60. కొసరికొసరి, 61. గుసగుస, 64. నిట్టనిలువున. 68. కుడిచికూర్చుంట 86. కుజ్జుజంటలు, 98. పోకిరికృష్ణయ్య 100. పుట్టుపూర్వోత్తరాలు ఇట్లన్నియో కావ్యమునకు వన్నెఁదెచ్చుచున్నవి. 82వ పద్యము కొంత శబ్దాలంకారముతో చక్కగా నడచినది. ఈవిధముగా చెప్పుచుఁ బోయినచో అతిశయోక్తిగా గానఁబడునేమోయని జంకి యింతటితో ఈ సౌరభాఘ్రాణమును నిలిపియుంచెదను.

పూర్వజన్మ సుకృతి - పుష్కల భావుండు,
సహజ కవితనెనయు సహ్యాచయుఁడని
తలఁచుచుండు నెపుడుఁ దదయుఁగరుణతో
వేంకటేశుఁడీ కవి ప్రీతిఁ గనుచు.

# నమోవాకములు

శ్రీనివాసుని చిద్విలాసాలు చిత్రముగానుంటయి. అనారోగ్య పర్వము లోనున్న నన్ను ఆరోగ్యవంతునిగాఁజేసి, అక్షర సమర్చనముఁ జేయుమని ఆదేశించాఁడు. ఆర్థిక సహాయమునందించి యచ్చు వేయించుకొనే అవకాశమును గల్పించాఁడు. ఆ సప్తగిరివాసుని కరుణా కటాక్షములతో రెండు కావ్యాలు మీ ముందుకు వచ్చినవి. మొదటిది "తపోవనము" రెండవది యీ "ఆత్మ సౌరభము".

ఈ ఆత్మ సౌరభము పుస్తకరూపములోఁ బ్రచురింపఁబడుటకు ఎందరో మిత్రులు నన్ను ప్రోత్సహించిరి. ఆ సాహితీమూర్తులందరకుఁ గృతజ్ఞతా భావన వెల్లడించుట నావిధి

పరిచయమైన నాటినుండి, గౌరవభావమును ప్రకటించుచు, నా పాండిత్యము నా కవిత్వమును, పదిమందికిఁ దెలియఁజేయుచు, నాకు స్ఫూర్తి దీప్తిని యందఁజేయుచున్న మాన్యమిత్రులు "మధురకవి", "భాషాప్రవీణ"

**డా॥ కె. ఐ. యస్. యాచార్యులుగారికి—**

ఈ కావ్యమాద్యంతముఁ జదివి హృద్యమైనరీతిలోఁ దమ "ఆత్మసౌగంధ విలాసము" అక్షరరూపములో సభివ్యక్తముఁజేసిన ఆకాశవాణి–విజయవాడ కేంద్ర సంచాలకులు, అవధానకళావిశారదులు, ఆంధ్రభాషాకోవిదులు,

**డా॥ ఆర్. అనంతపద్మనాభరావుగారికి—**

ఆత్మీయతతో "అభిమాన ప్రతిపత్తి"ని అందించుచు నా కావ్యాలలోని విలక్షణ లక్షణాలను విశదీకరించుచు, ప్రస్తుత కావ్యానికి ప్రశంసా పత్రాన్ని బహూకరించిన, ఆర్ట్స కళాశాల పూర్వఆంధ్రభాషాధ్యక్షులు, కవిపండితులు

**శ్రీ నెమ్మాని సీతారామయ్యగారికి—**

శతక కావ్యలక్షణాలను వివరించుచు, ఈ "ఆత్మసౌరభ కావ్యము లోని విశేషాలను విపులముగా విశ్లేషించిన "ఆర్ష విద్యానిధి", "ఉపన్యాస వాచస్పతి" **శ్రీమాన్ కె. ఇ. టి. రామానుజాచార్యుల స్వామివారికి—**

ఎన్ని పనుల యొత్తిడిలోనున్న నా సాహిత్య వ్యాసంగముపైఁగల యభిమానముతో "ఆత్మ సౌరభముపై నమూల్యమైన యభిప్రాయము నందఁజేసిన" అవధానశిరోమణి, బహుకావ్యకర్త, వివేచవాచతురుఁడు,
**డా॥ బేతవోలు రామబ్రహ్మముగారికి—**

ఆర్థిక సహాయ్యమందించి నన్ను అడుగడుగున ప్రోత్సాహించుచున్న శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానపుఁ గార్యనిర్వహణాధికారిగారికిఁ దత్సభ్యులకు

సకాలములోఁ జక్కఁగా ముద్రించి కావ్యానికి సరిక్రొత్త యందమును సంతరింపఁజేసిన బాపట్ల **R. K. ప్రింటర్స్‌వారికి—**

నా కావ్యావిష్కరణ సభలను రసరమ్యముగా నిర్వహించి, నా కావ్య ముద్రణలో బాసటగా నిల్చిన ఆప్తమిత్రులైన సహృదయ సాహితీ కన్వీనర్, సుప్రసిద్ధ రంగస్థలి, సినీనటులు, **శ్రీ K. S. శాయిగారికి—**

ఇంకెందరెందరో మహానుభావులందరికి నా హృదయపూర్వక నమో వాకముల నర్పించుకొను చున్నాఁడను.

భవదీయుఁడు
**— లేళ్ళ వేంకట రామారావు**

శ్రీ

# నిర్గుణోపాసనము

## ఆత్మ యనఁగా — నేమి?

ఆనందవాసియై, యమృతంపు బావియై
సత్యనిరూపణ స్థాన మగుచు
నిత్యవిలాసమై, నెఱిఁగూర్చు పదమునై
వినమిత సేవ్యమై, వెలయుఁబ్రీతి
సగుణనిర్గుణములు సవరింప నెలవునై
యాధ్యాత్మభావము నలరుచుండు
భక్తిమార్గము మెయి భద్రము లొసఁగుచు
బ్రహ్మతేజస్సునఁ బ్రజ్వరిల్లు!

నయ్యది యెయాత్మ నాఁగొనియాడ నగును
సర్వలోకాలు నిండిన సత్యమయము!
దాని వర్ణింపనలవియే! ధాతకైన!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 1

ఓ రామచంద్రా!

ఆత్మను గురించి, వేదములు, ఉపనిషత్తులు కొండాడుతు దాని తేజస్సును అనేకవిధాల బయలుపర్చుచు హిందూధర్మ నిరతిని చాటుచున్నవి. ఆత్మ అనగా దైవమనియు, చైతన్యమనియు, సత్త్వగుణమనియు, సత్యమనియు, అమృతమయమైనదనియు, ఆనందముతో నిండి వెల్లుచున్నదనియు, సత్యమును నిరూపించుకొనునట్టిదనియు, సేవింపదగినదనియు, సగుణనిర్గుణములకు తావు కలిగినదనియు, అధ్యాత్మికచింతన చేయునదనియు భక్తిభావముల కాలవాలమగునదనియు, శుభములను కూర్చునదనియు, బ్రహ్మతేజస్సుతో ప్రకాశించునదనియు, బ్రహ్మమనియు, సర్వలోకాలు నిండి వెల్గునదనియు, దాని వర్ణింప నలవికానిదనియు తాత్పర్యము. సర్వ జీవాళిలో నిండియున్నదనియు చెప్పుచున్నది.

ఆత్మకనంతమునైన మఱొండు ప
దార్థమిలను, లేదు, లేదు చిత్రచిత్ర!
విలువఁ గట్టుటకు వివేకము చాలదు
రూపురేఖలు లేని రూపమద్ది!
అదియ ప్రపంచపు హద్దుల మించిన
దైవశక్తియుతము తలఁచు కొలఁది!
కుమతులకది చెల్లదు మతకరించి దా
ని నిజస్వరూపము నిశ్చయింప!

భువికి దివికద్ది వంతెన పోలుపు నిలుచు
మాయ వీడిననాఁడది మంచిఁ బెంచు
సర్వలోకాలు పాలించు సత్త్వగుణము!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 2

ఓ రామచంద్రా!

ఆత్మకు సాటివచ్చు పదార్థము ఎచ్చటను భూమిలో లేదనియు, దానికి రూపురేఖలులేని రూపము కలదనియు, భూలోకమును యితరములైన లోకములను పాలింపగల్గు దైవశక్తి యుతమనియు, దానిని వర్ణించుటకు, కుమతులకెప్పుడు చెల్లదనియు, భువికి దివికి అది వంతెన పోలికయుండి సర్వమును పాలించు చుండుననియు, అదియే సత్త్వగుణమనియు తాత్పర్యము.

# మాం డూ క్యో ప ని ష త్తు

"జాగ్రదవస్థ"లో సచరాచరంబులు
కనువిందు(గూర్చుచు గాల మెల్ల(
దత్కాలమున(గని తలపోసి చేసిన
పనులెల్ల "స్వప్నాన"(గన(గ వచ్చు
సొగసి నిద్రించినచో "సుషుప్తిని" గాంచు
దేహము విశ్రాంతి(దేరి కొన(గ
నావలనమృతమయంబౌ "తురీయము"
నిజమైన నిలయమ్ము నీకు నమ్ము!
దీనవిజ్ఞాన చంద్రికల్ తేజరిల్లు
నాత్మకాంతి కొలంది విస్మరయ వచ్చు(
పెక్కు(రూపులు కామించి (ప్రేమ(జూడ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 3

ఓ శ్రీరామచంద్రా!

మానవుడు తన మనుగడ సాధించు విషయములలో నిత్యకృత్యము లలో నిలబడి చేయు పనులలో తాను కంటితో చూచి, సచరాచరములందు వర్తించి చేయుచుండును. దీనికే వేదాంతపరముగా "జాగ్రదవస్థ" యని పేరు (కంటితో చూచి చేయువాటిని యీ విధముగా పిలుతురు) పగటిపూట తాను చేయు పనులన్నియు రాత్రివేళలలో స్వప్నములో కొన్నిటిని కాంతగల్గును దీనిని "స్వప్నావస్థ" యందురు. నిద్రపోవు కాలమున అలసిచేసిన పనులకు తీవ్రమైన బడలిక కలిగినపుడు "సుషుప్తా" వస్థలో శరీరము తెలియకుండా నిద్రించుట "సుషుప్తా" వస్థయని పేరు. తిమ్మట "సుషుప్త" మును అనుకొని తెలియని మరియొక అమృత తత్వముతో కూడి కొనియున్నదానిని తురీయము అందురు. దానినే దైవనిలయమందురు. కనుక మానవకోటికి యీ నాలుగు అవస్థలు తప్పవు. కనుక నీవు తురీయమందు నిలబడి యుండెడితావన యర్థము రామచంద్రా!

# కైవల్యోపనిషత్తు

మనుగడ సాధించు మానవుఁడెప్పుడు
త్రిపుటిని విహరించి తిరుఁగుచుండుఁ
దన్మానవుఁడు కార్యదక్షతను విహార
మందుచుఁ గాలపుఁ బొందుఁగనను
దత్కాలవిధులను దనలోని జీవాత్మ
చైతన్యపథమున సాగి నడపుఁ!
దట్టివ మేప్రొద్దుఁదనరఁగఁ బరమాత్మ
భాయమ విహరించి చదురుఁగాంచు!

మరణమాసన్నమగువేళ మాయవీడి
ఆత్మ నిలచుఁదురీయమ్ము నందుఁజేరి
అదియ కైవల్యపదమగు, నబ్జనాథ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 4

ఓ రఘుకుల రామచంద్రా!

---

మానవుడెప్పుడు తన మనుగడ సాధించు తీరులో, జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తావస్థలో తిరుగుచుండును. కాలమున మనుగడ సాధించు కార్యక్రమములో తనలో మెలగుచుండు జీవాత్మ చైతన్యపథమున సాగించి తనను నడుపుచుండును. ఆ విధముగాచేయు కార్యక్రమములలో భగవంతుని సేవను చేయుచు, అలవాటుకొలది స్వేచ్ఛగా విహరించుచు తన జీవనమును గడుపుకొనుచుండును. కొంతకాలమునకు తనలోయున్న సత్ప్రవృత్తితో చేసిన సేవలందు జీవము అలవాటుపొంది దైవమను ప్రేరణతో భావమందు నిపుణుడై కీర్తిప్రతిష్ఠల పొందుగాంచును తనకు మరణము ఆసన్నమైనకాలమందు తన దినచర్యలో వలసిన భక్తిభావానుకూలతో నిండిన యాత్మచివరకు తురీయ మందు నిలిచిపోవును దీనినే కైవల్యమందురని కైవల్యోపనిషత్తు బోధించు చున్నది.

(త్రిపుటి :- 1) జాగ్రదవస్థ 2) స్వప్నావస్థ 3) సుషుప్తావస్థ)

# కేనోపనిషత్తు

ఇదియొక ప్రశ్నార్థ మిరవుకొన్నదియగు
శక్తిదేవతకు విగాల గాల
శక్తిస్వరూపిణి కాంతి ప్రదాయిని
పార్వతీదేవి ప్రవచన మెంచి
అగ్ని, వాయు, సురేంద్రులడిగిన ప్రశ్నకు
పార్వతి బదులిచ్చె "బ్రహ్మయనుచుఁ
దచ్ఛక్తి బ్రహ్మమై తాదాత్మ్యమంది" జీ
వాళికిఁ జైతన్యపథముఁ జూపుఁ

ఆత్మ, బ్రహ్మము, శక్తి,—యనంగనొకటి
గా వెలుంగుచు, దేవతాగణము
జగము నేలుచుండును, నిగమవేద్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 5

ఓ రామచంద్రా!

ఇదియొక ప్రశ్నార్థకమైన ఉపనిషత్తు. దీనిలో శక్తిస్వరూపిణి పార్వతి. అగ్ని, వాయు, ఇంద్రులు అడిగినప్రశ్నకు పార్వతి బదులు చెప్పును. అగ్నిని, వాయువును, పరీక్షించినపిమ్మట వారు శక్తిముందు ఓడిపోదురు. తరువాత ఇంద్రుడు యేతెంచి శక్తిని ప్రశ్నించును. అంతలో శక్తి మాయమై పార్వతిగా కనబడును. ఇంద్రుడు పార్వతీదేవిని ప్రశ్నించి ఆ శక్తి యెవరని అడుగగా ఆ శక్తి 'బ్రహ్మ'మనును. ఆ బ్రహ్మమే జీవాత్మతో కలిసి చైతన్య పథమున లోకములో నిలచి నడుపుచున్నది. అనగా ఆత్మయై బ్రహ్మమని, శక్తియని బోధించును. అదియె దేవతాలోకమును ఈ జగత్తును నేలుచున్నదని పార్వతి బోధించును. దీనినే కేనోపనిషత్తు తెలియపర్చుచున్నది.

# ముండకోపనిషత్తు

తనతల ముండన మొవర(జేసి వటుల
మదిలోని కోర్కెలు మాపవలయు(
దనభోగములనెల్ల( బొనవేముకొన్నవి
తనలోన దిగ(జార్చ(గన(గ వలయు(

బరతత్త్వమగు బ్రహ్మపరమున నాత్మలో
దీక్షమై ధ్యానింప( దేరవలయు
నాత్మయే బ్రహ్మయై యాదరణము నొప్ప
జ్యోతియై యానంద యోగమిచ్చు

అదియ! యచలచలనమునై వ్యాప్తి(జెందు
అదియ! చైతన్యమన(గ విహారమందు
నదియ! పాలించు సర్వము నెదురులేక!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర!

ఓ రఘుకుల నాయకా! రామచంద్రా!

తలను ముండనమొనర్చు విధాన ప్రతిఒక్కరు తనలోని కోర్కెలను చంపవలయునని, తన వాంఛాఫలములు లేకుండ వాటి దిగజార్చగా వలయునని, పరతత్త్వమగు బ్రహ్మను ఆత్మలో నిల్పి దీక్షతో ధ్యానింపవలయునని, ఆ ఆత్మయె అప్పుడు జ్యోతియై ఆనందయోగమిచ్చునని; అదియె అంతట వ్యాప్తిజెంది నిలుచునదనియు అదియే చైతన్యమై విహరింప గలిగినదనియు అదియె సర్వమును యెదురులేకుండా పాలింపగలుగు చున్నదనియు ముండకోపనిషత్తు చెప్పుచున్నది. (అనగా ఆత్మయే బ్రహ్మముగునని భావము).

# ఈశా వాస్యోపనిషత్తు

కర్మమార్గాన సుఖములైన దుఃఖము
లైన ననుభవించుట యవఁగనొప్పు
జ్ఞానమార్గాన నిజమ్ముసుమ్ము పర
మాత్మ పొందుసుగ్గాంచుట యబ్బునెపుడు

సగుణాశ్రితము పొసఁగునదియే! భక్తి
మార్గానఁ బడయంగ మంచియగును.
సాధనమ్మున మూటి సాకినపుడు పర
మాత్మను జేరుట నలవడుటగు

సూర్యగోళము దాటుట సులభతరము
దాని దాటిన నచ్చోటఁ దలఁగకుండు
తిరిఁగి జన్మరహితుఁడయి తేరుకొనుసు!
రమ్యగుణసాంద్ర' రఘుకులరామచంద్ర! 7

ఓ రామచంద్రా!

ఏ ప్రాణియైనను కర్మమార్గాన, అనుసరించి, సుఖములైనను దుఃఖములైనను అనుభవించుట తథ్యము. జ్ఞానమార్గాన పరమాత్మను పొంది అందులో లీనమైయుండుట కలుగును. సగుణోపాసనలో భక్తిని యాశ్రయించి దైవమును తనయాత్మలో తాదాత్మ్యము చెందవలయును. పై మూడువిధాలు సాకినప్పుడు ప్రాణి పరమాత్మను జేరుటకు వీలు కలుగును. తర్వాత జీవను గాని, ప్రాణిగాని, సూర్యగోళమును దాటిన వానికి అచ్చట నిలకడ కలుగును. వానికి తిరిగి జన్మలేదు అని భావము. దీనినే ఈశా వాస్యోపనిషత్తు ప్రబోధించుచున్నది.

# తైత్తిరియోపనిషత్తు

## (శిక్షావల్లి)

సాధకుఁడెప్పుడు సాగించు పూజలఁ
దాదాత్మ్యమును జెందఁ దవరవలయు
సగుణరూపమున విశాల బుద్ధినిసాగి
ప్రతిమను సేవింపఁ బరఁగవలయు
ఆ ప్రతిమందుఁ దానారాధన సేయు
దైవరూపముఁ గాంచఁ దలఁపవలయు
తద్దైవ భావముఁదార్పన జెందాన
వాత్మయందలవడ నరయ వలయు

సద్ధి యుపవాసదీక్షలో నలఘుశక్తి
నిండుఁదనమొప్ప విలుకడ నెమకవలయు
ఇదియ! సగుణంపుటోపాసనంబను, స్వామి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 8

ఓ రామచంద్రా!

---

ఈ ఉపనిషత్తు మూడు విధములు. శిక్షావల్లి, బ్రహ్మవల్లి, భృగువల్లి అని చెప్పబడినది. శిక్షావల్లిలో సగుణోపాసన గురించి చెప్పబడినది. బ్రహ్మవల్లిలో బ్రహ్మము బడయుట గురించి చెప్పబడినది. భృగువల్లిలో బ్రహ్మజిజ్ఞాసలు నేర్వవలసినపనులు చెప్పబడినది. శిక్షావల్లియనగా, సాధకుడెప్పుడు తాను పూజించు దైవరూపమును ప్రతిమలో గాంచుచు దానిని ఆరాధించుచు ఆత్మలో దానిని నిలబడునాగున సేవించుచు, అనగా తాదాత్మ్యము జెందుచు నుపవాసదీక్షలో నిలువవలయును. దీనినే సగుణోపాసన అందురు. ఇది శిక్షావల్లి. తైత్తిరియోపనిషత్తు చెప్పుచున్నది.

# బ్రహ్మవల్లి

ఏకాగ్రతను నిల్పి యునదించు వాత్మలో
నిర్గుణబ్రహ్మను నిలుపవలయు
సాపేక్షమూలమున్ సహకార మందించు
భావనాస్ఫూర్తిని బడయవలయు
ఉపవాసదీక్షలో నెన్నియో రీతుల
నలవాటు సేయుచు మెలఁగవలయు
సత్యవాచాధృతి సంకల్పసిద్ధికి
నిరవైన జీవిత మిమడవలయు

అపుడు! యాత్మానుభూతిని నందవచ్చు
అదియ! బ్రహ్మమనఁగ సత్యమనఁగ నొప్పు
వాని బడసినవాఁడెల్ల బ్రహ్మమౌను!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 9

ఓ రఘుకుల రామచంద్రా!

మానవుడు ఏకాగ్రత నిల్పి ఆత్మలో బ్రహ్మనుగూర్చి నిర్గుణోపాసన చేయవలయును. మనస్సులో యాత్మలో బ్రహ్మ జిజ్ఞాసను నిలుపవలయును. తాను చేయు ఈ ఉపవాస దీక్షలలో అనేకరీతుల మనసుగూర్చి సత్యసంకల్ప దీక్షలో ధృతిపూని జీవిత మును గడపవలయును. తాను ఆత్మానుభూతి పొందు వరకు అనేకరీతులో ఉపాసనలు చేయుచుండ వలయును. చేయగా చేయగా బ్రహ్మమును పొందగలుగును. చివరకు తానే బ్రహ్మమగును ఇది "బ్రహ్మవల్లి"

# భృగువల్లి

ఉపవాసదీక్షలో నూరడిల్లి భృగుఁడు
బ్రహ్మకై ప్రశ్నించె వరుణమూర్తి,
అన్నము పరబ్రహ్మమని చెప్పె వరుణుఁడు
దాని శోధించి కాదనియె భృగుఁడు
పలువిధాలోపాసనలు సేయుమని చెప్పె
వరుణమూర్తి—యదియు వరుసఁజేసి
ఆత్మయ[1] బ్రహ్మమటంచుఁ దెలిసికొనె
భృగుఁడంత; నద్దాన భృగుఁడు తాను

బ్రహ్మమయి కృతార్థుఁడగుచు వరలె!
బ్రహ్మ జిజ్ఞాసలో నేర్వవలసి నటుల
పద్ధతుల్ చెప్పెడిది, భృగువల్లియగును,
రమ్యగుణసాంద్ర[1] రఘుకులరామచంద్ర! 10

1. రామచంద్రా!

---

ఈ భృగువల్లిలో పూర్వము సూచించబడిన బ్రహ్మను పొందటానికి శ్రేష్ఠమైన సాధనము తపస్సనియు దానిద్వారా అన్నమయాది పంచకోశ విశ్లేషంచేసి అది నిజముగా బ్రహ్మముకాదని తెలిసికొనెను. భృగుడు తండ్రియైన వరుణమూర్తిని బ్రహ్మకై ప్రశ్నింప అన్నము బ్రహ్మమని వరుణుడు చెప్పెను దానిని శోధించి అన్నము బ్రహ్మకాదని భృగుఁడు తిరిగి చెప్పగా తండ్రియైన వరుణమూర్తి పలురకాలోపాసనలు చేయమని చెప్పగా భృగుడు వాటినన్నిటిని చేసి చివరకు ఆత్మయె బ్రహ్మమని తెలిసికొనెను. కనుక బ్రహ్మజిజ్ఞాసలో నేర్వవలసిన పద్ధతులు తెల్పెడిది "భృగువల్లి" యగును. చివరకు భృగుడు తానె బ్రహ్మమయెను.

# సగుణోపాసనము

నీనామ మంత్రంబు నిత్యోపదేశంబు
బహుజన్మ సఫలంబు భాగ్యదంబు
నీనామ భజనంబు నిత్యకైవల్య ఘం
టాపథసిద్ధ గుణప్రియంబు
నీనామ ఫలితంబు నిర్మలగుణకోటి
శారదాపీఠికా సమ్మతంబు
నీనామ మహిమంబు నిర్వికల్పాగమ
సిద్ధంబు నిష్కామచింతనంబు

నీవులేనిదె నిఖిలంబు నిలువదెందు!
నీవులేనిదె కాలంబు నెగడదెందు!
నీవుకానిది వేరొండు తావులేదు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 11

ఓ రామచంద్రా!

నీ నామోచ్చారణవలన బహుజన్మ భారంబు వదలును. నీనామ మంత్రమువలన కైవల్యానికి దారి నొసంగును. నీ నామము జపించుటవలన శారదాపీఠానికి దనుకూలించినందున సరస్వతీదేవి ప్రసన్నమగును. అనగా విద్యావంతుడగును. నీ నామము స్మరించుటవలన నిష్కామయోగము ఘటించి నిర్వికల్పాగమము సిద్ధించును. కనుక నీవు కానిది జగత్తులో నేమియు లేవు. నీవులేని కాలమహిమంబులేదు.

జిజ్ఞాసవేదిపైఁ జిలికెడి వేదవి
ద్యారహస్యంబు సత్త్వగుణరాశి!
అఖిలలోకైక రక్షాశ్రయమై నిల్చు
భవబంధహరమైన భవ్యదీప్తి!
వరయోగి మానసభక్తి ప్రపూరిత
నిర్మలానందపు నిశ్చలమ్ము!
సకల చరాచర సందోహవాసమై
భవ్యమై విలసిల్లు దివ్యమహిమ!

నీదు రూపురేఖలు నిండి నిలచియుండ
సకల దేవతావర్గము సంభ్రమించి
మూఁడువేళల నినుమెచ్చి మురిసిపోవు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 12

ఓ రామభద్రా!

నీవు యనఁగా జిజ్ఞాసలో వేదవిద్యారహస్యమైన సత్త్వగుణరాశివి. సమస్త లోకములకు రక్షాధిపతివైన భవబంధములనుండి విముక్తిఁ గలుగఁ జేయువాడవు యోగిపుంగవుల హృదయారవిందములను రంజింపఁ జేయువాడవు లోకములో సకల చరాచరములందు నిలఁబడి ప్రకాశించువాడవు. నీదు రూపురేఖలు నిండి తొలికాడగా సకల దేవతలు సంభ్రమించి నిను జూచి పొంగిపోవుదురు. అనఁగా నిన్ను గాంచి స్మరించి సంతోషింతురు.

నీనామ మంత్రమ్ము నేర్చినంతనె నిన్ను
ఆత్మలో వాల్మీకి యరయఁగల్గె!
అడవిలో సీతమ్మ యద్వైత దృష్టిని
నిన్నుంబడసె వేగఁదన్నుఁదెలిసి!
అంధుఁడు ధృతరాష్ట్రుఁడర్థించి నినుగాంచె
విశ్వరూపముఁజూపు వేళలందుఁ!
చిటిపొటిమాటలఁ జింతన సేయుచుఁ
దనలోన నినుఁజూచెఁ దాతగాంధి!

ఆత్మదృష్టికి నెద్దియు వస్తురాదు
కలఁడనెడు నిన్ను నాత్మలోఁ గాంచుచుండఁ
గోటిస్వర్గాలు తనముందుఁ గూడుకొనును!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 13

ఓ రఘుకుల తిలకా!

నీ నామము స్మరించినంతమాత్రమున వాల్మీకి మహర్షియై తన యాత్మలో, నిన్నుఁ జూడఁగలిఁగెను. అడవిలో సీతమ్మ తన్ను దానెవరో తెలిసికొని యద్వైతసిద్ధిలో, తాను యగోచరముగా నున్నవేళ నిన్ను స్మరించి నిన్ను తనయాత్మలో నిలబెట్టుకొనెను. నీవు ద్వాపరయుగములో కృష్ణావతార మెత్తినపుడు, పాండవులతో, కౌరవులకు సంధి కలుఁగజేయ రాయబారమునకు కౌరవసభకేగినపుడు, విశ్వరూపము ప్రదర్శించినకాలమున, అంధుఁడైన ధృతరాష్ట్రుడు నిన్నర్థించి నీ రూపురేఖలు జూచి, నీవెవరివో తెలిసికొనెను. మహాత్ముఁడైన కరంచందుగాంధి నిన్ను చిటిపొటిమాటలతో స్మరించి, తన యాత్మలో నిన్ను జూడఁగలిగెను. కనుక నాత్మ దృష్టితో నిన్ను జూచినవారికి, కలడని నమ్మి సేవించినవారికి వారి యాత్మలో నీవు కనిపింతువు. అని తాత్పర్యము.

విశ్వమ్ము తిరిగెడి వింతభ్రమణము నీ
యెడఁదలోఁ బుట్టెనో! యెవ్వఁడెరుఁగు!
సూర్యచంద్రులకాంతి ఘలఘసాధ్యము కాని
నీ ప్రణవాగ్నిలో విలిచెనేమొ!
అనురాగ బంధములధికమ్ములగునవి
విశ్వము పరికట్టి విచ్చెనేమొ!
మాయయే పుట్టించి, మాయయే గిట్టించు
ప్రజ్ఞా విశేషమ్ముఁ బలికితేమొ!

నిన్ను నీవయి సృష్టింప నేర్చితేమొ!
తలఁచిన కొలందిఁదలకెక్క పలువకావు!
నిన్నుఁ దెలియఁగనాత్మకే నేర్పుకలదు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 14

ఓ రఘుకులనాయకా! శ్రీరామచంద్రా!

సమస్త లోకాశ్రితమైన భూగోళము తన్ను మార్చునిదుట్టుట అనగా తిరుగు భ్రమణము నీ మనస్సులోనుండి తెచ్చినదేమొ దానిని యెవరు యెటుల గుదురు సూర్యచంద్రులలో మెఱసెడి కాంతిచ్ఛటము నీ ప్రణవాగ్నిలోనుండి ఉద్భవిల్లుచున్నదేమొ! నీవు సకల చరాచరములందు జూపు నీ యనురాగము విశ్వమందు ప్రతిఫలింపజేసి కాపాడుచున్నదేమొ. నీవు మాయ యనుదానిని ప్రయోగించి, దానిచేత పుట్టించుట, గిట్టించుటయను యీ రెండుపనులు నీ ప్రజ్ఞావిశేషమేమొ. నీకు నీవె సృష్టింపబడితివేమొ, ఈ విషయములన్నియు మానవులకైనను తలంచినకొలది సులభమైనదికాదు. బుద్ధికి లోబడినదికాదు. కాని దానిని తెలిసికొనవలయుననిన ఆత్మయనుదానికే నేర్పు కలదని భావించు చున్నాను. అని తాత్పర్యము.

తొలిజామువేళను ద్రొటువడక నిల్చి
జలనిధి నీ మేముఁగడిఁగినైన!
దనవెల్గు దివిటీలు తపనుండు చేపట్టి
మునుముందుఁ బఱుఁగిడి ముదముఁగూర్ప
వేదసరస్వతి నీదు మూర్తికిఁ బొంగి
భక్తిప్రస్తుతులఁ బ్రణుతిసేయ!
వివిధసేవలొనర్చి విశ్వంభరాదేవి
తనయాత్మలో నిన్నుఁదలఁచుచుండ!

దన్మయానంద రూపవుఁదనువుఁదాల్చి
వెలఁగిలోకాలు పాలించు చిద్విలాస!
వేరు వివరించి నినుమెచ్చు విధముకలదె!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 15

ఓ రామచంద్రా!

నీ శరీరమును తొలిజామునందె సముద్రము స్వచ్ఛముగా కడుగుచున్నది. సూర్యుడు తన కాంతియను దివిటీని చేతపట్టి నీకు దారి చూపుచున్నాడు. వేదమనె సరస్వతీదేవి తన బుద్ధికుశలతచేత భక్తిచేత, నమస్కరించుచున్నది. అనేకరకములైన సేవలొనర్చి విశ్వంభరాదేవి తనయాత్మలో నిన్ను తలంచుచుండగా నీవు తన్మయానంద రూపములో నిలచి, లోకాలు పాలించుచు కాపాడుచున్నావేమో యెవ్వడెఱుగును. నిన్ను వేరుగా వర్ణింప నెవ్వరితరము తండ్రి రామభద్రాయని భావము. తాత్పర్యము.

పాండిత్యగరిమచేఁ బ్రబలమౌ నీశక్తి
బయలుపఱచ నెంతవాఁడ నేను!
లోకాలు పాలించు శ్రీకరమౌ నీదు
ముద్రయే నెవరున మదలనిచ్చు!
జ్ఞానదీపము కాంతసరవిని మెఱయంగ
నాత్మయే నద్దాని వావరించు
నిన్నుఁబోలినవాని నెమకంగ సరివడు
నాయురారోగ్యమహత్తు నిమ్ము!

జ్ఞానభిక్షకై యాచించి జాలివడెడి
కథలు సెప్పెడి కాలమ్ము కలిసిరాగ
నీ లీలలు గాంచగ నేర్పునిమ్ము!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 16

ఓ శ్రీరామచంద్రా!

నా పాండిత్యముచేత కవితచేత నిన్ను నీశక్తి సామర్థ్యాలు వర్ణింప నెంతవాడను స్వామి నేననియు, కనుక నీవు జ్ఞానమనెడి దీపమును నీవు ప్రసాదించిన నాయాత్మ దానిని అనుసరించి, నిన్ను పోలినవానిని యనగా నిన్ను కనుగొనుటకు నాకు ఆయురారోగ్యములనిమ్ము! నేను జ్ఞానమనుదానిని నాకు నీవు ప్రసాదింపగా దానిచేత నీ మాహాత్మ్యము కలుగు కథలను చెప్పుట యందలి నేర్పునిమ్ము అని కవిస్వామిని వేడుకొనుచున్నాడు. అంతయు నీవె యనియు తన ప్రజ్ఞా పాటవములు నీవేయని తనకంటు యేమియు లేవని కవి పల్కుచున్నాడు. అని తాత్పర్యము.

ఆకాశవీధిలో నణు సముద్రము వోలి
కనుపించు చుక్కల కాంతియేల?
పృథ్విపై జీవించు భిన్నభిన్నములైన
జీవకోటుల నొంచు చింతలేల?
పాపపుణ్యములంచుఁ బరమాత్ముఁడంచు నీ
లీలలు దెలియంగ లిప్సయేల?
బద్ధమెయ్యదియో! యబద్ధమెయ్యదియో! యె
ఱుంగక బుధులు కలంగుటేల?

నీదు లీలలు దెలియంగ నెనరుఁబూని
సాధుహితచిత్తులై సత్యసాధనమ్ము
సేయుపొంటె; నిర్మించితీ చేష్టలిల్ల!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 17

ఓ శ్రీరామచంద్రా!

సత్యసాధన మొనర్చుకొఱకు నీ లీలలతో సృష్టించిన చుక్కలకాంతి తెలిసికొనుటకనియు భూమిపై జీవించు రకరకాలైన జీవరాశిని పెంచి తిరిగి వాటిని నశింపజేయుటేల యనియు, పాపమనగానేమొ, పుణ్యమనగానేమొ, పరమాత్ముడవైన నీ లీలలను తెలుసుకొనగా కోరిక యేలనియు లోకములో సత్యమేదియో, అసత్యమేదియో తెలిసికొనుటకు బుద్ధులు భ్రమించుటేలనియు, ఇవియన్నియు నీ లీలలని నెఱుంగుటకొఱకే నిర్మించితీవు, ఓ రామచంద్రా! అని తాత్పర్యము.

కొండకోనలలోనఁ గూర్చిన శృంగార
మెంతగాఁ జెక్కితో వెఱుక వడదు!
శిఖరాగ్రమునుండి చిందెడి జలపాత
మేరీతి వడిపితో వెఱుక వడదు!
కనువిందు సేసెడి కఠినంపుఁగొండల
నేగతివాటితో వెఱుక వడదు!
సంజ ప్రొద్దులఁగూడు సచ్ఛిల్ప పటముల
వే క్రియవ్రాసితో వెఱుక వడదు!

ప్రకృతిరమ నివాసము సేయఁబడిలపఱచి
సృష్టినెల్లను జెక్కితి శిల్పమందు
నీదు శిల్పముఁ దెలియఁగనేరనైతి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 18

శ్రీ రామచంద్రా!

ప్రకృతిని సౌందర్యముగా తీర్చిదిద్దితివనియు, నీవు తీర్చిదిద్దిన శిల్ప సౌందర్యము తెలియంగ నెవరితరమగుననియు, కొండకోనలలోన దిద్దిన శృంగారమెంతని వర్ణింపవలెననియు, ఆకొండ శిఖరాగ్రాలనుండి జలపాతము పడుట చూచిన కనువిందు సేయుననియు, సంధ్యల కాలములలో రంగులవేళ రకములుగ సృష్టించి ఆ శిల్పసముదాయమును నీవెంతగా వ్రాసితివనియు, ఈ సృష్టియంతయు ప్రకృతియనె రమాదేవి నివసించుటకుగాను నీవే శిల్పముగ జెక్కితివని తాత్పర్యము. అనగా ప్రకృతి సౌందర్యము నీవేయని భావము.

వాల్మీకి పదశక్తి భక్తిభావ లహరి
నీలోన శక్తిని నిజము వల్కె
నాలుగువేదాలు నందనవనమున
హైందవధర్మముఁ బొందు పఱిచె
కాళిదాసత్రయ కావ్యకన్య లెలమి
సాహితీప్రజ్ఞలఁ జాటి చెప్పె
భారతాంధ్రకవులు భారతాంబాచరి
త్రము రచింపఁగఁదవియఁగూర్చె

నాఁటినేఁటికి రాఁబోవు నాఁటికైన
కాలపరిమితి మారని కథలు సెప్పి
యుగయుగాలు తరింపఁగ యుతమొనర్చె
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 19

౬. రఘురామచంద్రా!

వాల్మీకిమహర్షి వ్రాసిన పదశక్తి వాని భక్తిభావలహరి, నీ చరిత్రను వ్రాసి నీలోని నిజమును తెలిసికొనియె. నాల్గు వేదాలు విభాగించిన వ్యాస మహర్షి హిందూమత ధర్మముల నిల్వులాగున చేసెను మహాకవి కాళిదాసు తన ప్రజ్ఞాపాటవములచేత గీర్వాణకావ్యములను సృష్టించి సాహిత్య పుంప్రజ్ఞ లను చాటిచెప్పె. ఆంధ్రభారతమును వ్రాసిన కవిత్రయము, నన్నయ; తిక్కన శంబువరప్రసాదులు, తమ ప్రజ్ఞావిశేషములచేత సాహిత్యమును పెంపొందించి వారి గొప్పందనమును రచింపంజేసిరి. ఇప్పుడు జరుగుచున్న వర్తమానకాల మునగాని. జరిగిపోయిన కాలమునగాని, కాలపరిమితిని మారని యారని రచనలుచేసి హిందూత్వమును సృష్టించి తేటపరచి లోకోపకారమొ మొనర్చి రని తాత్పర్యము.

వైష్ణవీశ క్తిఁ బ్రబలంగఁ జేసిన
కృష్ణరాయలు పేరు కీర్తిఁగాంచె!
ఆంధ్రభారత రచనారంభఘనత రా
జేంద్రుని పాలిటఁ జేవఁగూర్చె!
కువలయాధీశులు కొఱఁత లేకున్నను
వారిరువురిపేర్లు బయలు వడియె!
ఆంధ్రదేశమునకు నాదినుండియు వారు
చేసిన సేవలో సిద్ధిఁబొందె!

దేశగౌరవమొక వంకఁదేటఁ బఱచి
నీదు సేవలొకదిశను వాదుకొల్పి
రాజ్యమేలినవారి కర్ణముల నెంతు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 20

4 రఘురామ ప్రభో!

రాజులు పరిపాలించిన కాలాన రాజలోకమున యిరువురు ప్రసిద్ధి చెందినవారై వైష్ణవశక్తిని ప్రబలంగఁజేసి, రాజ్యభారముతోపాటు నీ దయా ధర్మరక్షణలో పేరందిరి. వారు శ్రీకృష్ణదేవరాయలు, రాజరాజనరేంద్రులు. ఆదికవియని పేరందిన నన్నయ్యగారిచేత భారతమును ఆంధ్రీకరింప జేసెను. కనుక రాజ్యపాలనలో ప్రజాసేవ లొనరించుచు, నీ సేవలో సిద్ధి పొందు లాగున దేశసౌభాగ్యగరిమలో నిలబడిరి. కనుక నీ భక్తిప్రపత్తులలో నిలిచిన వారి సేవను నేనెంతుమ. వారికి నమస్కరింతునని భావము.

అణుమాత్రమైన విన్నరయగలవా లేవా!
జగములు నీవెంటఁ జనుచునుండు
వరిముల్లుపోలిక సరితూగుదువా లేవా!
వేదాలు నినుఁగూర్చి వినుతి సేయుఁ
గంటిలో నలుసంత కనుపింతువో లేవా!
స్తుతియింత్రు నిను రవిసోమముఖులు
గాలిలో రవ్వంత కనుపింతువో లేవా!
భక్తులెల్లరు నిన్నుఁ బలుకరింత్రు!

సర్వ సర్వంసహాయలర్చి సంభ్రమించి
నిన్ను భజియించుచుంద్రు నీ కన్నుఁదెలియ
నీ మహత్త్వపుసిద్ధికి నేర్పుగలదె!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 21

ఓ రామచంద్రా!

అణుమాత్రమయినంత నిను జగములెల్ల కనుగొనగలవో లేవో, కాని నీ వెంటను వచ్చుచుండును. వరిముల్లు పోలికంత నిను వేదాల సరస్వతి కనుగొనునా లేదా కాని నినుగూర్చి యెల్లప్పుడు నుతించుచుండును. కంటిలో నలుసంత కనిపింతువా లేవా కాని నిన్నుగూర్చి రవిసోములు ప్రార్థింతురు. గాలిలో ఎగురు రవ్వంత కనిపింతువు లేవా కాని భక్తులెల్లరు నిన్ను ప్రార్థించి పలుకరింతురు. అనగా సర్వసర్వంసహ నిన్ను యెల్లప్పుడు స్మరించి, సంభ్రమించి, భజించుచుందురు నీతావు కనుగొనుటకై. నీ మాహాత్మ్యమును కనుగొని నీతో నిలుచుటకు, నీవెంట పైజెప్పబడినవారు పలుకరించుటనగా నీతోనె వారందరుందురని, నీతోనే సృష్టి నిలుచుచున్నదని తాత్పర్యము.

బాలేందుఁడెంతగాఁ బాలుఁగిరి భువిఁజుట్టి
　　నయ్యది నీలోని యాజ్ఞసుమ్ము!
హిమవంతుఁడెంతటి మహీధరుఁడైన నీ
　　కాలిగోటికెనయై కదలకుండు!
జలనిధులేడెంత జలములఁగూర్చిన
　　నీలోని మహిమకు నిలిచి యుండు!
రవిబింబమెంతటి రమణీయత మెఱయ
　　నీలోన దీప్తికి నిలిచి వెలుఁగు

నిత్యము నినుజేరి నినుగని నెగడంగ
జగమునీవయై నిలుచు నిజమ్ముసుమ్ము!
నీవులేనిది యితరంబు నిలువదెందు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 22

ఓ రామచంద్రా!

నీవులేనిదే జగత్తులేదు లోకాలులేవు. చంద్రుడు భువిఁజుట్టెడి కీర్తి నీ వొసంగినశక్తియె. హిమవంతుడు ఎంతటి బలశాలియైనను నీ శక్తిముందు తలప నీ కాలిగోటితో సమానమని తలంతును. ఏడు జలనిధులు తామెంతటి జలములచేత గొప్పవైనను, వాటి గొప్పందనము నీలోని మహిమయే. సూర్యుడెంతగా ప్రజ్వరిల్లినను యది నీవొసంగిన దీప్తియెసుమ్ము. కనుక సర్వమునకు నీవె కారణమై యుంటివని తలంతును. అని తాత్పర్యము.

చక్రవాకములేమి సందేశ మిచ్చెనో!
వాల్మీకి నిమగూర్చి వ్రాసె గాథ
కోతిమూకలకేలఁ గోరిక పుట్టెనో
నీవంక మేలుకై నిలిచి చేసెఁ
పక్షి జటాయువు పరమాప్తబుద్ధి నీ
సతిజాడఁ దెలియంగ సాక్ష్యమిచ్చె
సాగరమూర్తి నీ శక్తిఁ దెలియఁదన్ను
తానుగ లంకకు దారి నొసఁగె!

మానవేతరములకైన మమత లిచ్చి
మంచి సృష్టించి పెంచితీ మలయుజగము!
నాత్మఁగూడని నాఁడవ్వి యలరఁగలవె?
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 23

ఓ రామభద్రా!

మానవేతరములైన పక్షులు, జంతువులుకూడ నిన్ను ప్రార్థించి నిలుచును. నీవా జంతువులు పక్షులకు నాత్మ కలుగజేయనియెడల, అవి నిన్నెట్టుల గుర్తించుచున్నవో నీ రామకథకు నిలిచి నీకు సహాయము చేసినవిసుమా యని భావము. ఏవిధముననగా చక్రవాకపక్షులు వాల్మీకిమహర్షికి సందేశ మిచ్చెనో యనునటుల, వాటిని చూచినవెంటనే శ్లోకమును చెప్పెను. బోయవాడు ఒకపక్షిని చంపగా రెండవపక్షి దానిని జూచి విలపించుట, అదే సమయమున వాల్మీకి చూచి జాలిపడి శ్లోకము చెప్పుట కలిగినది. అదేవిధముగా కోతిమూకలు నీ కథలో పెరిగి నీకు మేలు కూర్చెనోయనునట్లు అవి నిలబడినవి జటాయువను పక్షి సీతాదేవిజాడ నీకు తెలియపర్చెను. సాగరమూర్తి తన్ను తానుగా ప్రత్యక్షమై లంకకు దారి నొసగెను. కనుక నీవు మానవేతరములకు మమతలిచ్చి పెరుగుచున్న జగత్తునకు మంచికొఱకు మేలు కూర్చితివి స్వామి అని తాత్పర్యము.

శబరి యెంగిలికెంత సత్త్వమనింపితో
భక్తితాత్పర్యముల్ పాటిచేసి
గుహుని పాదుశ(జూచి కొండంత మురిపితో
నాత్మానుబంధము లధికమగుట
కుబ్జగంధవు పిరి(గూర్చిన( బొంగితో
నవ్యయానందము ననుభవించి
శరణుసొచ్చిన విభీషణ పరమార్థము
వెంచితో దీమలకెలమి(గూర్ప

గుణగరిష్ఠులకెందును గుణము(జూపి
ఎల్లలోకాల నేలెడి నల్లనయ్య!
నీదు లీలలు వర్ణింపనేర నేను
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 24

ఓ రామచంద్రా స్వామీ!

నీదు లీలలు వర్ణింప నెవరితరము. గుణగరిష్ఠులను కాపాడెడి నల్లనయ్యవైన నీవు శబరి యిచ్చిన యెంగిలిపండ్ల నారగించితివి. కారణము భక్తితాత్పర్యమగుటవలన. గుహుడు నీ పాదమును కడిగి బోటులోని కెక్కించు కొనియె. కుబ్జయైన ఆమెచేత గంధపుపూత పూయించుకొంటివి. శరణుచొచ్చుట చేత విభీషణుని కాపాడితివి. ఇన్ని గుణములతో వారి నెల్లరను కాపాడుటన వారికి మంచిగుణములు గల్గులాగున సృష్టించి, లోకోపకారమొనరించు చుంటివి. కనుక నీ లీలలను వర్ణింప యెవరితరము కాదని తాత్పర్యము.

ఆదివిష్ణువుకంటె నానందమయమూర్తి
లేఁడటన్నను నీవు లేచి రావు
కూర్మితోఁగొనియాడి గోపురాల్ గట్టిన
బంగారమిచ్చినఁ బలుక రావు
తీర్థయాత్రలు సేసి తీరభూములఁ జూచి
వనుగడ సాధింప మంచియనవు
అల్లారుముద్దుగ నెల్లోకములనైన
శ్రమపడి నినుఁజేర సాయపడవు

కానుకలిచ్చి మెచ్చినఁ గంటఁబడవు
విశ్వమెల్ల నువ్వెత్తున విస్తరిల్ల
భక్తిభావాలఁ బెనఁగొన వలను బడుదు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 25

ఓ శ్రీరామచంద్రా!

నిన్ను గొప్పగా ఆదివిష్ణువుకంటె వేరుగలేడని పొగడినను, బంగారమునిచ్చి, నీకు గోపురాలను గట్టించినను. నీ కొఱకు తీర్థయాత్రలు చేసినను, నీవున్న స్థలము తెలిసికొనుటకై శ్రమ పడినను, కనికరించవని, కానుకలిచ్చి నను కంటికి కనబడవని, కాని భక్తిభావాలతో నిను పైన వేసుకొనిన నీవు కానిపింతువని, రూఢిగా తెలియుచున్నది. భక్తిభావాలకే లోబడగలవని తాత్పర్యము.

మానవతాదృష్టి మనవలయు నరుండు
సుఖదుఃఖములఁ జవిచూచి యనుచుఁ
దాత్కాలికము లెందుందగవంచు రూపించి
ప్రామాణికపుశక్తి బ్రతుకు మనుచుఁ
గష్టభారమనక కానసంబులకైనఁ
దలదాచుకొనఁబోవ వలయుననుచుఁ
గాయకష్టములకు న్యాయ్యమార్గమునోర్చి
తనువును బోషింప ననువటంచు

రూపలావణ్య కళ్యాణ రుచిరమూర్తి!
కనులవిందుఁ గాంచుచుఁ గరుణచూపి
యెల్లవారికి నేర్పితి వెల్లనడలు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 21

ఓ రామచంద్రా!

నీవు మానవావతారుడవై మనుష్యజాతికి నీ నడలు, నేర్పితివి. ఎట్లనిన జీవితములో సుఖదుఃఖములు పడవలయునని, తాత్కాలిక మనుగడకాక శ్రేష్ఠాభక్తులలో కష్టింపవలెననియు, కష్టకాలాన అడవులపొందు కలిగి వర్తింప వలసిన కాలము వచ్చిన అనుభవించ వలయునని, కాయకష్టములందైన న్యాయ్యమార్గాన ప్రవర్తింపవలయునని, లోకమునకొకపాఠము నేర్పినట్లుగా నీవు కనులపండువ సేయుచు గావించితివి. అదేవిధము మానవుడన్నిటను అలవాటువడి కష్టమందైనను సుఖమందైనను మనుగడ సాధింపక తప్పదని లోకమునకు మార్గదర్శివై జూపితివని తాత్పర్యము.

ప్రజ్ఞమై రచియించె భారతంబు నెవండు
వానిదగు నీదు భాగ్యమెన్న
విజ్ఞాన దివిటీలు వెలిగించె నెవఁడు వా
నిదగు నీదు మహిమాన్వితయశంబు
గీర్వాణమును బల్కి కీర్తి నందెనెవండు
వానిదగును నీదు వాగమృతము
పుట్టుకతోడనె పూజ్యుఁడ యెనెవండు
వానిదగును నీదు స్వామిభక్తి

అరపదరప నేర్చినవారల లఘుమతుల
రైయలరుచుండ జన్మతో నైక్యమంది
నిన్నుఁదెలిసికొనిన వ్యాసు నెన్నతరమె?
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 27

ఓ రామచంద్రా!

తన ప్రజ్ఞాపాటవములతో భారతమును రచించి, దేశమునకు విజ్ఞానమనెడి దివిటీలచేత విజ్ఞానమును కలిగించి, భాషాదేవియైన గీర్వాణమును బల్కి కీర్తి గాంచెననియు, తన పుట్టుకతోడనె యివి అన్నియు వచ్చిననియు అందువలన వ్యాసమహానుభావుడు. నీ శక్తిసామర్థ్యాలతోడనె నిన్ను తెలిసికొనగలిగి నీలోనె ఐక్యమందినాడనియు, కనుక ఆ వ్యాసభగవానుని యెన్నుటకు తరముకాదని తాత్పర్యము. ఇది వ్యాసభగవానుని గురించి చెప్పిన స్తుతి.

ఉపనిషత్సారము నుగ్గుగాఁ ద్రావిన
యతిరాజు లెల్లరేగతికిఁ జనిరి?
బాలభాస్కరులైన ప్రహ్లాదుఁడు, ధ్రువుండు
నీకీర్తి కోరి నీకిడిరి నతులు!
శిబివిభుండును, దధీచి మునీశ్వరుండును,
ఏరాజ్య మేల మున్నేగినారు?
బలిచక్రవర్తియే బాములు గడవంగ
నీపాలఁ గలియంగ నిన్నుఁగోరె?

నన్నిరూపులు నీవు గావగుటఁజేసి
భక్తబాంధవమునకీవ ప్రాకులాడ
నీ పదాంకితసేవ మునిఁగిరి వారు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 28

ఓ రామచంద్రా! దయానిధి!

అన్నిరూపములు నీవే యగుట, నీవు భక్తులయొక్క బాంధవ్యము నకు ప్రాకులాడగలవనియు తెలిసికొనిన మహానుభావులు యతిరాజులు మునీశ్వరుండు, ప్రహ్లాదుడు, ధ్రువుడు, శిబిప్రభువు! బలిచక్రవర్తి మొదలైనవారు నీ కీర్తినికోరి వరించి తుదకు నీలోనె వారు కలిసినారు. వారందరు తీవ్రమైన నీ పదాంకితసేవలో మునిగి కీర్తి గడించిరి. వారిని ఆదర్శనముగా తీసుకొని యీ కవి నీ కీర్తిని రచించెను. వెల్లడించె అని తాత్పర్యము.

వాల్మీకి నినుఁజెప్పి వ్రాసెను నీగాధ
బహుజన్మ భారంబు వదలిపోవ!
త్యాగయ్య నినుఁగూర్చి తనువు పండించెను
గేయాలు పాడుచుఁ గీర్తినంది!
కుమ్మరిమొల్ల నీకొఱకుఁ గూర్చెను బ్రహ్మ
తేజస్సు జనియింపఁ దెల్గుఁగైత!
గోపన్న చింతించి గోపురాల్ గట్టించె
నీ పాదసేవలో నిలిచి కలిసి!

కావ్యవస్తువులోఁ గథగాఁ దెలింగి
దివ్యసందేశమాత్మకుఁ దేటఁబరచి
కనులపండువు సేయుచుఁ గ్రాలుచుంటి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 29

ఓ రామభద్రా!

మహనీయుడైన వాల్మీకిమహర్షి ఆదిలో నినుగూర్చి తపస్సుచేసి నీ గాధ వ్రాసెను. త్యాగయ్య గేయాలిపాడి తన జీవితమంతయు నీ సేవచేసి తనువును పండించి గీర్తినందెను. కుమ్మరి మొల్ల నీ భక్తురాలై నీ గాథను వ్రాసి తెల్గుకైతను తేటతెనుగు జూపించి కీర్తినందెను. కంచర్లగోపన్న నీ భక్తుడై నీకు దేవాలయమును గట్టించి పేరు హొందెను. ఇవన్నియు జరిగి పోయినకథలు కనుక కావ్యకథలలో తెలియుచున్నవి. చదివినవారికి యాత్మలో ప్రవేశింతువు. వారికి కనులపండువ కూర్చుచుందువు. అని తాత్పర్యము.

ఆత్మసిద్ధికొఱకు నాదరించితి నిన్ను
కేలూఁత లిచ్చి దక్కించుకొంటి
నీ రూపురేఖలు నిజముగఁ జూపించి
కనువిందుఁ గూర్చితి కనికరమున
నీ సరిఁదూగంగ నిలిచెడి లోకముల్
నీలోన మాయమై నిలచియాఁడ
నాత్మదృష్టికి సిద్ధి, యచల ప్రమేయమై
స్వానుభవము పొంది సాగుచుండ

నిశ్చలాధీనమైన నీ నేర్పుఁగాంచు
ప్రకృతిరమ నిల్చి నాయందఁబలుకుచుండ
నెగడి నీ విద్యలను బల్కి నిలిచియుందు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 30

ఓ రామచంద్రా!

నా యాత్మానుభవముచేత నిన్ను నరయుచుంటిని. కాని నా యాత్మలో నీవు కనబడగలవని ముందుగా కలిపించుచుంటినని తలంచుచుంటిని. నా సరస్వతీదేవి కటాక్షములచేత నీ విద్యలన్నియు నేర్చి పలుకగలనని నమ్ముచుంటిని. ప్రకృతి రమాదేవికూడా నాయందు నిలువగలదని నిశ్చలానందముతో మెలంగుచుంటిని అని తాత్పర్యము. ఈ పనులకంతటను నీవే కారణము.

ఊహాకందఁగరాని యుజ్వల తేజమై
మన్మనోవీథిని మసలుచుండ
నానందలహరికి నావాసతిలకమై
జీవనప్రాయమై దీరు లాఁడఁ
బెంచి నడెందానఁబింటప లాఁడంగ
వెలలేవి యాత్మను జిలుకరింప
దినచర్యలో నది దేదీప్యమానమై
కాలచక్రమ్ముపఁ గదులుచుండఁ

గొసరికొసరి నీ పరమాత్మగుణముఁ జెప్ప
వాఙ్మనఃక్రియల న్నిల్పి వరలుచుంటి
దానిఁదెలియంగఁ జెప్ప నా తరముకాదు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 31

౬. రా ఘు వేం ద్ర!

నీవు నా యూహాకందక ఉజ్వల తేజమై నా మనోవీథిని నుండ, నాలోని యానందమున నీవు నివసించి, జీవన ప్రాయమున కదలుచుంత, నా పెంచినడెందమున నాలో నీవు మసలుచు నా యాత్మను రంజింపజేయుచుండ, నా దినచర్యలో నది దేదీప్యమానమై కదలుచుండ, నీ గొప్పందనమును నా వాక్కునందును మనసునందును క్రియలయందును నెల్లప్పుడు ప్రకాశమిచ్చు చుండగా, దానిని వర్ణింప నా తరముకాదు స్వామి అని తాత్పర్యము.

కుమ్మరిసారెపైఁ గూర్చెదు శిల్పమ్ము
వడివంక లేని సవరణదిద్ది
కవికలంబున నిల్చి కావ్యముం జెప్పెదు
రసజగత్తును దెల్పు వ్రాఁతలందు
రాజముద్రిక నిల్చి రాజ్యమ్ము రేలెదు
జారని సత్యముఁ జాటుకొఱకు
వరవీణ మృదురాగ పల్లవి పలికెదు
నీ కీర్తనలు పాడి వెగడుకొఱకు

నీవు లేకున్న విద్యలులేవు జగతి
నిఖిలమును బ్రచ్చి యనుభూతి నరసికొన్న
సత్యకాంతుల నెలకొన్న కాంతమూర్తి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 32

! శ్రీ రా మ చ ం ద్రా!

కుమ్మరిసారిపైన కుమ్మరి మంటిపాత్రలను చేయుచుండ వంకలు లేకుండ దిద్దుదువు, కవి కావ్యమును వ్రాయునప్పుడు రసజగత్తును వర్ణించునపుడు, వాని కలమున నిల్చి వ్రాయించుచుందువు, లోకాలను పాలించు రాజుయొక్క ముద్రలో నిలంబడి సత్యమును జారనీక కాపాడుదువు, వీణ పాటలో వీణను పలికించునప్పుడు, వైణికుడు నీ పాటను పాడునప్పుడు, రాగ పల్లవులందు నిలంబడి పలుకుదువు. అనుభూతిచే పై విషయములను తెలిపి నానిన నీవులేని విద్యలు జగత్తునలేవు. అన్ని విద్యలందును నీవె వెల్గుచుందువు స్వామీ అని తాత్పర్యము.

సంతోషవార్థిని జలకమాడెడి వాడు
　　　　విద్యాసరస్వతి విందుఁగూర్ప
నవరాగపల్లవ జవసత్త్వముల చేత
　　　　కుసుమించు డెందముకూర్చి పలుక
నవిరళతపమున ననిశమ్ము నినుఁదేర్చి
　　　　మన్మనోవాక్కుల మననసేయ
నిండుడెందాన మనీషల చెల్మినిఁ
　　　　గొనియాఁడు కీర్తన తనివిఁగూర్పఁ

గోటిస్వర్గాల కెనయైనచోటు వీడి
మధురభావాల కిరవైన మామకీన
హృదయపద్మమ్ముఁ జేరఁగాఁ గదలిరమ్మ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 33

ఓ రామచంద్రా! సుగుణసాంద్రా!

మధురభావాలకు నిలయమైన నా హృదయమును జేర రమ్మని రామచంద్రుని కవి ప్రార్థించుచున్నాడు తన మనసు సంతోషమనెడి వార్థిలో తన సరస్వతీదేవి జలకమాడుతుందనియు కమ్మని రాగపల్లవములచేత తన డెందము కుసుమించుననియు, ఎప్పుడును తపమొనర్చువిధాన తన మనస్సులో నిన్ను స్మరించుచుండుననియు, అందువలన తన హృదయపద్మమును జేరగా గొలుచుకొనుటకై రమ్మని కవి ప్రార్థించుచున్నాడు అని తాత్పర్యము.

కడలిలోఁ జెలరేఁగు బడబానలమ్మును
 గోటితోఁ గాపాడు మేటి యెవఁడు!
ఎల్లజీవమ్ములఁ దెల్ల వారు దనుకఁ
 బుట్టించి పోషింపఁ బూనునెవఁడు!
సూర్యచంద్రులు తమచూడ్కిని దెనుపొంది
 నడవంగ నేర్పిన నటకుఁడెవఁడు!
సాగరంబును దన సాహసమ్ము కొలంది
 విహరింప నదుపులోఁ బెట్టువెవఁడు!

బుద్ధి నియతిమై లోకాలఁబుట్టి పెరుఁగు
వాయు, వహ్నిఁ జలములఁ బరఁగునెవఁడు!
అట్టి ధీశాలివగు నిన్నుఁబట్టి గొలుతు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 34

ఓ శ్రీరామచంద్రా!

కడలిలో పుట్టెడు బడబానలమును అపువాడెవడనియు, తెల్లవారు సరికి జీవరాశిలో మెలగి వారియందు పుట్టుకలు నెలపువాడెవడనియు, సూర్య చంద్రులు తమ మార్గాన తప్పటడుగులు వేయక నియతి నియమములలో నడుపువాడెవడనియు, సాగరములు తమ హెంశముకొలది విహరింపక అడ్డుకొని అదుపులో పెట్టువాడెవడనియు, వాయువు, అగ్ని, నీరును లోకాల పుట్టించి విహరింపజేసిన వాడెవడనియు, అటువంటి ధీశాలియైన రామచంద్రుని ప్రార్థించుచుందునని తాత్పర్యము.

పరమార్థలీలలు పట్టువడక యున్నఁ
గలిలోని మాయను గనుట యరిది
తనువులో శక్తికి దాంతిఁగూర్పక యున్న
సహము నశించుట యసలె సున్న
భక్తిమార్గమ్ములోఁ బ్రతిలక యున్నతో
తనకుఁదానె శ్రుతువై తలరిపోవు
నవివేకమణఁగదే! నందుని గతిఁబ్రాణి
బాటఁదప్పి యవస్థఁబడుట నిజము

అన్ని విడిచినవానికి నాత్మలేదు
సృష్టికర్తకు వానిపైఁజేదు కలుఁగు
దోషములు తనవెంటనే దొరలివచ్చు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 35

ఓ. శ్రీరామచంద్రా!

దైవము కలదని యాలోచనాసమర్థత లేనప్పుడు, కలికాలములో నున్న మాయకు మానవుఁడు లోఁబడును. శరీరములో శక్తికి దాంతిగుణ మవసరము. అట్లు లేకున్న "అహమను"నది నశింపదు. దానికితోడు భక్తి మార్గమున్నతో తనకుతాను శత్రువు కాఁజాలఁడు. అవివేకమును వదలి ప్రవర్తింపవలెను. అన్ని విడిచినవానికి అనఁగా భక్తిమార్గము, దాంతిగుణము, నీవు కలవని నమ్మిక లేనప్పుడు ఆత్మను స్వాధీనము చేసుకొనలేడు. లోకములో తానుచేసిన వనులోఁగల లోపములచేత, చివరకు సృష్టికర్తకుకూడ నతనిపైన నమ్మిక లేకుండును, నిరసించును. అనఁగా మానవుడు యెప్పుడు మంచి కార్యములు చేయుచు భక్తిమార్గముతో ప్రవర్తింపవలెను.

చీఁకటిముసుగులు సీరగా వలెనన్న
విజ్ఞానసూర్యుఁడు వెలుఁగవలయుఁ
బ్రతిభతో మేదస్సు ప్రతిఫల మీవలె
నన్న గుణము కొంచెమవసరమ్ము!
దీర్ఘదృష్టిని నిను దిలకింపవలెనన్న
భక్తియుక్తిని నాత్మఁ బడయవలయు
ఆత్మయు బుద్ధియు వాగకయొకసారి
యేకమైనపుడె నీ వెలుకవడుదు

శాంతిదాంతుల నేకత సంభవించు
శాంతిదాంతులు నిష్ఠకు శక్తినిచ్చు
నిష్ఠయేసుమ్ము! తపమగు నిర్వహింప
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 36

ఓ రామచంద్రా!

మానవు డజ్ఞానమునుండి యుద్ధరింపఁబడుటకు విజ్ఞానమనెడి సూర్య బింబమును ప్రజ్వలింపజేయవలయును. మంచిపనులందు మంచి గుణమును విడువకుండా వ్యవహరించిన తన మేదస్సు తనకు ప్రతిఫలమిచ్చును. దీర్ఘ దృష్టితో నిన్ను గాంచవలెనన్న భక్తితో వాత్మను సంధానము చేయవలయును. లేక నింపవలయును. ఆత్మయు, బుద్ధియు నేకమైనపుడె నీవు ప్రత్యక్షమగు దువు. అటుల చేయుటకు మానవుడెప్పుడు శాంతి, దాంతి నిష్ఠలతోనేకీభవించి నిను ప్రార్థింపవలయును.

భౌతికకాయానఁ బరమార్థలీలలు
పట్టువడఁగ సీత చెట్టఁబట్టి
ఏకాగ్రతను విల్వలోకాలు పాలించు
రమణీయశక్తితోఁ గొమరు మిగిలి
విఱ్ఱవీగెడి దేశవిద్రోహులను జంపఁ
బయనమై యడవికి బాటపట్టి
కొండకోనలలోనఁగోరని దేశానఁ
గోర్కెలెల్లను దావఁ గుప్పవోసి

ఎడదఁబరమాత్మ శాంతికి నిల్లుఁగట్టి
కొంటెయైన యహంకారకుమతి రావ
ణాదులను గెల్చివచ్చితే! వాడు స్వామి
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 17

ఓ రా ఘ వా!

నీవు మానవావతారుడవై, మానవాళికి నీ నడతలు నేర్పుటకై పరమార్థలీలలు చూపించుచు లక్ష్మీదేవియైన సీత రూపమును దాల్చిన యామెను పెండ్లి యాడి, లోక కళ్యాణముకొఱకు దేశవిద్రోహులను అంత మొందించి, యటవివాసమును భరించి, కొండకోనలలోన కోర్కెలను చంపు కొని తిర్గుచు కష్టములను సహించి, యెడద శాంతిభావాలను రేకెత్తించి మాయావిగ్రహ స్వరూపుడవైన నీవు అహంకారపూరితుడగు రావణాదులను సంహరించి వచ్చితివి నాస్వామి నీకివే నమస్కారములు.

సాధుశీలముఁజూపి సాక్షి భూతుఁడవై తి
వినుఁజూచి జగమెల్ల నేర్చికొనఁగఁ
గోఁతిమూకల చెల్మిఁ గోరికొంటివివాఁడు
వంతెన గట్టంగ వనధిఁజేరి!
ఏకపత్నీ వ్రతమేలుకొంటివి యెల్ల
లోకాలను జయింప నేకధాటి!
రావణాహంకార రాజ్యమ్ము దిగఁద్రావి
యేకాత్మ జానకి నేలుకొంటి

జగము దిద్దఁగఁబుట్టిన సాధురూప!
మంగళమ్మగు నీకు నీ మగువకిత
కెల్లవేళల నాత్మలు పల్లవింప
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర!

ఓ నా స్వామీ!

మానవ అవతారమున నీవు అవతరించి, జగమెల్ల వినుజూచి నేర్చుకొనగ కష్టములకు లోబడి, కానల నివాసమొనర్చి, లంకను ప్రవేశించి, మానవేతరములగు జంతుజాలములు కోతిమూకలతోడ చెల్మి ఘటించి, వనిధిదాటి, ఏకపత్నీవ్రతుడవై, విజయధాటిని పెంపొందించి నీ యాత్మయనగ జానకీమాతను ఏలుకొనుటకై. అహంకారపూరితుడగు రావణాసురుని అంతమొందించి, జగము విన్నుగుర్తించులాగున, మానవులను దిద్ది తీర్చుటకై పుట్టిన స్వామి యెల్లవేళలను శుభమ్ముఁగును గాత. నీకును, జానకీమాతకు యని తాత్పర్యము.

సగుణ నిర్గుణమన సకలమ్ము నీవయై
యాత్మలోఁ గనుచుండ నడ్డులేల?
హరిహరులొక్కరేయని యాదినుండియుఁ
బల్కఁగ వేఱొండు వాదమేల?
విశ్వంభరాదేవి వేరుసేయక సర్వ
జగమును మోయఁగా శంకయేల?
గాలిలో దీపంబుగ్రాలునే యెపుడైన
నడ్డువెట్టక దాని నావుటెట్లు?

నిన్ను సేవింపనెఱుఁగుట నిజము దక్క
భిన్నమార్గంబు గూర్చునే పెద్దఱికము?
దాని నెఱుగంగ నాత్మకే తగునునుమ్ము!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 39

ఓ సుధామయ రామచంద్రా!

సగుణములోనైన, నిర్గుణములోనైన నిన్ను సేవించిన యాత్మకు కనుబడగలవు. హరి యనినహరుడన్నను ఒకటే యర్థమగును. మతభేదములులేవు. విశ్వంభరాదేవి మానవజాతిని, జీవకోటులను ఏకముగా మోయుచు శ్రమించుచుండగా, మానవలోకమున మతభేదమేల కలుగవలెననియు, గాలిలో దీపము వెలిగించి, దానికాటంకము లేకుండా చేసిన వెలుగదనియు, అటులనే మానవునకు ప్రయత్నమొకటే ముఖ్యమనియు, హరియైనను హరుడైనను ఒక్క రూపముగలవాడవు నీవేయనియు భిన్నమార్గములబోవుట సరియైన పద్ధతి కాదనియు తాత్పర్యము.

ఆత్మనుగనిన వేమన్న విచారముఁ
బాపి వేదాంతము పలికె తుదకు
వన్నెగారన్న పద్మాక్షుని కృష్ణుని
దైవంబని యెఱిఁగె ద్రౌపది సతి
సత్యస్వరూపము సాక్షిగా నెలకొన్న
విదురుండు నినుమెచ్చి విందునొసఁగె!
నేకాంతహృదయమ్ము నెఱిఁగిన త్యాగయ్య
శ్రీకాంతునిగ నీకు సేవలిచ్చె!

భావగరిమంబు లోకానఁ దీపరింపఁ
పెక్కురూపులఁ గనిరి నిన్ పెద్దలెల్ల!
ఆత్మదృష్టిని బండిన యనఘులౌట!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 40

ఓ దశరథరామచంద్ర!

ఆత్మను అలవర్చుకొనినవిప్పుడు వేమనయోగియై, వేదాంతభావములతో సంఘసేవ చేసినాడనియు, ద్రౌపది నిన్ను కృష్ణావతారకాలమందు అన్నగారుగా సేవించినది వలువలూడ్చు కాలమందు కౌరవసభలో నీవు ప్రత్యక్ష దైవమని తెలిసికొన్నదనియు, విదురుడు నిన్ను ప్రత్యక్షదైవముగా నెఱింగి తన యింటిలో నీకు విందు నొసగినాడనియు, ఆత్మానుభూతిని త్యాగయ్య నిన్ను శ్రీకాంతునిగా నెఱింగి గేయాలమూలముగా లోకమునకు వెల్లడించినాడనియు, వీరందరు ఆత్మలు పండిన మహానుభావులగుటవలన యెవరి దృష్టిలో వారు నిన్ను దైవమని భావగరిమలో తలంచి పూజలిడి సేవించిరనియ తాత్పర్యము.

గ్రాసములేక వకవకలు వడెడి గో
వ్రజమునయందు దర్శనము నిత్తు!
తినుటకన్నములేక తిరిపె మెత్తెడి వారి
మూర్తిలోఁ గనిపింతు ముమ్మరముగ
నిల్లాండ్రసేవల నిలవేల్పు నీవయి
తోచుచుందు వొకింత తొట్రుపడక
ఉపవాసదీక్షలో నుపశమించెడి పాఁప
పెద్దను గనిపింతు వుజ్జిలేక

నే యెఱంగన్న నీవయై యెసఁగుచుందు
వవ్య యానందమూర్తివై యాత్మలలర
నీదు సంకల్పసిద్ధిలో నిలుచువేళ
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 41

ఓ గుణవార్నిధీ శ్రీరామచంద్రా!

నీ దర్శనము, తినుటకు గ్రాసములేక పస్తులున్న గోవులందును, తినుటకు అన్నములేక పస్తులుండెడి పేదసంతతులందును, కానిపించును. ఇంకను భర్తసేవలో నిలబడి యిల్లాలనిపించుకొన్న స్త్రీలయందును, ఉపవాసములో నిలబడియుండి వెలుపలకురాక దాని పడకలో పడుండియున్న పెద్దపాపమునందు కనబడుదువు. వారి యెదలో నిన్ను స్మరించుచున్న అవ్యయానందమూర్తులై వారివారి యాత్మానుకూలముగా కనిపింతువు. పాములలో కొన్ని జ్ఞానము కలిగినవి యుండును. అవి యెవరిజోలికి రావు. వాటి యాత్మలో కూడ నీవు కనిపింతువు. మానవులకుగాని మానవేతరములకుగాని నీ సంకల్ప సిద్ధిలో తప్పక కనిపింతువని తాత్పర్యము.

పిలిచినకొలఁది నా పిలుపు నాలింతువో
లేవో తెలిసికొనలేను మమ్మ!
తలఁచినకొలఁది నా తలఁపులో నిలుతువో
లేవో యెఱుక పడలేను స్వామి!
గడచినకొలఁది నాకాయఁపు జవసత్త్వ
మెంతగా నిలుచునో యెఱుఁగనైతి!
నిలుచునదేదియో, నిలువనదేదియో
కాలమాంత్రికుఁడెఱుంగనగు స్వామి!

గడచినకొలఁది నీ యునికిఁ గనుటఁదక్క
ఒండుగలదె మహాత్మకు నిండుఁదనము
అదియ లభ్యమువడుటకు నరయవలతు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 42

ఓ శ్రీ రామచంద్రా!

నిన్ను పిలుచుకొలది నా మొఱలు ఆలింతువోలేవో యనియు, నిన్ను తలచినకొలది నా తలపులో నిలబడుదువో లేదో యనియు, కాలము గడిచిన కొలది ఆయురారోగ్యము లెంతగా నిలబడి యుండునో యనియు కాలమను మాంత్రికుని చేష్టలలో నెంతకాలము నిలబడగలనో లేదో యనియు సందేహ లతో నిండియున్న నా యాత్మకు నిన్ను తెలిసికొని నీ యునికి కనుగొనుట తక్క నా యాత్మకు వేఱొండు తావులేదనియు తాత్పర్యము.

పాలసముద్రముఁ జిల్కి ప్రతిఫలమందెను
దేవదానవులెల్లఁ దిరుఁగులేక!
మంచిచెడ్డలెపుడు మలయు జగమ్మున
కెడబాట్లు లేకయ యెదుగుచుండుఁ
జీఁకటి వెన్నెలల్ చెలిసగ మొకటియై
నిత్యసేవనమున నిలిచి యాఁడు
ప్రకృతి రమయెపుడు వికృతి సుకృతులెల్ల
నెడబాయక మది సహించినిలుచు!

నీ దయకురాని వన్నియు నెనరుఁగనవు!
బుద్ధినిష్పత్తిఁ జేయఁగఁ బొందువడవు!
అఖిల లోకాలఁబాలించు నబ్జనాభ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 43

ఓ రామచంద్రా! రఘుకులదీపా!

పాలసముద్రమును చిల్కి అసురలు, సురలు కలిసి వారికి కావలసిన ప్రతిఫలము లందుకొన్నారు. మంచిచెడులు ఎప్పుడును జరుగుచున్న జగములో కలిసిమెలిసి యుండును. లోకమునకు చీకటి వెన్నెలలు మొత్తముమీద సెరి సగముగా నడచుచుండును. ప్రకృతియను రమాదేవి ఎప్పుడును సుఖసంతోష ములుగాని, చెడ్డమంచిగాని సహించి సహజసిద్ధముగా ధరించి జగత్తును పోషించుచుండును. కనుక ప్రతి విషయము ప్రకృతిలో నీ దయలేకుండ నీ నెనరును పొందనివి పైకిరావు. బుద్ధిబలముచేత చేసినను, నీ దయగాని, నీ చింతనగాని లేనపుడవి కలిసిరావు. అనగా లోకములు చెడు, మంచి, చెడ్డ వారు, మంచివారు, చీకటి, వెలుతురు, చేయుదగినవి, చేయగూడనివి కలిసియే యుండును. అన్నిటిని దాటి జయమంద వలయుననిన నీ దయ అవసరము. బుద్ధిబలమున నీ దయలేకుండా చేసిన పొందుకురావు.

ఎంత వ్రాసినఁ గొంతగా నేర్తురు
విజ్ఞానవేత్తలు వింతఁగొలుప
అసలు వ్రాయకయున్న నరయఁగా నేరరు
నీ మహిమాన్విత విశ్వలమ్ము!
నీ పాదభక్తిలో నిలుకడగా నిల్తు
రరవిప్పు మనసుతో వరయుదమిక
కేవలము జ్ఞానభావముల కదిసి
దూరమై వెళ్లుచుఁ దూగుచుండు

దానిఁ గనుగొన హెంతె! విధాన మనస
రమ్ము నిన్ను కలఁడని తరంగలించు
వారు నీ పజ్జఁజేరును వాస్తవమ్ము!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 44

ఓ రామచంద్రా!

నీతులు యెన్ని చెప్పినను, వ్రాసినను విజ్ఞానవేత్తలు కొంతగానైన తెలిసికొందురు. అసలు లోకములో వ్రాతలు లేకున్న నిన్ను గురించి తెలిసికొనుట కష్టతరము. అందువలనే పూర్వీకులు గ్రంథాల నెన్నిటినో నిన్ను గురించి వివరించి వ్రాసిరి. వాటినన్నిటిని తెలుసుకొనువరకు అర్థమనస్సుతో నుందురు. అనగా సంపూర్ణ విజ్ఞానులుకారు. కనుక ఓ స్వామి! నిన్ను కనుగొనుటకు విధానము అవసరము. నిన్ను కలడని సేవించువారు చివరకు నీ దరికి జేరుదురని తాత్పర్యము.

నినుగని పెంచిన నీ తలిదండ్రుల
తొలిపుణ్య మేమిటో తెలుపుమయ్య!
యాగాలకు నిను నర్థించి కొనిపోవు
గాధిసూతుని పుణ్యగాథలేమి?
పుణ్యపాపములెంచు పురుషరత్నము జన
కుని పూర్వపుణ్యపు గొనములేమి?
ఆస్థాన గురులైన యమృతమూర్తివై వశిష్ఠ
పుణ్యఫల మదేమొ పొందుఁగూర్పు!

వారి సేవలు నిండారఁబండి విలువ
రూపలావణ్య మూర్తివై ప్రాపుఁగాంచి
ఎల్లలోకాలు నినుమెచ్చ నేలుచుంటి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 45

## 8. శ్రీరామచంద్రా! సుగుణవారిధీ!

నిను గని పెంచిన తలిదండ్రులయొక్క పూర్వపుణ్య ఫలమేమొ తెలియదు. విశ్వామిత్రుడు నిను అర్థించి యాగాలకు తీసుకొనిపోయిన వాని పూర్వపుణ్యమేమో, జానకీదేవిని నీ కొసంగిన జనకమహారాజు పూర్వపుణ్య మేమొ మీయాస్థాన గురువైన వశిష్ఠమహర్షి పూర్వపుణ్య ఫలమేమొ, వారందరు నిన్ను సేవించి నీగాథ వారి గాథలు ప్రపంచమునకు తెలియగా, వారు చేసిన పుణ్యఫలితాలను చెప్పుము తండ్రి యని తాత్పర్యము. వారి గాథలెల్ల గొప్ప విద్యై లోకానికి మార్గదర్శనాలైనవి. పుణ్యచరిత్రాలైనవి అని తాత్పర్యము.

హారహెచ్చెములేకఁ బుట్టుక వచ్చిన
కమ్మని కాపురాల్ కలఁతసెంద!
అఁడుపిల్లఁగల వారల్లని గట్నము
లీయలేక బ్రతుకులీడ్చుచుండ!
కాలపరిమితిని జాలిన రాఁబడి
లేక మఱొకరుండు చీకుచుండ!
ప్రొద్దుపోవక నిద్రరోసిన వారలు
తింద్రించి గాసిలిఁ దిరుఁగుచుండ!

బండఁబారిన మేనుల బాధపడుచు
ఇలను దిరిఁగెడి వారల కలఁతలణఁచి
ఎల్లవేళలఁ గాపాడు మినకులేశ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 46

ఓ రామచంద్రా!

లోకములో మానవులు కమ్మని కాపురాలు చేసుకొనుచు, మధ్య మధ్య కలతలచేత చెడిపోవుచున్నారు కొంతమంది అనియు, అడపిల్లనుగన్న తల్లిదండ్రులు అల్లని కట్నములను ఈయలేక బాధపడుచున్నారు కొంతమంది యనియు కాలపరిమితిని వృద్ధులై, వారికి పోషణార్థము రాబడి లేక, లోలోన చీకుచున్నారు కొంతమంది యనియు, వృద్ధాప్యమువలన రాత్రుళ్ళు నిద్ర పట్టక కొంతమంది కష్టముల పాలగుచున్నారు అనియు కొన్నికొన్ని కలతల వలన యేమియు చేయలేక బండబారిన మనస్సులు గలవారు బాధలు పడు చున్నారు కొంతమంది యనియు, వారందరికి నీవే దిక్కనియు నీవే వారిని కాపాడుమయ్య యనియు తాత్పర్యము.

భద్రకాళిక యెన్ని భద్రమ్ము లొసఁగినఁ
దిరుమంత్రమినకులాభరణ నీదె!
కాశికాపతి యెన్ని కామ్యార్థముల నీయ
ఇష్టదైవమవీవ! యినకులేశ!
వేదాంతమదియెంత వివరించి చెప్పిన
నీదు నామముముందు నిలఁవదనఘ!
నాలుఁగుమోముల నల్వకైనను బ్రభు!
నీకేలు తాకవనే, జయమ్ము!

స్వర్గమందుఁ గలుఁగు సౌఖ్యపదమదేల?
మానసంబున నినుఁజేర్చి మననసేయఁ
గూర్మి వరమిచ్చి ప్రోతువు; కువలయేశ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 47

ఓ రామచంద్రా!

భద్రకాళికాదేవి యెన్ని భద్రములొసగి క్షేమముగా కాపాడినను నీ నామమంత్రోచ్ఛారణ తప్పదు. శివుడుదారముగా తన యిష్టమొచ్చినరీతిని యెన్ని కోరికలు తీర్చినను, నాకు యిష్టదైవము నీవె. వేదాంతమెన్నియోరీతుల వివరించి చెప్పినను, నీ నామస్మరణమె యిష్టము. నాల్గు ముఖములు కలిగిన బ్రహ్మకైనను, నీకేలు తాకినవానికి జయమగును. స్వర్గమందేదో సౌఖ్యముందని యుప్పొంగుటేల స్వామి! నిన్ను మనసునందుగూర్చి, మననజేసిన, కోరిన వరములనిచ్చి కాపాడుచుందువు. అని యీ కవి విన్నవించుకొన్నాడు.

జీవిజీవిని దిని జీర్ణము సేయంగ
గోరికమై నేలఁ గూర్చితయ్య!
ఒక్కరుండు సుఖింపనొకరుండు పనిసేయ
నేల సృష్టించితి జాలికథలు!
మానవాళికి నేల మమతలు పెంచితి
తిరిఁగి తోడఁగనేలఁ దీర్చితయ్య!
పేదవానికి నేల పెక్కురు జనియింప
భాగ్యవంతునకేల పాపలేమి?

నీ సృజించిన యీ శిల్పనివహమునను
ద్రొటుపడితేమొ! కూర్పు తొందరపడి
దాన నీకేమి లాభించుఁ గావిపనిని
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 48

1. దయానిధి! రాఘవేంద్ర!

---

జీవకోటిలో నొకజీవి మఱియొక జీవిని భక్షించుటేల యనియు, మానవుఁడొకఁడు సుఖము పొందు కలిగి సుఖము ననుభవించుచుండ, మఱియొకఁడేల కష్టముల పాలగుచుండుననియు, మానవులకనేక మమకారములను పంచి పెద్దచేసి తిరిగి వాటిని కూల్చుటేలయనియు, భాగ్యవంతులకు సంతాన రహితులగఁజేసి, పేదవారికి పెక్కు సంతానమిచ్చుటేలయనియు, నీ సృష్టించిన జగత్తులో యివి పొరపాటుగా కనిపించుచున్నవి. కనుక ఓస్వామి నీవీ విషయములలో పొరపడితివని, దానివలన నీకేమి లాభించుననియు భక్తుడైన యీ కవిగారి ప్రతిపాదన.

మమకారములు త్రోసి మానినీచిత్తాబ్జ
మకరందపానము మానవలయు
శూన్యగేహమునందుఁ జూపెడి పనులలోఁ
బరమార్థదీపంబు మెఱయవలయు
జాబిల్లి చందాన సాకెడి తనువున
నియతితో నాత్మను నిలుపవలయు
నడిసంద్రము ననైనఁబడెడిఁ గష్టములందుఁ
జెదరక నిజశక్తి నెదురవలయు

మార్గదర్శివై యెప్పుడు మమతవీడి
నిన్ను కలడంచు నాత్మలో నిలుపవలయు
నపుడు జేజేలు కురియుంచుఁదమృతవృష్టి
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 49

ఓ శ్రీరామచంద్రా!

మానవలోకమందు జీవుడు నిన్ను దర్శింపవలెననిన తనలోని మమకారములు, మానినీమీద మించిన మక్కువ, మానవలెను. తన శరీరమనెడి శూన్యగేహమునందు కాలక్షేపమొనరించు సమయమున పరమాప్తుడైన నిన్ను దివ్వెగా గాంచుచు తన శరీరమున రంజిల్లపజేయవలయును. తన శరీరమును జాబిల్లి చందాన పోషించుకొనుచు నాత్మయనుదానిని నింపవలయును అనగా తన యాత్మతో చూడవలయును కష్టములందు భయపడకు నిను దలంచుచు వాటిని నెదుర్కొనవలయు ప్రతిమానవుడు పైనచెప్పిన విధిని, మమకారములు వీడి నిను ఎల్లవేళల మనసులో కలడని తలంచుచు కాలమెల్లబుచ్చుచున్న జేజేలుకూడా మానవునకు సహకారమిచ్చి సహాయమొనరించు చుందురు. అని తాత్పర్యము.

పసిపాపకిటువంటి ప్రజ్ఞను జూపితో
తనలోన నినుఁజూచి తర్కమందుఁ
గనుజూపుమేరలోఁ గన్నమ్మ పిల్వఁగా
గుర్తించి నేర్పున గోలసేయు
స్తన్యంబు గ్రోలంగఁ జనువుఁ జెలరేఁగ
కేరింతలాడుచుఁ గ్రీడసల్పుఁ
దెల్లవారకమున్న యెల్లవారలు లేవఁ
దరిలేని గోలతోఁ దరిమిలేపు

బోధలెఱుఁగని వాని ప్రబోధమేమొ!
వయసు వచ్చినవారలు పలుకలేరు!
ఆత్మశక్తికి గతము నీవగుదువేమొ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 50

ఓ రఘువంశ రత్నదీపమా!

పసిపాప తనలో నినుజూచి కేరింతలు గొట్టును. తన మాతృదేవతను జూచి గుర్తించి, తనను దగ్గరకు దీయగలందులకు నేడ్చును. గోలసేయును. తల్లి తన బిడ్డకు స్తన్యం బిచ్చినపిమ్మట సంతోషముగా కేరింతలు గొట్టుచు నాటలాడును. తెల్లవాఱకముందె, తన సహజమైన యేడ్పుగోలతో నింటిలోని వారందరు మేల్కొనులాగున చేయును. ఇన్ని పనులు గుర్తెఱిగి, తల్లి యనియు, స్తన్యంబనియు, గుర్తించుటలో, నీవాపసిబిడ్డ యాత్మాధీశుడవై నిలుతువేమొ లేకున్న యా పసిపాపకు తనకలవడిన జ్ఞానదృష్టికి కారణము నీవే యనియు, నీవే కారణభూతుడవై మెలంగుచుందువనియు తాత్పర్యము

విదురునిమాటలు వినమికిఁ జెడిపోయె
ధృతరాష్ట్రుడంతటి దేశవిభుఁడు!
మారీచు చెప్పిన మంచిని వినకయ
అంతరించెను రావణాసురుండు
అల్లుని మంచిని నాదరింపకఁ గూలె
దక్షుఁడు—కూఁతుపైఁ గక్షఁబూని
శరణుచొచ్చినవారి పత్రిపవింపక
కంసుఁడీల్గెను కృష్ణకరమునందు

హితముఁ బల్కినవారిని నతకరించి
రాజ్యపదవుల నమ్మినరాజు లెల్ల
రెందరెందరో చెడిపోయె మందమతులు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 51

ఓ రామభద్రా!

ధృతరాష్ట్రుడంతటి దేశవిభుడు, విదురుని మంచిమాటలు వినక, దేశమును తన సంతానమును గోల్పడి చివరకు చెడిపోయెను. మారీచుడు చెప్పిన సలహా వినక, రావణాసురుడు అంతరించెను. (మారీచుని మాయా లేడిగా కావలసినదని చెప్పినప్పుడు అది మంచిదికాదని తన సలహా నిచ్చెను) దక్షప్రజాపతి యల్లుడైన శివమూర్తి మంచిని తన కూతురైన సతీదేవిని తిరస్కరించి, యజ్ఞకాలకు వారిరువురనాహ్వానింపక చేసిన ప్రతీకారముగా దక్షుడు కూలిపోయె. కంసమహారాజు తన పరిపాలనా కాలమందెవరిని లెక్కచేయక బాధించి, వేధించు కాలమందు, తనను శరణుజొచ్చిన వారిమాట వినక తుద కహంకారియై మేనల్లుడైన శ్రీకృష్ణమూర్తి చేతిలో సంహరింపబడెను. కనుక మంచిని యెవరు చెప్పినను వినవలెను. వినకపోయిన పై నుదహరించిన వారి వలె చెడిపోవుదురని తాత్పర్యము.

ఆ మంత్రణముసేయ నాదరింతువు తండ్రి!
కోరినవారికిఁ గొదువలేక
జాబిల్లిచందాన సాకిన దేహమున్
కాపాడ నీదగు కార్యమయ్య!
నిన్ను నమ్మినవారి నిజమును బాటించి
యాయురారోగ్యమహత్తు నిత్తు!
దీనబాంధవుఁడన్న దివ్యబిరుదమువా
వేడిన దీవనల వేడ్కనిమ్ము

అధిపత్యముఁగన్న మహానుభావ!
విమల విజ్ఞానచంద్రికల్ వెలయనిమ్ము!
కోరి భజియింతు నీ సేవఁగోరికొనుచు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 52

ఓ రఘువంశ సుధాకరా!

నిన్ను భక్తిభావలహరితో పిల్చినవారిని ఆదరింతువు. తన శరీరమును జాగ్రత్తగా పోషించుకొనునప్పుడు జాబిల్లిమాదిరిఁ గాపాడుపని నీదగును. నిన్ను నమ్మినవారి నిజానిజాలు, పాటించి యాయురారోగ్యమహత్త నొసంగుదువు. నీకు దీనజన బాంధవుడన్న బిరుదము కలదు. కనుక నా వేడికొనునప్పుడు నా కోరికలను దీర్చుము. ఓ మహానుభావ! నాకు విజ్ఞానపూరితమైన మనస్సునిమ్ము. ఎల్లవేళల నిన్ను ప్రార్థించుచుందును. అని తాత్పర్యము.

నెఱచక్కని కృషిచే నేర్చిన విజ్ఞాన
భౌతిక శాస్త్రజ్ఞుఁడతిగఁ బలుకు
సూర్యచంద్రులతీరు చొప్పడుమార్గాలు
వినసొంపుగాఁ బల్కు విసుఁగులేక
భౌతిక వాదానఁ బ్రాకులాఁడునుగాని
సర్వేశ్వరునిశక్తి పరకుఁగొనఁడు
తనసేవలో ధరిత్రిని మద్భవమువందు
భూకంపరాసుల మొలకఁ గనఁడు

విశ్వతత్త్వముఁ దెలియంగ విసుఁగుఁజెందు
దైవసృష్టికి మూలముఁ దలఁపఁబోడు
వానివగు గొప్పలు పలుకు వరుసఁగూర్చి
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 53

ఓ రఘుకుల నాయకా!

చక్కఁగ' భౌతిక శాస్త్రమును నేర్చిన భౌతికవాది, యన్నిటియందును తన ప్రజ్ఞావిశేషణముచేత, తాను జదివిన శాస్త్రపరిజ్ఞానముచేత, నన్నిటను చక్కఁగా నుగ్గడించి చేయగలడు. రాబోవు భూకంపరాసులను ముందుగా వివరించి చెప్పలేడు. సూర్యచంద్రాదులు తిరిగెడి మార్గాన భౌతికముగా చెప్పగలడు. విశ్వతత్త్వమునుగూర్చి తెలియపర్చుటకు విసుగు చెందును. అనగా తన గొప్పతనమును చెప్పుకొనును కాని నీవు వెనువెంట వుండి నీ శక్తిపూర్వకముగ నన్నిటను నీవెయై యున్నావని గుర్తెఱుంగలేడని తాత్పర్యం.

పిడుఁగురాయిళ్ళకు నొడుదుడుకులు గల్గు
విద్యుల్లతాకాంతి వివరమెంచు
వినువీధిమార్గాన వెల్గుఁ చుక్కలకాంతి
దీశక్తిఁ దొలుకాఁడఁదేటఁబఱచు
అసదుగా నెంచెడి నరవిందమిత్రుని
లో వెల్గు మంటల కోవఁగాంచు
అన్నిటఁగ్రమముగా నాకళించి నుడువు
శాస్త్రసమ్మతమైన చదువు వలన!

ఖళిరో! వాటి వెన్నంటి శక్తుల్మలందఁ
జేయు వేదవేద్యుని గాంచఁ జింతనమ్ముఁ
జేయఁడు ఖగోళశాస్త్ర విశిష్టవేది!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 54

ఓ రామచంద్రా! సుగుణాబ్ధిచంద్రా!

ఖగోళశాస్త్రజ్ఞుడు, పిడుగుపాటులను గలుగు రాపిడులను, విద్యుల్లతా కాంతులను ఆకాశములో వెలుంగు చుక్కలకాంతులను సూర్యునిలోనున్న వెల్గు మంటలను, వివరించి తాను జదివిన శాస్త్రమర్యాద పూర్వకముగా విజ్ఞతం గలిగి వివరించి ముందుగా జెప్పంగలడు. కాని వాని వెన్నంటియున్న నీదయిన దైవశక్తివిగురించి, వివరించి చెప్పలేడు. కనుక నీవన్నిటను నిండియున్నా పవు. కారణభూతుడవు. అని తాత్పర్యము.

చివికి శారీరక చింతల నొకరుండు
　　　　సుఖదుఃఖములఁబడి జాఱుఁగుచుండుఁ
గుమిలి రాఁబడిలేక కొదుకుచు నొకరుండు
　　　　వడ్డీలు చెల్లింప వణుకుచుండు
జేనెడుపొట్టకై జీవనబంధంబు
　　　　ముడివడి యొకరుండు మూల్గుచుండుఁ
దల్లిలేని కొలంతఁ బిల్లిపాలకు నేడ్వ
　　　　దిక్కులేకొకరుండు తిరుగుచుండు

నీ సృజించిన సృష్టిలో నిలిచె వేయి
కొదలు గాన్పించు చేష్టలు కొదువలేక
ఏల సృష్టించితీవిధి యెఱుకరాదు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర!

ఓ రఘుకుల నాయకా!

మానవుడొకడు శరీర పటుత్వము తగ్గి చివరదశలో సుఖాలను బడయనేర్వక దుఃఖపడుచుండును, మఱొకడు తనకు సంపద కలుగలేదని అప్పులు చేసిచేసి వడ్డీలు చెల్లింపలేక కష్టపడుచుండును. వేఱొకరుండు తన జానెడి పొట్టనింపుకొనుటకు జీవితము బాధపడుచు మూల్గుచుండు, మఱి యొకడు తల్లిలేనిపిల్ల పాలకు నేడ్చుచుండ, దిక్కుతోచక యేమియు చేయలేక బాధపడుచు తిరుగుచుండు, కనుక తండ్రి రామభద్రా! నీ సృష్టించిన జగత్తులో కొఱతలు వేయి కనుపించుచుండు. ఏల యీలాటి కష్టములపాలు చేయు చుంటివి మాబోటివారికి యెఱుకరాదు. అని తాత్పర్యము.

కావ్యజగత్తును గానిపింతువు నీవు
కోరికొన్న విధానఁ గొదువలేక
తీర్థాటవిఁదిరుఁగు తీర్థ జనావళికిఁ
గొమరొప్పఁగని పింతుగూర్మిగదుర
సజ్జనాళికి నెప్డు సత్ఫలమిచ్చుచు
నెల్లవేళలఁ గాచి యేలుకొనుదు
అహరహంబుల నిన్ను ననుభూతిఁబడయంగ
సేవించువారికి సేవలిత్తు

వాదితుదలు తెలియకయ, నార్తిఁగొన్న
వారికిత్తువు నీనామపరన బలము!
నీదు సేవాఫలమునెన్నగాదు స్వామి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర!

ఓ రామచంద్రా! రఘుకులవీరా!

---

నీ గొప్పందము భక్తిరసపూరిత కావ్యాలలో, కనిపించును. నీవు కనిపింతువు కావ్యానుకూలతను. తీర్థయాత్రలు సేవించువారిలో ప్రేమపూరిత మైన దృష్టితో గనిపింతువు. సత్పురుషులు నిన్ను సేవించువారికి నెల్లవేళల సత్ఫలితమొసగి కనుపింతువు. ఎల్లప్పుడు నీ సేవలో యనుభూతిని గాంచు వారిని, కాపాడుచుందువు. ఏమియు తెలియనివారికి అనగా భక్తిభావనతోగాని వేదాంత పరమునగాని తెలియనివారికి నీ నామోచ్చారణ బలము నొసంగి పరింపజేయించి వారికి సత్ఫలమిత్తువు. కనుక నీ భక్తులయెడ బంధుత్వమును జూపి కాపాడు నీ దృక్ఫలము వర్ణనాతీతముస్వామి! యనీ తాత్పర్యము.

ముసిముసినవ్వుల మురిపాలఁ గురిపించి
యౌవనోద్ధతిఁగాల మలరఁజేయు
ఒకరిద్దరు తనయులుద్భవ మందంగఁ
దలిదండ్రుల వయస్సుఁ దలరఁజేయుఁ
గష్టాల పెనుఁబొంపిఁగాలూనఁగ నిలిపి
తనువుల తడిమంగఁ గొనరఁజేయుఁ
పాపగీపములెంచి పలుకక మేనుల
తుదిమిని మెసవంగఁ గొసఁగఁ జేయుఁ

గపటనాటక నేపథ్య క్రమమునందుఁ
గాలమాంత్రికుఁ జేష్టలు కడిమిమీఱి
జీవరాసుల ప్రాణముల్ చీరుఁదుదకు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 57

ఓ రఘువంశ నాయకా!

కాలమను మాంత్రికుడు లోకములో కొంతమందికి సుఖమున ప్రాము కొనఁగజేసి యెవ్వనావస్థలందు సుఖంబుల నిచ్చుచు కాలంబును సంతోష మొపంగజేయును. మరికొన్ని యెడల కొంతమందికి సంతానవృద్ధిని వారు చెందునటుల జేసినపిమ్మట వృద్ధాప్యమును కలుంగజేసి, వారిని బాధలచేత నాటలాడించును. కొన్నియెడల కొంతమందిని కష్టాలను పెనుఁబొంపులో పడ వేసి శరీరపటుత్వమును నశింపఁజేయును. కొంతమందికి కొన్నియెడల పాప మని తలంపక శరీరపటుత్వము తగ్గివేసొరునటుల జేయును. కాలక్రమమును తెలిదాటున కాలమాంత్రికుడు మానవలోకముతో నాటలాడుకొనుచు, జీవ రాసులతో కలిసిమెలిసి యుండి తుదకు వారి ప్రాణములనే బలిగొనును. కనుక కాలమునదానిని వృధాపుచ్చక జాగ్రత్తగా నుపయోగించు కొనవలెనని తాత్పర్యము.

పసిపాప చిఱునవ్వు పలుకుల ముద్దాడి
కళలీను నొకచోటఁ గనికరించి
కోమలాంగులఁగూడి కోటిస్వర్గాల కు
ప్పఁగవోయు నొకచోటఁ బట్టుపట్టి
కలిమి మిన్నఁగనిచ్చి కనుల విందుగఁగూర్చి
పేరెన్నికను దీర్చు వేరొక కొవ
రోజెలు గురియంగఁ జేకూర్చు నొకచోటఁ
కీర్తిప్రతిష్ఠల స్ఫూర్తి వెలయ!

ప్రభల కర్కశపాషాణ పతిమలెన్న
జాలరెవ్వారు గాల యంత్ర తంత్ర
మాంత్రికుని చేష్టలయ్యారె! మమతఁగూర్చు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 58

ఓ రామచంద్రా!

కాలమనే మాంత్రికుడు, పసిపాపలను ముద్దాడగ కనికరించి సంతోషముల నొసగజేయు నొకచోట, కోమలాంగుల కూడికలచేత స్వర్గమోయిదనిపించి మెప్పులు గూర్చును. మఱికొంతమందికి కలిమిని ముక్కటముగానిచ్చి వారికి మంచిపేరు వచ్చులాగున కనికరించి చూచును. ఊరువారందరు కీర్తించు లాగున ప్రతిష్ఠలను సమకూర్చి కొంతమందిని కాపాడును వారికి విలువైన పేరును రాబట్టును. కనుక కాలమను మాంత్రికుని చేష్టలకు లోబడక, కాల వ్యవధిని పోగొట్టుకొనక జాగ్రత్త పడవలయునని హెచ్చరిక తాత్పర్యము.

అడవిలోఁ గాయకు నబ్ధిలో నుప్పుకు
ననువైన పొత్తును గూరఁజేతు!
ఆడమగల భేదమావరింపఁగఁ జేసి
ప్రేమసామ్రాజ్యముఁ జెంతువటవ!
మానవాళికి నీతిమార్గాలు జూపించి
కలిమిలేముల బాధఁ గలుగఁజేతు!
నీవాచరించెడి సేవాఫలములంద
దరిదాపులను గాంచుటరిది స్వామి!

ప్రతిభఁగూర్చెడి నీ చిత్రపథము లెన్నఁ
జాలరెవ్వరీలోకముఁ జారుమూర్తి!
వానిఁదెలియంగ నాత్మకే వలనుగూడు,
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 59

ఓ రామచంద్రా!

నీ లీలలు వర్ణనాతీతము సంబంధము లేనిచోటు సంబంధము లొనర్తువు. వాటిని చక్కఁగూర్తువు. అడవిలో పండిన ఉసిరికాయకు, సముద్రములో పండిన ఉప్పునకు పొత్తు కలుపుదువు. వాటి యుపయోగముం గలుగ జేతువు. ఆడమగల భేదమావరింపజేసి వారికి ప్రేమసామ్రాజ్యమును గట్టబెట్టుదువు. నీతిమార్గాలు జూపించి మనుగడ సాధింప మానవాళికి కలిమిలేములను ప్రసాదించి, వారికి మరల బాధలను కలుగజేతువు నీ శక్తిసామర్థ్యాలను కనుగొన లోకములో సాధ్యముకానిదని, వాటినన్నిటి భరింపవలయునన్న నిన్ను కనుగొనవలెననిన ఆత్మకే సాధ్యము. అని తాత్పర్యము.

తూరుపుఁగొండపైఁ దోచు నరుణబింబ
మెంతయు మది మెప్పు లీనుచుండ!
ఊరువెలుపలి మహోజ్జ్వల సంధ్యా రు
జారుచుల్ మనమున కావరింపఁ!
గమవిందుఁగూర్చెడిఁ గాంతిచ్ఛటా వల
యమ్మొక స్ఫూర్తిని నలరుచుండ!
కోవెల దర్శించి కొలువంగ కాంతిదాం
తులు మనోవీధినిఁ దొరయుచుండ!

భక్తిభావలహరి నినుఁ బాదుకొనఁగ
కొసరికొసరి నీ ప్రేమకుఁ గోర్కులురల!
ప్రణతులీయుచుఁ జెలరేఁగి వరలువాఁడ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 60

ఓ రామచంద్రా! దయాళో!

తూరుపుకొండపై అరుణబింబమును జూచునంతనె ఒకవిధమైన సంతోషము కలుగుచుండగను, ఊరువెలుపల సాయంత్రకాలమందు కనబడు సంధ్యకాలపుకాంతులు మనసునకు ఆవరించుచుండగా, పైకాంతుల స్ఫూర్తితో నేను సంతోషముతో పొంగిపోవుచుండగా, కోవెలను దర్శించి దానిలోనున్న నీ విగ్రహమును కనులార జూచుచుండగా, నాలోనున్న పనికిరాని కోర్కెలను దిగజార్చి నీమీద భక్తిభావాలతో మనసు పాదుకొనగా, నీకు ప్రణతులర్పించి ప్రార్థించుచున్నాను స్వామీ అని తాత్పర్యము.

ఎవ్వాని భక్తికై యాలపాటను దీర్చి
కోకిలాంగన చాలఁగూర్చి పాడు
ఎవ్వానిసేవలో నినదించు సారంగ
మేపారుఝుంకార మింపుఁగూర్చి
ఎవ్వానిగూర్మికి నెలుగెత్తి కూయును
కేకిరింతలుగొట్టు కేకి మివుల
ఎవ్వాని మమతకు నెలమివి బల్కును
గువగువ శబ్దముల్ గువ్వజంట

మానవేతరము లెవని గానమందు
భక్తినీరాజనాలను బ్రస్తుతించు
నతనిఁగొనియాఁడి కేల్మోడ్చి యలరుచుండు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 61

ఓ రఘుకుల రామచంద్రా!

మానవేతరములైనను నీయొక్క భక్తిభావముల తమ సహజమైన కూతలతో నిన్ను యానందింపజేయుచు ప్రార్థించుచుండు, కోకిల తన సహజమైన కూతలతో నిన్నలరింపజేయును. తుమ్మెద తన ఝుంకారనినదమ్ముతో నిన్ను ప్రార్థించును. నెమలి తవ సహజమైవ శబ్దజాలములతో కేకరింతలు గొట్టి ప్రార్థించును. కువకువ, శబ్దజాలములతో గువ్వజంట నిన్ను వేడుకొనును. మానవేతరములైన పక్షిజాలముకూడ తమ సహజమైన కూతలతో నిన్ను నిత్యము స్తుతించు చుండును. కనుక నేను నీ భక్తిప్రపత్తులలో నిలబడి ప్రార్థింతును. మానవేతరములైనవాటిని మించినవాడు మానవుడు గనుక విను నిత్యము స్మరించుచుండవలసినదే యని తాత్పర్యము.

కొలనిలోఁ గుముదముల్ నెలవంక వెన్నెల
 తీయందనాలకుఁ దెప్పదేలఁ
చంద్రకాంతుల నీను చలువ రా మేడలు
 పిల్లగాడ్పులఁ జెమ్మఁ గొల్లగొనఁగ
ఏరువంకలుగూర్చి యొయ్యారిగాఁ బరుగిడు
 వేగరేఁగముఁ గొంతచింతఁ గొలుప
నీటిపట్టున నాఁడు నెలవంక నీడలు
 కౌఁగిలి మిగిలి పోయిఁ గూర్చుచుండ

మేను పులకరింపఁగాఁజేయు మేద నీ వి
లసనములు, మృదుభావములఁ దొణికిసల
హత్తుకొని భక్తిని నిలుతు నఘవినాశ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 62

ఓ యఘవినాశ! రామభద్రా!

ఆకాశములో నెలవంక వెన్నెలకు (నీటి) కొలనిలోయున్న కుముదములు విరిసి నీటిపైన తేలుచుండగా, చంద్రునికాంతికి, చలువరాతితో గట్టిన మేడలు వాని ప్రతిబింబమును స్రుజ్వరిల్లచేయుచు చల్లని పిల్లగాడ్పులతో చెమ్మ మటింపగా, ఏరు పారుచుండగా వంకలు వంకలుగా తిరిగి పారుచున్న యేటియొక్క తీరునుజూచి. నీటిపారుదలలోగల వేగమునుజూచి, కొలనిలో దిలువబడిన నీటిలో; ఆకాశములోనున్న చంద్రునిబింబము, పిల్లగాలి తెరలకు యూగుచున్న కెరటాల సొంపునుజూచి, నా శరీరమంతయు పులకరిత్తగా, సహాయుండవు మీద నీ విలసనములను గాంచి, వాలో పై భక్తిని పొంగు మృదుభావములతో ప్రార్థించుచున్న నాస్వామి! యని తాత్పర్యము.

పొన్నపూరెమ్మలఁ బుప్పొడి జల్లులఁ
　　　　బరిమళాలు గురియు తరుణమందు
వేఁపపూఁతలు చిందు వినమిత గంధముల్
　　　　నాసికాగ్రములందు నాటునాఁడు
లేమావిచిగురాకు కోమలాకారపు
　　　　గుత్తుల గుంఫనల్ గులుకునాఁడు
కరివేపవేములోఁ గ్రమ్మిన చిగురాకు
　　　　తీండ్రించి సౌరభాల్ తీర్చునాఁడు
పాలపొంగువోలెఁ బొంగుఁగు పొంగులెత్తు
గంధవహుఁడెంతగా దూకి కదలియాడె
వానిదగు నీ యెడదలోని స్వామిభక్తి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 63

ఓ రామభద్రా!

గంధవహుడైన, గాలిరాజును వాని భక్తిని కవి వర్ణించుచున్నాడు. వానికికూడ నీ శక్తిసామర్థ్యములవలన ప్రకృతి రమ్యత గావింప బడుచున్నదనియు, పలుకుచున్నాడు. పొన్నచెట్లు వాటి పూరెమ్మల గుబాళించు పుప్పొడిని వెదజల్లి పరిమళాలను చిందుచున్నాడనియు, వేపపూతలు చిందు కమ్మని గంధపువాసనలను నాసికాగ్రము నంటునటుల చేయుచున్నాడనియు, లేత మావిచిగురాకుగుత్తుల గుంఫనల కదలియాడ చేయుచున్నాడనియు, కరివేప చిగురాకులలో పుట్టుకవచ్చు సౌరభాలను చిమ్ముచున్నాడనియు, పాలపొంగు మాదిరిగా లోకములో తన చలనము గలుగఁజేయుటను నీ యందలి స్వామి భక్తి ప్రకృతి మెచ్చుగా తగినట్లుగా కదలుచున్నాడని తాత్పర్యము. అనగా వాయుదేవుడు నీ యానతిని ప్రకృతికి తన సహజమైన పరుగుళ్ళచే సుఖమ్ము నిచ్చుచున్నాడని భావము.

వెలుఁగు వెలువరించు వినువీధి మార్గాన
　　వొప్పారు కాంతులు మెప్పుఁగూర్ప
మేఘమాలలు వింత మెఱుపులు మెఱయించి
　　మన్మనోవీధిని మలుపుకొనఁగఁ
గనువిందుఁ గూర్చెడిఁబెనుగొంగ బారులు
　　పయనించు పోకడల్ వన్నెఁగొలుప
చిటిపొటిచినుకులు చిందిన చలువలు
　　మేను నెల్లను సోకి మేలుసేయ

నీ సృజించినసృష్టిని నీవ యగుదు
వంచు నిట్టనిలువున సౌహార్దమంది
భక్తిఁ గైవారమొనరుతు, భద్రమూర్తి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 64

ఓ రామచంద్రా!

నా యెదరకు నాకాశవీధి గూర్చెడి వింతవింత రంగులు మెప్పుల నిచ్చుచుండ, మేఘావృతమైనపుడు వింత మెఱుపులతో చెలరేగి నా మనస్సును హత్తుకొని తనవైపు మలుపుకొనగా, పెద్ద జాతికొంగలు చక్కని బారులుతీరి యాకాశమున పయనించునపుడు వాటి పోకడలుచూచి మెచ్చుకొనుచుండగా, చిటిపొటి చినుకులు పైన రాలుచు చలువనిచ్చి హాయిని గూర్చుచుండగా, నీ సృజించినసృష్టిని నీవే యగుదువని తలంచుచు భక్తిభావాలతో నేను నిన్ను సేవించుచున్నాడను అని తాత్పర్యము.

అదియ! నీ మాహాత్మ్యమనఁగ వినువీధి
శూన్యమై శబ్దముల్ నోకఁబలుకు
అదియ! నీ మైఛాయఁబొదలుచు రేబవ
ళ్ళనెపుడు నొక పోల్కిఁ బొసరఁజేయు
అదియ! నీ నాథామృతాబ్దివృష్టికి నెల
వైనచోటు నిజమనంగఁ బొలుచు
అదియ! నీ కాంతిరేఖాళికిఁ జనవిచ్చి
బలమిచ్చి వెలుఁగులు పాలఁజిమ్ము

దిక్కులెన్నఁగలేవు నీదిక్కు తక్క
కూర్చికొన్నఁ గుప్పెడు కూడికొనదు స్వామి!
పగలు రాత్రుల కదివింత పట్టుఁగొమ్మ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 65

ఓ రామచంద్రా!

అదియ, నీ మాహాత్మ్యమను విధాన ఆకాశమెప్పుడు శూన్యప్రదేశమై శబ్దోచ్చారణకు కారణమైయుండును అది నీ మేనిచ్ఛాయనుబోలి రాత్రింబవళ్ళ నొకవిధాన నడుపుచుండు, అది నీ ప్రేమామృతమునకు నెలవు గాంచిన చోటుగా నుండును అది నీ కాంతిరేఖావళికి బలమిచ్చి చనవిచ్చి వెలుగును ప్రసాదించును. దానికి దిక్కు లెచ్చటలేవు. నీవు మాత్రమ, దిక్కుగా నుందువు. రాత్రింబవళ్ళకు అదియొక పట్టుగొమ్మగా నుండను. అనగా నీవే అదియగు, నిన్ను మించినదేదియులేదు అని భావము.

ఎవ్వాని ప్రేమలో వినబింబమలర క్కి
    దనకుదానుగ గాంతిఁదొనరఁజేయు
ఎవ్వానినాజ్ఞలో నిల పరిభ్రమణమ్ము
    భాస్కరున్వంతఁగొని పఱుఁగులిడును
ఎవ్వానికూర్మిమై నిలచుట్టుఁ దిరుఁగాడి
    బాలేందుఁడందమై వన్నెఁగూర్చు
ఎవ్వాని ముదలకు నెల్లకాలమొక రీ
    తిమహీధరమ్ములు తీర్చి నిలుచు

ఎవని పెనుపులో గ్రహరాసులెల్లఁదేట
తెల్లముగ నిల్చి యూడిగమెల్లఁజేయు
నతని కూర్మిని బడయంగ నౌతమునర్తు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 66

ఓ రామచంద్రా!

ఎవని ప్రేమచేత బలముచేత సూర్యబింబము తనకుదానుగా గాంతి నిచ్చుచున్నదో ఎవనియొక్క యాజ్ఞననుసరించి భూమి సూర్యబింబముచుట్టు ప్రదక్షిణ మొనరించుచున్నదో ఎవనిప్రేమకు పాత్రుడై చంద్రుడు భూమి చుట్టు తిరుగుచు కాంతిని ప్రసారము చేయుచున్నాడో ఎవనియొక్క యాజ్ఞకు లోబడి భూమిపై స్థిరముగా కొండలు నిలబడియున్నవో! ఎవని పెనుపులో గ్రహరాసులెల్ల సేవలు చేయుచు నిలబడినవో! కనుక యతనిప్రేమకు పాత్రుడనగుటకు ప్రార్థించుచున్నాడను అని తాత్పర్యము.

ఆకాశవీధిలో నలరారు చుక్కల
కాంతికేల? జనాళి భ్రాంతి చెంద?
వేదాంత మదియెంత వింతగాఁ బల్కిన
మానవాళికి దాని మమతలేల?
మంచియో చెడ్డయో! మనుగడ సాధించు
మనుజులకేల? నీ మాన్యచరిత?
అనురాగబంధము లధిగమింపఁగ విల్చు
జీవాళికేల? నీ చింతనమ్ము?

బ్రతికినంతకాలము భక్తి నిన్ను నుతమొనర్చి
మనసు లూరటనెందఁగ మనిచితీవు!
దాని నెఱుఁగుటయ పరమార్థంపులీల!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 67

ఓ రామభద్రా!

ప్రకృతిలోనున్న మనుజాళికి ఆకాశములో మెఱయు చుక్కల కెందు వలన భ్రాంతి కెందుచున్నారు వేదాంతమెంత వింత వింతగా బలికిన, మానవాళికి దానిపై మమతలేల? మంచిచెడ్డలను అనుభవించు మానవాళికేల నీ చరిత్రాది విషయములుచ్చరించుట. అనురాగబంధాలతో ముడివడిన వీపై ప్రేమకు, లోకములోనున్న జీవరాశికేల చింత నిన్నుగురించి. కనుక జీవాళి కెప్పుడు బ్రతికినంతకాలము నీ భక్తివలన నూరట పెందుటకు కల్పించితీవే ప్రకృతినంతయు. అని భక్తుడైన యీ కవి వర్ణించుచున్నాడు.

నారికేళము భాతివాతి కఠినమైన
జీవితధర్మముల్ చిలికి చిలికి
మందారమకరంద మాధుర్యమును బోలు
కరుణారసమ్మును గురిసి కురిసి
శరణువేడినవారి సంకటములు వాయ
ననువైన పదములనతికి యతికి
దీనజనావన దీక్షలోఁ బరిచర్య
లొనరించి సేవలోఁ దనిసి తనిసి

కుడిచి కూర్చుంటివో లేదొ! కువలయేశ!
విరిసిన మదాత్మనొకమారు వీక్షసేసి
యలరిపొంగెడి డెందాన నిలువుమయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 68

ఓ రామచంద్రా!

జీవరాశి లోకములో తమ బ్రతుకుతెఱువులు కనుగొనుటకై నిర్మించిన జీవితధర్మాలను సూచించి, మందారమకరందమును బోలు నీ కరుణారసమును భక్తులపైన, జీవాళిపైన గురిపించి, నిన్ను శరణు వేడినవారికి సంకటములను పోగొట్టుటకై చేసిన యత్నములోను దీనులయొక్క బాధలను తీర్చుటకై నీ పడిన కష్టములోను, సేవలోను తృప్తిపడి నిలిచి, తగిన సమయములో నీవు విశ్రాంతితో మెలగి ఆహారాదిపానీయములు తీసుకొంటివో లేదో స్వామి! ఒక సారి నాయాత్మలో నిల్చి నీవు విశ్రాంతి తీసుకొనగలందులకు నిను ప్రార్థించు చున్నాడను. అని తాత్పర్యము.

మంటిజగమ్మున మనెడివారికి నీవు
సర్వేశ్వరుఁడవౌదు సరకుసేయఁ
బొందిలోఁ బ్రాణంబు పుట్టుకతోడనే
పుట్టించి మట్టిలోఁ బొలియఁజేతు!
వంత్యకాలమున నీవాదరించెడివేళ
నావంత నీభక్తి యండయగును!
పుణ్యఫలములవ్వి పుట్టుకఁ బుట్టును
వెనుకటివాసన వెలయకొలఁది!

మంటిలోఁ బెఱిఁగెడి మంటిమాసికెపుడు
భక్తబాంధవుఁడైన నీ భక్తితప్ప
నంటికొన నేరవితరము లరుఁగువేళ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 69

ఓ. రఘువంశ నాయకా!

ఈ జగత్తులో జీవించువారికి నీవు రక్షించెడి సర్వేశ్వరుఁడవౌదు నిశ్చయింప, పుట్టునప్పుడు ప్రాణంబు కలుఁగఁజేతువు, చనిపోవునపుడు, మట్టిలో కలియునటులజేతువు, చివరకాలమున నీవు యాదరింతువు లోగడచేసిన భక్తి వలన, పూర్వజన్మలో చేసికొనిన పుణ్యఫలములవలన పుట్టుక తోడనే పుట్టింతువు. వాటిని సహకరించి, చనిపోవు సమయమున యితరములు కలిసిరావు, నీ భక్తి యొక్కటియే తనవెంట వచ్చునని తాత్పర్యము.

కమలనాథుఁడవీవ! క్రమభావమ్ముల
హత్తుకొని నిలుతు వహరహమ్ము!
కృష్ణుఁడవైన నీ గీతోపదేశాన
వాము చావఁగఁజేయు వతఁడవీవ!
బుద్ధదేవుఁడవయి భూప్రజకింత శా
ల్మినిజూపి తమసంబు నణచితీవ!
ఏడుకొండలవాఁడ వీవగుదువు భక్త
వత్సలుండవయిన భారమూవి!

గానవాహినిలోఁ గవికావ్యరస మ
హాబ్ధిలోఁ గరుణించి విహారమందె
దీవ! యఖిల మానవయగుదు! వీవనీవ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 70

ఓ కమలనాథుఁడవైన రామచంద్రా!

కమ్మనిభావాలతో నీవెపుడు శేషశాయివై లోకపాలనకొఱకు జూచు చుందువు. ద్వాపరమందు కృష్ణుడవై గీతోపదేశ మొనరించి అహము చావగ బోధలు చేసితివి. బుద్ధదేవుడవై ప్రజలకు శాంతిమార్గాలు చూపించి నడిచి తీవు. ఏడుకొండలస్వామివై కలికాలమందు భక్తవత్సలుడవై పాదుకొంటివి. కవి రసమయకావ్య సృష్టిలో, గానమొనరించు గాయకుని స్వరములో కరుణించి నిలుతువు నీవు నీవయి లోకాలను పాలించుచుందువు. ఓ రామచంద్రా యని తాత్పర్యము.

కౌశికు వెనువెంటఁ గాననమ్మునకేఁగి
ఘనతపోనిష్ఠులఁ గాచి ప్రోచి
గౌతము భార్యను గరినంపు శిలనుండి
కష్టమ్ము లెడఁబాపి కాంతఁజేసి
కరుణామయుండవై కామితార్థములిచ్చి
ముదమునఁ జనవిచ్చి మునులఁబెంచి
నిర్వ్యాకశక్తితో నీచుని రావణు
నంతమొందఁగఁజేసి కాంతఁగూడి

శ్రీలు పండఁగఁ బట్టాభిషిక్తుఁడవయి
నిత్యకళ్యాణ మందిర నిలయుఁడవయి
వెల్గుచుంటివి భువనముల్ వేడ్కనంద!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 71

ఓ రాఘవేంద్రా!

కౌశికు వెనువెంట కానలకేగి మహర్షి కులమును గాపాడగల్గితివి. గౌతమమహర్షి భార్యను శాపవిమోచనము గావించి కఠినంపు శిలరూపును కాంతగా జేసితివి. కరుణారసము జిల్కి ముని వర్గమునకు గామితార్థములిచ్చి కాపాడితివి. అహంకార పూరితుడగు రావణాసురుని సంహరించి భార్య సీతా దేవితోగూడి పట్టాభిషిక్తుతుడవై భువనములు సంతోషమందు నటుల నిత్య కళ్యాణ మందిరుడవై వెల్గుచుంటివి అని రామరూపమునకు ప్రాధాన్యమిచ్చిన పద్యభావము.

అద్వైతసిద్ధిమై నమ్మ జానకి విన్నుఁ
దనలోనఁ దానుగాఁ గనుచునుండె
రాలుకలుంగు నీ రామనామపుశక్తి
లోకాల భరియించి సాకుచుండ
నేకాత్మదీక్షలో నీ పాదభక్తులు
మునిఁగితేలుచు నీకు ముదముఁగూర్ప
వేదవిద్యాకన్య నీదు ముచ్చలు సెప్పి
భక్తవర్యుల కూర్మిఁ బడయుచుండఁ

బాలుపొంగినరీతి నీపాల నిలిచి
దేశదేశాలు భక్తి సందేశమీయ
నెల్ల దేశాలకాత్మవై యిమిడియుంటి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 72

ఓ రామచంద్రా!

అద్వైతములో నెల్లప్పుడు జానకీమాత నిన్ను తలంచుచు చూచుచుండగ, నీ నామామృతము ఉచ్చరించినంతమాత్రాన లోకాలను పాలించెడి దివానున్నదై యుండగా, తమ యాత్మలలో భక్తబృందాలు నిన్ను స్మరించుచు తాండవించు చుండగ, వేదమను కన్య తనకుతగిన భక్తిభావాలను, భక్తుల హితముగోరి ముచ్చటించి హితమును బల్కుచుండగ, పాలుపొంగినరీతి భక్తి భావాలను, నీ గొప్పందనమును దేశదేశాలు సర్వమును గ్రహించి, వాటివాటి సందేశముల నిచ్చుచుండ, అన్ని దేశాలకు నీవే యాత్మవై మెలగుచుంటివని తాత్పర్యము.

భర్తతోఁ దులఁదూఁగి భర్తతో నడువంగ
గాంధారి కనులకు గంతకట్టె!
సత్యవ్రతమటంచు సాధుహితమటంచు
హరిశ్చంద్రుఁడు భార్యనమ్ముకొనియె!
ఆత్మావలోకన మధిగమింపఁగలేఁడు
గౌతముఁడడవికి ఁబ్రీతినేఁగె!
ఏవురిభార్యగా నిల్లాలనఁగనొప్పి
ద్రౌపది ధర్మమార్గాన నడిచె!

ఎవరిభక్తికివారు మూర్తీభవించి
సృష్టిచిత్రములందు నశేష కీర్తు
లందఁజేసిరి నీప్రేమనందు కొఱకు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 73

ఓ సీతామనోహరా!

ధృతరాష్ట్రుడు పుట్టి గ్రుడ్డియైన వలన పెండ్లియాడిన గాంధారి, తన భర్తకు కనులులేవని గ్రహించి తానుకూడ కన్నులకు గంతకట్టుకొని భర్తతో పాటు నడిచినది. సత్యమునుసమ్మిన హరిశ్చంద్ర చక్రవర్తి మాటతప్పక, ఋషి ఋణము చెల్లించుటకై విధిలేక తనభార్యను అమ్ముకొన్నాడు. ఆత్మావలోకనము చేసిన బుద్ధుడు సిశక్తి గూర్చుకొనుటకై యడవికివెళ్ళెను. ఐదుగురకు భార్యగానైన ద్రౌపది ధర్మమార్గాన నడచి ఇల్లాలనుపించుకొన్నది. పైఁజెప్ప బడినవారు వారి వారి భక్తిలో కాలమును గడుపుచు నీ ప్రేమామృత మందు కొనుటకు నిలబడిరి. దేశమునకు గౌరమొసంగిరి.

దృఢకాయమిచ్చి ధరిత్రిని నిల్పుట
నీపసదవ మౌను నీరజాక్ష!
జీవితముప నిను జింతనసేయుట
నీవరమందును! నీలవర్ణ!
కోటికోర్కులుతీరఁ గోటిమార్గములెన్నఁ
జదురుఁ జూపఁగనీవ సాక్షిస్వామి!
కీరితిపథమో, యకారణహితమో, వా
కఁగఁజేసితి పద్మనాభ!

ఏదియెటులైన నీనామమెన్నఁదగిన
వారికిచ్చుచుంటివి పెక్కుభాగ్యములను
వానిఁబడయంగఁ గూర్మిమైఁ బ్రణతులిడుదు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 74

ఓ రాఘవేంద్రా!

నాకు ఆరోగ్య-భాగ్యము గలుగజేసినను ఇలపైన నిల్పినందుకు నీవే కారణము. అది పసదనమందును. ఓ నీలవర్ణ నా జీవితములో నెల్లప్పుడు నిన్ను స్మరించువిధము గూర్చుట అది నాకు వరమందును. నా మంచి కోర్కెలెల్ల తీరిపోవుటకు, వాటిని తీర్చుకొనుటకు దారిచూపించుట నీవిచ్చిన నేర్పని తలంతును ఓ స్వామి, అది కీర్తిమార్గమొ, మఱి నాకు కూర్చిన హితమొ నాకబ్బునటుల జేసితివి, నాకేకాకుండ నీనామమెన్ని నిలబడినవారికి నటులనే చేయుచు వారందరికి భాగ్యాలనిచ్చు చుంటివి. అందులకు నేనెప్పుడు నిన్ను స్మరించుచుందును.

వానరసేనచే వారధిఁగట్టించి
సీతమ్మఁదేరఁగ జెలఁగుటేమి?
కాళింగుమడుఁగునఁ గర్వించు పెనుబాముఁ
దుదముట్టఁజూచెడి దుడుకదేమి?
గజరాజమొసలితోఁ గాసిల్లుసమయానఁ
బరుగిడికాపాడు పయనమేమి?
తులువలుద్ధతిఁజూపి వలువలూడ్చెడివేళ
ద్రౌపదిఁగాపాడు ధైర్యమేమి?

ఆత్మఁదెలియని వారల కర్తమెల్ల
దెలియఁజెప్పెడిఁ ద్రోవల వెలిఁగితీవు!
సర్వలోకాలు భరియించు సత్ప్రభుఁడవు!
రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర! 75

ఓ రామభద్రా!

వానరసేపచేత సముద్రము మీద వంతెన గట్టించి లంకప్రవేశించితివి జానకిమాతను బడయంగ గలిగితివి. ద్వాపరమందు కృష్ణావతారములో కాళింగు మడుగులోదూకి పెనుపాపతేడయిన ఆ కాళింగును మట్టుపెట్టితివి. గజరాజు ముసలిచేత పట్టువడినవేళ, నీవు గజరాజు మొఱవిని పరుగిడి కాపాడితివి, కౌరవసభలో తులువులైన కౌరవులు ద్రౌపదిని హింసింపజూచి వలువలూడ్చు వేళ నీవుగా నామెను కాపాడితివి, ఇవియన్నియు లోకోపకారములకై చేసి, ఆత్మావలోకన మొనరింప గావించితివి. సర్వ జనాళికిని, యాత్మానుభూతి లేనివారికి, సర్వలోకాలకు సత్ప్రభుడవై కాపాడుచుంటివి.

మూఁడుమూర్తులు నీవ! ముజ్జగములును నీవ!
ముందుగాఁ దెలియంగఁ బోలనైతిఁ!
ప్రకృతిధర్మము నీవ! బడబాలనము నీవ!
మాయచే మర్మముల్ కోయనైతి!
ఆదిశేషుఁడ వీవ! హనుమంతుఁడవు నీవ!
అలఘుమతిని నిన్ను నరయనైతిఁ!
బండువెన్నెల నీవ! ప్రతిభలు నీవ! నీ
లోన జగత్తును గాననైతిఁ!

గమ్మతావులు నీవ! సుఖమ్ము నీవ!
సుజనవంద్యుఁడ వీవ! యశోక మీవ!
భక్తమందారుఁడవు నీవ! భాగ్య మీవ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 76

ఓ రామచంద్రా! దయామయా!

నిన్ను నేనెంతగాఁ గొనియాడెదను. ఈ సృష్టిలో మూడు మూర్తులనగ నీవె. ప్రకృతిధర్మము నీవె. సముద్రములోఁబుట్టు బడబాలనము నీవె! ఆదిశేషుడవు నీవె! హనుమంతుడవు నీవె! పండువెన్నెల నీవె! ప్రతిభలు నీవె! కమ్మని వాసనలు నీవె! సుఖము నీవె! సుజనులచేత కొనియాడబడు వాడవు నీవె! అశోకము నీవె! భక్తులకు జెప్పికొనదగిన మందారమువలె ఆహ్లాద మొసగు వాడవు నీవె! ఎల్ల సంపదలు నీవె! కనుక మాయచేత ముందుగా నిన్ను తెలిసికొనలేకపోతిని. ముందుగా నిన్ను గుర్తించలేకపోతినని కవి బాధపడు చున్నాడు.

ఏడు వారాసుల నీదియైననుగాని
పయనింపనేర్తురు ప్రజలు మిపుల!
గాలిలోనెగఁబ్రాకి కడకుఁ జాతురుగాని
విశ్వంభరాదేవి వింతలెల్ల!
నీలిమబ్బులనిల్చి నీరమిత్తురుగాని
వర్షావిహీనపు భారమనరు!
ఆఁకలిమంటల కలమటింతురుగాని
యపయశంబిడు కల్మిని నడుఁగఁబోరు!

భారతమ్మునఁబుట్టెడి ప్రతినరుండు
నీదునామ మాహాత్మ్యపు నెఱియెఱింగి
పాడిదప్పియొనర్ప రేపనులనైన!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 77

ఓ రామచంద్రా!

భారత ప్రజలు నీనామ మాహాత్మ్యపు నెఱి యెఱిగినవారు కనుక వారు పాడితప్పి యే యితరమైన తప్పుడుపనులు చేయరు. ఏవిధమది యనగా కష్ట మనక ఏడు సముద్రాలనైన యీదిరాగలరు న్యాయముకొరకు విశ్వంభరాదేవి యొక్క వింతలను కనిపెట్టుటకు గాలిలోనెంతైన ఎగబ్రాకగలరు. నీలి మబ్బు లలో నీటినైనను తీసుకొనిరాగలరు. ఆకలిమంటలగునపుడు దానిఫలితమనుభ వింతురుకాని అపయశంబైనకూటికి లోబడరు అని తాత్పర్యము.

లోకాలుపాలింప లోగిలిలేకయా!
శేషశాయివయి వసింతువెపుడు!
పాలారగింపఁగఁ బాలులేకా? నీవు
పాలసంద్రముపైనఁ బవ్వళింతు!
మకరందపానఁగ మధురిమలేకయా!
పద్మాలయనుబట్టి భర్తవగుదు!
అందమ్మునకు రత్నహారముల్ లేకయా!
దామోదరుఁడవయి దాంతిఁగూర్తు!

వన్నియుమిడియున్న మదాత్మనధివసించి
నాదు విద్యాధిదేవత మోదమంద!
నెల్లలోకాలు కూర్మితో నేలుమయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 78

ఓ రామచంద్రా!

నీవు లోకాలు పాలించుచుందువు. దానికి నీవుండుటకు నీకుయిల్లులేకనా పాలసముద్రముమీద శేషశాయివై పవ్వళించెదవు. నీవు పాలారగించుటకై పాలులేకనా పాలసంద్రమును ఊతగా కనుగొన్నావు? మకరందము త్రాగుటకు నీకు దొరకకనా, పద్మములోపుట్టిన లక్ష్మీదేవిని వరించి భర్తవైనావు. నీవుధరించుటకు రత్నహారము లిత్యాదులులేకనా పూలహారము ఉదరముదాక వైచుకొని లోకాలకు దాంతిని కూర్చుచుందువు. అవి అన్నియు నాతావున మదాత్మలో చలించుచున్నవి కనుక, నాఆత్మలో నీవు వచ్చిజేరి నాపరస్వతీ దేవియిచ్చు సంతోషమును స్వీకరించి ఆనందించుచు నిలువుమని కవిప్రార్థించుచున్నాడు. అనగా భగవంతుని స్తుతించుటనేకరకములు. అందులో ఇదియొక రకము. భక్తుడైనవాడు నిందాస్తుతి చేయవచ్చును, ప్రేమతోస్తుతింపవచ్చును, దుఃఖముతో స్తుతింపవచ్చును, పరిహాస సంకలనముతో స్తుతింపవచ్చును. భక్తిప్రధానము.

తండ్రిగారొసఁగిన తాత్త్వికశక్తికి
లోలోన నేనెంతొ చాలఁబొంగ!
గురువుమప్పినవిద్య గుణమిచ్చి నాలోనఁ
దేదీప్యమానమై దియ్యఁబట్ట!
కావ్యసరస్వతి గనులవిందునుగూర్చి
ముప్రొద్దునాతోడ ముచ్చటింప!
నెత్తమ్మిగద్దెపై నిలచిన శ్రీలక్ష్మి
నెనరున ననుజూచి నెఱినిబల్క!
హేతువాదమ్ముల మూఁతి! గించి నీ
శరణార్థుఁడనటంచు జపముసేయ!

నాయు రారోగ్యబలముమై నధివసించి
కాలమెల్లను నీసేవఁ గాంచుచుంటి
నీతివిక్రమస్థిరుఁడనై నీదుహపు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 79

## ఓ రామభద్రా!

నా తండ్రిగారిచ్చిన తాత్త్వికశక్తిచే నిన్నునెల్లప్పుడు ప్రార్థించుచుంటిని- గురువులిచ్చిన విద్యాదిబుద్ధులచేత నాలోనిభక్తికి తావుకలిగినది. నాలోయున్న నా పాండిత్యము నా కవిత్వమనే విద్యాదేవత మూడుపూటలు నాయందు మెలగుచున్నది, లక్ష్మీదేవి హితము పల్కుచున్నది, కనుక ఎల్లవేళల నీ వొసంగిన ఆరోగ్య భాగ్యాలతో మెలంగుచు నీసేవ లొనరించు చుంటినని తాత్పర్యము.

ఆదిదేవుండైనఁ బేదవానింటికి
దయసేయుఁ జనవిచ్చి తలఁచినపుడు
సప్తసాగరములు సాహసించి దుమికి
వేంచేయు హనుమంతు వేడికొనఁగఁ
జీకటుల్ చెదరఁగ శీర్షమునెగఁదన్ని
యరుదెంచు రవి - భక్తుఁడంజలింప!
వాయుదేవుఁడైన వరుసఁగఁ బ్రార్థింపఁ
గరుణించి నాయింటఁ గాలుమోపు!

నిన్నుఁబిలిచిపిలిచి నేను నేర్వనయితి
నయితియైన యాత్మకు నిన్ను నధిపుఁజేయఁ!
బగలురాతిరి నీసేవ వలదిసెలువ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 80

ఓ రఘురామచంద్రా!

నిన్ను సేవించి, నిన్ను నేను పిలిచిపిలిచి అలసిపోయి యుంటిని. నీవు నాయాత్మలో ప్రవేశించి నిలుచుటకు అనేకమారులు నిన్నుపిలిచి ఓడిపోతిని. కనుక ఆదిదేవుడైన శివునిగాని మఱి యేదైవమైననుగాని పిలిచిన వచ్చెడివారు. హనుమంతుని సేవచేసిన సప్తసాగరములుదాటి వచ్చెడివాడె. రవినిప్రార్థించిన వచ్చెడివాడు. వాయుదేవుని ప్రశ్నించి పిలిచిన వచ్చెడివాడు కాని నిన్ను పిలిచి నేనలసిపోతిని, నీవు వేగరానందున బాధపడుచుంటినని తాత్పర్యము.

చంపకోత్పలముల సంతోషపఱతునా!
నీయువికెటువలె నేరనైతి
శార్దూల మత్తేభ సంవాహనమ్ములఁ
బూజింతునా యది పోలకున్నె!
కడిమితోననురాగకావ్యముగీలించి
యాత్మానుబంధము నరయ నిన్ను
సీసగీతమ్ములఁ జింతనమున నినుఁ
బెద్దఁగాఁగొనియాడి తద్దనిలుతు!

వెండికాదన నీతోడ వెఱవకెపుడు
భక్తిమైఁ బంచియిచ్చెద భావలహరి
నిత్యకళ్యాణ మందిర నిలయుఁడనయి
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 81

ఓ దేవా! రామచంద్రా!

చంపకములు, ఉత్పలములతో నిన్ను సంతోషపెట్టుదునన్న నీవు కనబడవు. శార్దూల, మత్తేభాలమీదజేర్చి పూజింతుమనిన, అదియుసమకూరదు. కనుక నిన్ను ఆత్మానుబంధనముతో తులతూచి నిన్ను సీసగీత పద్యాలతో కొనియాడెదను. అట్లుకాదనిన నీతో వెఱవకెపుడు, భక్తిభావాలతో నిన్ను బంధించి ప్రార్థించెదను. అనగా పద్యపువరుసలో మత్తేభము, శార్దూలము, చంపకమాల, ఉత్పలమాలలతో నిన్నుకొనియాడుటకు వరుసకూడమ కనుక సీసగీత పద్యాలలో కొనియాడెదనని కవియభిప్రాయము.

చక్కని చిక్కని చొక్కపు( గైతల
వలరింపగూర్చిరి యాదికవులు
మిక్కిలి చెక్కిన నెక్కొను శిల్పము(
గొనియా(డనేర్చిన కోవవారు!
స్రుక్కని బొక్కని సొగసెడి శబ్దముల్
నెలనేర్పు(గూర్పంగ నెగడెవారు
మక్కువతగ్గని పక్కిని( బాదముల్
వెలయంగ(గూర్పను గలు(గువారు!

విధిగనినుచెంచి, నిను(గూర్చి వీనుమిగిలి
కావ్యసంతతుల( గొనియా(డ( గడ(గిరయ్య!
వారికిచ్చెద మన్నమోవాక శతము
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 82

ఓ స్వామి రామచంద్రా!

చక్కని మక్కువగల్గులాగున కావ్యసాహిత్య శిల్పాలతో పెద్దగ రచించి దీర్చిన, మహామహులైన సాహితీవేత్తలైన, కూలంకష పాండిత్యము కలవారు నైన కవులు నినుగూర్చి కావ్యాలు పెంచి వ్రాసిన వారిని నేను కొనియాడెదను. వారికి నమోవాకములు చెల్లించెదనని కవిగారి యాశయము. పూర్వకవుల స్తుతిగురించి చెప్పినది.

ఒక దొంగబోయవాఁ డురుతర జ్ఞానియై
నిన్ను సేవించి మునీంద్రుఁడయ్యె!
ఒకపల్లెకారి మహోన్నత విద్యచే
వేదవిభాగ ప్రవీణుఁడయ్యె!
ఒక యాదవాన్వయ వికలాత్మకుండు దే
వీ కటాక్షశ్రీల విద్యనేర్చె!
ఒక నాస్తికుఁడు తన యోర్మికొలంది గు
రూపదేశమున నీరూపుఁగనియె!

జ్ఞానతృష్ణచే మసలిన మానవులను
నీదుసేవల నిండార నిలువరించి
చిరతరానందసౌఖ్యాలఁ జేర్చితయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 83

ఓ రాఘవేంద్రా!

ఒక బోయకులస్థుడు నిన్ను జ్ఞానముతో సేవించి మహాఋషిఅయినాడు. (వాల్మీకిముని) ఒక పల్లెకారియైన వ్యాసుడు మహోన్నతవిద్యచేత ప్రథితుడై వేదాలను విభాగించి ప్రవీణుడయ్యెను. ఒక యాదవకులస్థుడు కాళికాదేవి వర ప్రసాదముచేత సకలవిద్యలు నేర్చినాడు. (కాళిదాసు) ఒక నాస్తికుడు గురువు గారి సేవలవలన నీరూపు గాంచినాడు (వివేకానందుడు) వారినందరకు జ్ఞాన భిక్షనొసగి, వారలను గొప్పవారిగాచేసి చివరకు చిద్విలాసమైన నీ యానంద ములో జేర్చికొంటివని తాత్పర్యము.

పెనుబాముపడగను విశ్వాత్మ చణుండవై
నిదురించుభోగాల కుదురదేల?
పాలసంద్రపుఁగూతుఁ బత్నిగాఁబడయంగ
కోర్కెమైనీవేలఁ గోరికొంటి!
అడ్డబొట్టునలువ కాసనమైనిల్వ
నబ్జనాభుండవై యలరుటేల?
గొల్లబొట్టెలగూడి గోపాలుఁడవయి గో
వ్రజమునుగాపెడి వాదులేల?

నీకునీవుగాఁ బ్రభుడవై నెగడుకతన
చెల్లినవి యాదివాలెల్లఁ గల్లకాఁక
నీప్రవర్తన నెంచఁగా నేర్తురెవరు?
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 84

ఓ రామచంద్రా !

నీవు గావించు పనులెవరివలనకావు. నీకు నీవుగా ప్రభుడవు, అభవుడవు. కనుక ఆదిశేషుని పడగలో నిల్చి నిదురింతువు. పాలసంద్రపు కూతురైన లక్ష్మీదేవిని భార్యగా పొందితివి. నీవు అడ్డబొట్టు ధరించిన బ్రహ్మకు వాశ్రయమొసగి పద్మనాభుడవని పేరు గడించితివి. ద్వాపర యుగమున కృష్ణావతారమెత్తి గొల్లబొట్టెలను కూడి నీ లీలలు వారికి జూపించుచు గోవులను కాచి గోపాలుడవని పేరు పొందితివి. ఈలాటి నీ ప్రవర్తన నేర్పు టకుగాని, చేయుటకుగాని వీలుకాని పనులు. అవి నీకే తగును. కనుక నీవు ఓ దేవా! నీ ప్రవర్తన నెంచగలవారెవరు స్వామి యని తాత్పర్యము.

గోపికాకృష్ణులు గూర్చిన యనురాగ
బంధములేలొకో ప్రతిభఁ జూపె?
మాధవుఁడెంతటి మమతలు చూపింప
గోపికలేలొకో కూర్చికొనిరి?
చిన్నపెద్దలయందుఁ జిటిపొటి మాటల
నర్పింప నేలొకో! వల్లవాఁడు?
సత్యభామయనిన సరసాల నాటించి
క్రీడించెనేలొకో! కృష్ణమూర్తి?

ప్రేమతత్త్వముఁ జూపించి కామమణఁచి
భక్తవర్యుల లాలించు పథము కాఁక!
నొందుగలదె జగమునకు నిండుఁదనము!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 85

ఓ రామచంద్రా!

నీదు ప్రేమతత్త్వమును గురించి చెప్పుటకు చాలదు మనసు. నీ ప్రేమను అనేక రకములుగా చూపించి, కామాదులను అణచి కాపాడుచుంటివి. ద్వాపరమందు కృష్ణుడవై గోపికలతోకూడి యనురాగబంధము లొనరించి వారితో పరసాలాడుతూ, చిన్నపెద్దలను ముద్దులొలుకు నటుల పల్కుచు, కృష్ణావతారుడవై, భక్తులను లాలించి నీలోయున్న ప్రేమామృతమును పంచి పెట్టుటే లోకమునకు నిండుతనముగా కనిపించుచున్నది. అనఁగా లోకమున కృష్ణావతారమందు ప్రేమతత్వమున యందరిని కాపాడినవాడవు నీవేకదా యని తాత్పర్యము.

లావణ్య రంగవల్లరులనుజేరదు సు
ధామయ వేది బృందావనమ్మ!
ఆస్తికుల కిరవునై కృష్ణు వేణు నా
దమ్ములొలుకునికి బృందావనమ్మ!
కుజ్జజంటల నేర్పుకూర్పుల కాట వి
హారసరళము బృందావనమ్మ!
వైజ్ఞానికవరుల విద్యాప్రభల మనో
రంజకపథము బృందావనమ్మ!

ద్వాపరమున కృష్ణుఁడవతరించి శాంతి కాంతు
లలర దిద్దితీర్చితివి నాఁడావనమ్ము!
నీదుచేష్టలు వర్ణింప నేర్పుకలదె?
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 86

## ఓ రామచంద్రా!

బృందావనమునుగా జనాకర్షణముచేత మెప్పొందుదు, ఆస్తికులకు నొక పవిత్రమైన స్థలమై కృష్ణావతారమందు వేణునాదములచేత పవిత్రమందిన పుణ్యస్థలమైనదనియు, విద్యావిదులకు ఒక విజ్ఞానముతోకూడిన మనసునకు చెప్పుకొనదగిన స్థలమనియు, నీవు ద్వాపరయుగ మందవతరించి కృష్ణుడవై ప్రేమతత్త్వమును బంచిపెట్టితివనియు, అందుల పుష్పయోగముండిన తోట బృందావనమనియు, నీదులీలలు వర్ణింప నలవికాదనియు తాత్పర్యము.

ప్రేమలాలిత్యము సేమముఁ గూర్పంగ
ప్రేపల్లెవాడల వెనతులంది!
పాండిత్యగరిమతోఁ బలుమార్లు కౌరవ్య
సభరాయబారాలు సంతరించి
భావనాస్ఫూర్తిని భర్తగా వరియించు
రుక్మిణీదేవి కురులు దీర్చి
కౌరవసంతతి కౌటిల్య మణుగంట
పాండవులకు రాజ్య పట్టమొసఁగి!

ద్వాపరమున కృష్ణపరమాత్మ గుణుఁడవయి
ధర్మరక్షణ సేయఁగఁదరలి వచ్చి
లోకకళ్యాణమును దీర్చలేఁగితయ్య !
రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర! 87

ఓ రామచంద్రా!

నీవు ద్వాపర యుగమందు కృష్ణావతారమున ప్రేపల్లెవాడల తిరుగాడుచు, కౌరవ సభలందు రాయబారాల నల్పితివనియు, రుక్మిణీదేవిని వరించి భర్తగా నిలచితివనియు, కుటిలురనైన కౌరవుల సంహారమంద పాండవులకు పట్టాభిషేకము లొనరించితివనియు, ఇటియన్నియు లోకకళ్యాణముకొఱకు చేసి ధర్మరక్షణ నిరూపించుకొంటివి స్వామీ! యని తాత్పర్యము

ఆహ్లాదకరమైన మహాద్భుతకలనమై,
నెగడొందు బృందావనిగతమైన
ప్రేమామృతమునకేరీతి విలువ నింపు
దీర్పఁదుటనఁదగ, సహేతుకమగుఁ
దెలియఁజెప్పుట యనఁదీరని రసమయ
సృష్టికది నివాస సంవృతమ్ముఁ!
వివిధ రసావేశవేద్య మయమ్మునై
కృష్ణునిపాలిటఁ గెరలియాఁడె!

దీనజనవిలసనమై, సుధీంద్రు మిత్ర
సపరివార సందోహ విశాలమైన
దాని వర్ణింపనలవియె! చైత్యకాంత!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 88

ఓ రఘురామ!

నీవు ద్వాపరమందు ఆడిన ఆటలకు కృష్ణావతారములో, నీ ప్రేమామృతమును జల్లుటకై నియమించినది బృందావనము. దానిని వర్ణించుటకు యెందరో మహనీయకవులు యెన్నో రకములుగా వర్ణించిరి. కాని యీ కవి దానిని రసమయ సృష్టియనియు, వివిధ రసావేశముచేత కృష్ణుని పాలిటది నిజమై నిరూపించినదనియు, దీనజన విలసనమైనదనియు, సుధీంద్ర సపరివారములచోట పుణ్యకాలక్షేపము లొనరింతురనియు, దానిని వర్ణింప నలవి కాదనియు వర్ణించినాడు.

అధిపత్యముఁగన్న యానందమూర్తివై
దేశదేశాలను దీర్చిదిద్ది!
గుణగరిష్ఠులు ఋషి కోవిదాళి మిమ్ములఁ
గీర్తింప వారల స్ఫూర్తి మెచ్చి
మేనులుప్పొంగ నిమీలితనేత్రులై
పూజించుభక్తుల ముదముఁగూర్చి!
శాంతియోధ్ధల బాహుసాహసములనెంచి
పసదనములువారి కొసఁగఁజేసి!

భావగర్భిత శ్రీలను బాదుకొల్పి!
మేలిమేలి దీవనలిచ్చి మేలుఁగూర్చి!
రాజ్యమేలితి "శ్రీరామరాజ్య"మనఁగ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 8!!

ఓ రామచంద్రా!

నీవు దశరథ తనయుఁడవై రామరాజ్యమను పేరుతో పరిపాలనచేసిన విధమును ఈకవి కొలదిలో ఈ విధముగా వర్ణించి మెచ్చుకొను చున్నాడు ఎదురులేని యధికారముతో ఆనందముతో నోలలాడించుచు దేశదేశాలకుప్రాశ రామరాజ్యమను పేరును దిద్దితివనియు, నిన్ను గుణముచేత గొప్పవారలు, ఋషికోవిదాళి కలసిమెచ్చగ వారికి కోర్కెలెల్ల తీర్చితివనియు భక్తవర్గమునకు బాంధవ్యమును కల్పించి వారిని కాపాడితివనియు, శాంతిని యెల్లవేళల కాపాడి పోషించిన యోధ్ధలకు బహుమతుల నొసంగితివనియు, వారందరికి మేలిమేలి దీవనలిచ్చి కాపాడగల్గితివనియు మెచ్చుకొని తన ప్రేమామృతమును పంచు కొనుచున్నాడు.

కులగురువు వశిష్ఠ కోవిదునకు నేల
శాంతి దాంతులుగూడి సజ్జనుఁడయె!
నిన్నాశ్రయించిన నిర్ణిద్రచణుఁడు వి
శ్వామిత్రుఁడేల కోపానలుఁడయె!
నీచరితమెఱిఁగి నిన్నువ్రాసిన ఋషి
వాల్మీకేల వినమ్రభావ మబ్బె!
నీసేవలోనిల్చి నృత్యముసేయు నా
రదుఁడేల జగడాల చదురుఁగాంచె?

వారి భక్తిప్రపత్తులు మీఱి నిన్నుఁ
గొలుచు భాగ్య మొదవ వారిగొనములెల్లఁ
గుప్పవోసి మెచ్చుకొనుచు గూర్చికొంటి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 90

ఓ రాఘవేంద్రా!

కులగురువైన వశిష్ఠ కోవిదునకు, శాంతి దాంతులు పెనవేసుకొని సజ్జనుడయెననియు నీగురువగు విశ్వామిత్రునకు యేల కోపానలుడయి ఋషి యనిపించుకొనెను. చరితమును వ్రాసిన వాల్మీకి ఋషికేల వినమ్రభావ మబ్బినదనియు, ముమ్మారు నీసేవలో రామనామ స్మరణచేయు నారదమహర్షి కేల జగడాలాలపింప జేసినాడనియు, వారందరు ఋషిపుంగవులైనందున వారి గుణములెల్ల వారివారికే తగినవారితో తృప్తిపడినటులుగ వారి స్వభావ ములను నెంచుచు వారినందరిని కూర్చికొంటివనియు, తాత్పర్యము. వలువురు ఋషిపుంగవులైనను వారివారి గుణగతములు రకరకములుగానున్నను వారికే మంచితనమును ప్రసాదించి కాపాడి మెచ్చుకొంటివని తాత్పర్యము.

"ఎవరబ్బ సొమ్మని"యించుక నిను దెప్పెఁ
ప్రేమతోఁ గంచర్ల రామదాసు!
"దామోదరుఁడవని" ద్వ్యర్థిగా వచియించెఁ
గాసుల పురుషోత్త కవివరుఁడు!
మొసలి పట్టినవేళ మొఱలిడె గజరాజు
వెనువెంటఁ గాపాడ, వీనులదర!
వారి పోకిళ్ళకు వలసపోయితి వేమొ
పిలువఁగాఁ బలుకని కలతలేమి?

నీమ కథలెన్నఁ గొన్నిట బాధఁగొలుపు
రక్షచేసెడి దొరవంచు రాణఁజెంది
వేగవేగమె నినుఁగూర్చి వేడికొంటి!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 91

ఓ రఘునాయకా! రామచంద్రా!

కంచర్ల రామదాసు నీకొకగుడి భద్రగిరిలో నవాబుగారి పాలనలో కట్టించి కారాగార శిక్షకు పాత్రుడైనాడు. నవాబుగారు పెట్టు బాధలకు తాళ లేక నిను ఎవరబ్బ సొమ్మని" కీర్తనవ్రాసి పాడుకొనే వాడాబాధలు పడలేక. అంధ్రనాయక శతకములో కాసుల పురుషోత్తమ కవి, నిను ద్వ్యర్థిగా దామోదరుడవని పలికినాడు. వ్యాజస్తుతిలో మెచ్చుకొన్నాడు. గజేంద్రుడు మొసలిచేత పట్టువడి బాధపడుచు నిను సేవించినాడు. కనుక నీవు వారి పోకిళ్ళకు మెచ్చుకొని వారివారి శ్రేయస్సును చూడగా అచటకు నేగితివనియు, అందువలన యిప్పుడు కవి విన్ను బిలిచిన వెనువెంటనే రాలేక పోయినావనియు వ్యాజస్తుతి నొనరించుచున్నాడు.

ఆర్భగపక్ష యెంత యర్మిలిఁ గొలిచెనో!
　　నీ వాహనమ్ముగ నెగడి నిలిచెఁ
బలశాలి హనుమాను తొలి పుణ్యఫలమేమొ!
　　నీసేవలోన పునీతుడయ్యె!
సుగ్రీవుఁ డేజన్మ సోకిన పుణ్యమో
　　నీ కూర్చిన విధికి నిలిచి చేసె!
అంగదుఁడేనాఁటి యాశ్రిత ధర్మమో!
　　నినుగాంచి పేరంది నిలిచె జగతి!

పూర్వజన్మ కర్మల పుణ్యపోషణములు
నిన్ను జేరిచి వారల కన్నుఁ దెఱపి
నీదుమూర్తికి సేవలన్నిలుప నేర్చె
రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర! 92

౬. రామవేంద్ర!

నీకు వాహనముగానున్న ఆర్భగపతి పూర్వ జన్మ విశేషణ మేమిటో ననియు, హనుమంతుని పూర్వపుణ్య ఫలమేమొ నీతోకూడి పునీతుడయ్యా డనియు సుగ్రీవుడు తనచేసిన పూర్వపుణ్య ఫలితమేమొ నీ చెప్పినటుల నడిచి కొనెను. నీకు సహాయమందించెను. అంగదుడు వాలి కుమారుడు చేసిన పూర్వ పుణ్యఫలమేమొ, నినుజూచి నీవొసంగిన తాల్మిమేరకు నిలచినాడనియు, వారి వారి కర్మ విపాకముల వలన, వారుచేసిన పూర్వజన్మ ఫలితమువలన వారు మహానుభావులై నీవు రామావాతారములో యుండగా వారందరు భాగస్థులై నీకు సేవలొనరించి కృతార్థులైరి స్వామి అని కవి చెప్పుచున్నాడు. వారందరిని నీ ప్రేమకు, నీభక్తిలో కృతార్థులను జేసినందుకు మిక్కిలిగా నీ గుణముల గురించి ప్రార్థించుచున్నాడు.

నీతిచంద్రికలెంత నేర్చిననేమి ని
స్వార్థ బుద్ధిని నిలువంగఁబోఁడు
దేశకళ్యాణ వితీర్ణ దృష్టిని విర్చి
సహకారమందింప సాగిరాఁడు
పారమార్థికదృష్టిఁ బరపతిఁ గైకొని
వికలాంగులకు సుంతవిత్త మీఁడు
పేరు గొప్పకొఱకుఁ బ్రాకులాఁడును గాని
దైవచింత నారాధనఁ దలపఁబోఁడు

కుడిచి కూర్చుండుటయకాని కొదువసేయు
జాతికంకిత భావపు జోతలిడఁగ
నేటి మానవుని కథలనేకమయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 93

ఓ రఘు రామచంద్రా!

నేటి మానవుడు స్వార్థములను గడించుటలో వారి గుణగతములను కవి యిచట చెప్పుచున్నాడు. నీతి యెంతనేర్చినను నిస్వార్థమున నిలువ లేదనియు, దేశముయొక్క కళ్యాణ మిత్యాదులందు పేరు వహించినను కొద్దిలో స్వార్థమునకు లోబడుననియు, పారమార్థిక దృష్టిలో, పేరుగడింప నేర్చినవాడు, వికలాంగులకు స్వార్థముపీడి సహాయపడలేడనియు, పేరు ప్రతిష్ఠలు సంపాదింప ప్రయత్నించునుగాని, దైవమునుగురించి దలపలేడనియు, కుడిచి కూర్చుండు టెరుంగునుగాని జాతికంకితమై సేవలుజేయ నేర్వలేడనియు తాత్పర్యము. (అనగా ఎంతటివానికైనను స్వార్థము తప్పకుండుననిభావము)

ప్రాపంచిక సుఖాలఁ బట్టువడినవాఁడు
దీనార్థిలోకముఁ దెరలఁబల్కు
అవ్యయానందము నవఘళించినవాఁడు
నోటికెల్లను రెచ్చి నొవ్వఁబల్కు
తేరతిండినిమెక్కి తీర్థమాఁడెడివాఁడు
కాయకష్టముఁజేయఁగసలిపల్కు
మానవలోకవు మన్ననల్గొనువాఁడు
గొప్పవారినెల్లఁ దప్పుఁబల్కు

కోర్కెలెడబాయక నెపుడుఁ గూర్చుకొనుచు
పాపసమ్మేళ మేళన పంక్తిపథము
నేఁటి మానవ కథలెన్న నేరవయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 94

శ్రీరామచంద్రా

నేటి మానవలోకములో కొన్నివిషయములు వింతగా కనిపించును. ఏ విధముగానైన, ప్రపంచసుఖాలతో నాటలాడుకొనువాడు, దీనులైనవారిని లెక్కగొనక తూలనాడును. అంతులేని యానందముతో జీవించువాడు, ఇతరులను నోటికివచ్చినటుల తూలనాడును. తేరగావచ్చిన తిండితినుచు, సుఖింప నేర్చినవాడు కాయకష్టము చేయుటకు తూలనాడును. కోపగించుకొనును. మానవులచేత తాను గొప్పవాడని అనిపించుకొని గొప్పపల్కులచేత బ్రతుకువాడు, తనకంటె పెద్దవారిని తూలనాడి పల్కును. ఈలాటివారు ఎప్పుడును పాపమనగ నేమిటో తెలియక అహంకారపూరితులై, పాపభూయిష్ఠమైన బ్రతుకుతో బ్రతుకును కనుక నేటి మానవలోకములో రకరకాల మనుజులయొక్క కథలను చెప్పుకొనుటకు సిగ్గుచేటని తాత్పర్యము.

విశ్వచక్రమెపుడు విస్తరిల్లుచుగుండు
రూపమునఁగెరలి రూపుఁదాల్చు
ఇనబింబ మేప్రొద్దునేపుగా నిలఁబడి
కిరణప్రసారము దొరయుఁజేయు
చీఁకటి వెలుఁగులు చెరిపగ మొకభంగి
రాతిరిపవలలు రగులఁజేయు
ఆత్మయొకటి దాని నావరించి కదలి
కలఁబొంగి విందార విలచియాఁడు

జీవకోటికిపుడు నిత్యచిద్విలాస
పంక్తిపథమున చైతన్య ప్రాణమగుచు
నెల్లవేళలఁ బెనుపునఁ బల్లవించు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 95

ఓ రామచంద్రా!

ఆత్మయెపుడు జీవకోటిలో చైతన్య రూపమున సంభవించును. అది యేవిధమున అనగా విశ్వమనునది గుండురూపమున నుండును. సూర్య బింబము ప్రకాశమానమై దానికి ప్రసరింపజేయును. రాతిరి పగలుగా సమాన పంక్తిలో చీకటి వెలుగులావరించును. వీటిని అనుసరించి జీవకోటిలోయున్న ఆత్మలు చైతన్యరూపమున మెదలుచుండును కనుక ఆత్మయనునది నీవె యవియు చైతన్యరూపమున విశ్వము ననుసరించియుండి ప్రతి జీవమునందు మెదలుచుందువని తాత్పర్యము.

సప్తసాగరములు సాహస లీలల
భువిఁజుట్టి పొరారెత్తి పొంగుటేల?
మహామాలయమ్ము హిమాలయ శిఖరమ్ము
ప్రాక్పశ్చిమమ్ములఁ బ్రభలనేల?
కొలఁదిలోగొప్పదై కొదుకకనిల్చెడి
వింధ్యపర్వతమేల? వృద్ధిఁజెందె?
వరుసక్రమము నొకభంగి ఋతువులారు
చెదరని నడకలఁ బొదలుటేల?

పేదధనికుల పాటవ భేదమెంచి
సమముఁజేయఁగ విజ్ఞత చాలదెపుడు
ప్రకృతి ధర్మము ఛేదింపవలను బడునె?
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 96

ఓ రామచంద్రా !

ధనికులనియు, పేదలనియు ప్రకృతి ధర్మములో రూపు దిద్దుకొన్నవి. వాటిని సమపాళ్ళలో సాధింప నెవరితరముకాదు. ఎట్లనిన ఏడు సాగరములు జలములచేత కూడుకొని భూమినిజుట్టి పొంగుచు నిలబడుచున్నది. మహోద్భుతమైన హిమాలయమ్ము తూర్పు పడమర వ్యాపించి నిలుచుటేలనియు కొద్దిలో దానికంటె వింధ్యపర్వతము పేరుపొందినదియై చిన్నదిగా యుండుటయేల అనియు, వరుసక్రమము తప్పకుండ ఋతువులారు వాటిపనిని యవి చేయుచుండుటేల యనియు, అన్నియు ప్రకృతిసిద్ధమైనట్లే ధనిక, పేద యనునవి కూడ ప్రకృతి సిద్ధమైనవి. వాటి పద్ధతులను ఛేదించి సమముగా చేయుట యెవరితరము కాదని తాత్పర్యము.

పాముకుఁ బాలును పంచదార నొసఁగి
యల్పజాతినిఁ బ్రేమ నరయువారు!
గాసిఁజెందినవారి కష్టమ్ము లాలించి
పతిక్రియాబోధల సాకువారు!
వెన్నిచ్చిపాఱుచో వెఱవకుమని చెప్పి
మిత్రత్వమును జూపి మెలఁగువారు!
కర్మసంచిత పాప కల్మషరాశిని
ద్రుంచి వైవఁగ భక్తిఁ బంచువారు!

నేతదాశయారూఢిని బూఁతమంది
ఖండఖండాంతరమ్ముల ఖ్యాతి సెంద
దేశసౌభాగ్య గరిమను దిద్దితీవు!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 97

ఓ దశరథాత్మజా!

నీవు భారతదేశమును గొప్పదిగా దేశదేశాల జెప్పుకొనులాగున జేసినావు. భారతావనిలో, ప్రజలు పాముకు పాలును, పంచదారను నొసగి కాపాడుదురనియు, కష్టములపాలైనవారిని కష్టములనుండి కాపాడుదురనియు, భయపడి వెన్నుచూపి పారిపోవు పిఱికివారిని భయమును దీర్చి వారితో మిత్రత్వము చేయుదురనియు, తమతమ చేసిన కర్మలలో కలిసివచ్చెడి పాపమును బోగొట్టుకొనుటకై భక్తితో నుందురనియు, వారందరిని పైన చెప్పినవిధముగా యాశయా ప్రక్రియలకు లోనౌనటుల నేర్పి కాపాడుచుంటివి నీవేకదా రామచంద్రా! యని తాత్పర్యము.

కాళింగమడుగులోఁ గనువిందు సేసిన
కృష్ణయ్య నటనలఁ గెరలియాడి
పొన్నచెట్టు పయినఁ బోకిరికృష్ణయ్య
వలువలాడ్చిన వింతవరుస నరసి
ఏకాంతమున రుక్మిణీకాంత దొంగి లిం
చిన కృష్ణభావాలఁ జింతసేసి
బలశాలి గజరాజుఁబట్టిన మొసలి పెం
దగువులోగుట్టును దలఁచి తలఁచి

వేదసారము గ్రుమ్మరి వేదవేద్య
మర్మకర్మల బోధించి మమతలూడ్చి
సాంద్రకీర్తినిగన్న నరేంద్రు నెంతు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! ॥8

ఓ రఘువంశ సుధాకర!

భారతదేశమునకు గొప్ప కీర్తి తెచ్చిన నరేంద్రుడు, బ్రహ్మచారియై నీయొక్క గొప్పతనమును తెలిసికొని దేశానికే సాంద్రకీర్తులను పంచిపెట్టి శాశ్వతముగా పేరు నిల్పుకొన్నాడు. కృష్ణావతారమున నీవు కాళింగు పెను బాముని చంపునపుడు వాని నటనలులోని యర్థము నెఱింగి, గోపికాజనము జలక్రీడలాడునపుడు వారి వలువలూడ్చి పొన్నచెట్టుపైన దాచిన లోగుట్టు నెఱింగి, ఏకాంతసమయములో రుక్మిణీకాంతను చేబట్టిన దాని యర్థమెఱింగి, బలశాలియైన, గజరాజును మొసలిబట్టి పెనగులాడిన దానిలో గుట్టు నెఱింగి, వేదములసారమును గ్రహించి పేరుగన్న నరేంద్రుని తలంతునని కవి పలుకు చున్నాడు.

వచ్చిపోయెడివారి వరుసల నుప్పొంగి
క్రీడించు దేవతాగిరి తలమ్ము!
సూతమహర్షికిఁ జేతముప్పొంగఁ జ
దువులమ్మ గూర్చిన దొడ్డయిల్లు!
పాదపములఛాయఁ దపశ్శీలించెడి ముని
బృందాలసందడిఁ బెరుఁగుశిఖరి!
తల్లికాటనివాసి కిల్లరికము నిచ్చి
పిల్లనిచ్చిన పెద్ద పెండ్లిపేట!

గూడుఁగట్టిన పాపాలఁ గూల్చనేల!
అమృతగుణవర్ధనమ్ము! హిమాలయమ్ము!
నీదు సృష్టిని గొప్పదై నివ్వటిల్లె!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 99

ఓ దేవా రామభద్రా!

హిమాలయమును నీవు సృష్టించిన దానిని, దాని వైభవములను, అమృతమయముగ గీలించి వర్ణించు చున్నాడీకవి. ఆ పర్వతముమీదకు దేవతలు వచ్చిపోవుచుందురని వారికి ఆటపాటలందు సంతోషము నిచ్చున దనియు, సూతమహర్షి యచ్చోటయుండి పురాణాదికావ్యసంతతులనుగూర్చిన యిల్లుగా వర్ణించుచు, చెట్లనీడల ముని బృందాలు హాయిగ తమ తపస్సులు మొదలగు కార్యములను సందడిగా నొనరించుకొన్న గిరి శ్రేష్ఠమనియు: శివునికి పర్వతరాజు తన కూతురు పార్వతిని యిచ్చి పెండ్లిసేసి, శివపార్వతు లిరువురచటనే యుండుటవలన శివునకు యిల్లరికముగా నున్నదనియు, అది పెండ్లిపీటయనియు, వర్ణించుచు రామ! నీ సృజించిన దాని మహిమను గొప్పగా చెప్పి కవి ధన్యుడయినాడని తాత్పర్యము.

వేదాలభూమికి విస్తరిల్లెడి వాణి
కావంద మిచ్చెడి వాటపట్టు
బంగారుతీగలఁ బైరుపచ్చలఁ గూర్చి
రతనాలు పండించు రైతుపొలము
సర్వనదీనద, చాతకమ్ములఁ బ్రోచు
వెన్నెలఁబండించు వెండికొండ
మాతృదేశమును విమతరాజులఁ బడక
కాపాడఁగల్గిన కంచుకోట

పుట్టుపూర్వోత్తరాలెన్నఁ బుణ్యచరిత
అమృతగుణవర్ధనమ్ము! హిమాలయమ్ము!
నీదు సృష్టిని గొప్పదై నివ్వటిల్లె
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 100

ఓ రామచంద్రా!

● హిమాలయముయొక్క గొప్పందనము యింకను చెప్పుచున్నాడు. వేదాలభూమి యనగా భరతభూమికి, నచ్చట నుండియే వేదాలు వర్ణింపబడి నందున వేదసరస్వతికి యాటపట్టవియు, బంగారు తీగలని ఒకజాతి ధాన్యము పండించుటకు తావైనదనియు, అందువలన రైతులకు అది పొలముగా నుండినదనియు, సర్వనదీనదములు పుట్టినవి కనుక వాటిని చాతకపక్షులుగా పోల్చి వాటిని పోషించిన వెన్నెలను పండించె వెండికొండనియు, మన భారత దేశమునకు సరిహద్దు దాటిరాకుండ విరోధి రాజులకదియొక కంచుకోటనియు ఇంతటి గొప్పదైనదానిని ఓ దేవా! నీ సృష్టిలో వెలసినదనియు, హిమాలయ మనగానె పుణ్యచరితమనియు కవి వర్ణించినాడు.

ఒకచోట గీర్వాణముత్కటంబై చన
నవ్యయానందము నవఘళించి
యొకరీవి నిరుగేల నుత్పన్న ఫణితిని
నుభయ భాషాశైలి నూఁగియూఁగి
ఒకక్రేవ నుడికార ముట్టిపడ నిలిచి
రాయబారాలను జేయఁబనిచి
ఒకచాట నతిభక్తి నుడివోని శక్తిని
సహజకళాలక్ష్మి సన్నుతించి

రాజనీతికి నొజ్జయైరహిఁ దలిర్చ
గుప్తదానమ్ము లెన్నియోఁ గూర్చినట్టి
తెలుఁగువాణి కంజలిడెద! ధీరవీర!
రమ్యగుణసాంద్ర! రఘుకుల రామచంద్ర! 101

ఓ రామచంద్రా !

తెలుగువాణిని గురించి కవి చెప్పుచున్నాడు. ఒకచోట సాహిత్య పీఠములో కావ్యాలందు తెలుగువాణి కొంత గీర్వాణముతో కలిసి యానంద ముట్టిపడపదజాల సమాసములతో తులతూగినది. మఱికొంత యుభయభాష లతో నెలకొని కావ్యాలలో మిక్కలి చక్కని రీతితో మంచి శైలితో నెల కొన్నది. మఱియొకచోట నుడికార మింపలరగ రాయబారాలనుచేసి రాణించి నది. (భారతములో తిక్కనగారి శైలి) ఒకచోట భక్తురాలై తలిగిపోవటు వంటి మార్దవంపుసిరితో కళాలక్ష్మికి వేడుకలవిచ్చినది. రాజ్యపాలనమందు రాజులవెంత హొంగిపార్లి, గురువు మాదిరిగా ఎన్నియో కవులకు దానధర్మా లొసంగినది. అటువంటి తెలుగువాణికి నేనెప్పుడు నమస్కరించెదునని కవి తాత్పర్యము.

జాతీయభావాల మూఁగిన దేశముఁ
బాలింప నేర్పును బడయవలయు
మంచిమార్గమున గమించి ధీరవిహార
భూమికల్ నేర్వంగఁ బూనవలయు
దేశదేశాల దేదీప్యమానమై
వెలుగొందు చరితము పలుకవలయు
మానవుడెప్పుడు మంచివి జూపించి
సమతతో నెల్లర, సాకవలయు

దేశభక్తికి నెలవునై తిరుఁగురేని
నేర్పు పెంపులుగూర్చుచు నిలువవలయు
కలఁడటంచు నిను మదిలోఁ గాంచవలయు
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 102

ఓ రామచంద్రా!

నిను మనమలో కలవటంచు ప్రేమించుచు భక్తిభావాలతో, దేశ పరిపాలన జాతీయభావాలతో చేయవలయునని, మంచిమార్గాన దేశసేవలో వీరవిహారమొనరించు తీరైన భూమికలు నెఱపవలయునని. దేశదేశాల తన దేశ గొప్పంద మును పల్కుదు మంచి చరితము సృష్టింపవలయునని మానవు డెప్పుడు దేశపాలనలో సమత జూపించుచు ప్రతియొక్కరిని సాకవలయునని. దేశభక్తిలో పేరు గడించి దేశసేవలో మిన్నయని పేరు గడింపవలయునని. తను నేర్పు పెంపులు అందరు కొనియాడునటుల చేయవలయునని. దేశపాలన చేయువారికికూడ జాతీయభావాలబ్బి యుండవలయుననియు, తన యాత్మలో నిన్ను యెపుడు కలడని సేవింపవలయునని తాత్పర్యము.

వ్యాకరణజ్ఞుడనని పల్కువాడు రం
ధ్రాన్వేషణము సేయు నరసియరసి
రసపోషణమ్మున వ్రాసెడివాడు భా
షావికారము సేయు సాహసించి
అభ్యుదయ రచనకాసక్తి గొనువాడు
నీరసోక్తుల గూర్చు నేర్పులేమి
గేయకవితలంచు గీలు కొల్పెడివాడు
గ్రామ్యపుం బల్కులు రాశిపోయు

గవులలో నొక్కవికొకండు కలిసిరాక
నొకడు వ్రాసిన వ్రాతలకొకడు కినియు
గాలధర్మమొ! మఱి కలికాల బలమొ!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 103

ఓ రామచంద్రా!

కవులలో భిన్నాభిన్న రకములు గలవారున్నారు. ఒకడు వ్యాకరణ శాస్త్రము తెలిసినవాడు యితర కావ్యాలలోని లోపములు కవిపెట్టును. ఒకడు కావ్యము రసపోషణముచేత వ్రాయువాడు భాషను వికారమున వ్రాయును. ఒకడు అభ్యుదయ కవినని చెప్పికొనెడివాడు, భాషలో నీరసోక్తులు పలుకును. మఱియొకడు గేయ కవితలంచు తలంచి వ్రాసెడివాడు గ్రామ్యపుంబలుకులు వ్రాయును. కనుక గవులలోనే యొకరికి, మఱియొకడు కలిసిరాక యెవరి గొప్పందనమును వారు పల్కుచుందురు. ఇవి చూడగా కలికాలమాయగా యున్నదని భావము.

సాహితీసేవలోఁ జక్కన వెలఁబడి
కోవిదమూర్తులై కొమరు మిగిలె!
పాటియొజ్జలమించు మేటియనఁగ నొప్పి
సర్వకలాశాలఁ బర్వమందె!
ధీరతాబుద్ధిని వీరవిహార మొ
నర్చి వినమ్రతన్నరువ నేర్చె!
వివిధ విద్యార్థికుల్ వేఱిమిఁగన్న వా
రెలమి మెచ్చఁగఁ బులకలెత్తె!

★ సత్యనారాయణాచార్య సాధుమూర్తి!
★ సీతరామయ్య నెమ్మాని ఖ్యాతికులజు
వారిరువరఁ బాలింపుమో వారిజాక్ష!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 104

ఓ రామచంద్ర!

సాహిత్యసేవలో, సత్యనారాయణాచార్యులు నెమ్మాని సీతారామయ్యలు, కోవిదమూర్తు లనిపించుకొన్నారు. అందరిలో వారిరువురు తమ కాలేజిలలో మేటివారనిపించుకొని భాషాసేవ చేయుచున్నారు. వారు వినమ్రత భావముగలవారు. విద్యావేత్తలు వారిని గౌరవించుచుందురు వారిరువురు నా మిత్రులు. కనుక వారిరువురను రామచంద్రా! దీర్ఘాయువులుగా నొనరించి పాలింప వలయునని తాత్పర్యము.

★ "మధురకవి, సభాసామ్రాట్"
శ్రీ కె. వి. యస్. ఆచార్యులుగారు, ఎం.ఎ.పి;హెచ్.డి

★ సాహితీవేత్త–వక్త–శ్రీ నెమ్మాని సీతారామయ్యగారు, ఎం.ఎ.

వచనరచనకు వివరణఁదెల్పెడి హాస్య
రసచక్రవర్తి! వరాలమూర్తి!
నవ్వులపువ్వుల నాట్యమాడించి వి
కాసముఁ గల్పించు కర్మయోగి!
కడిమిమీరిన కోవిదుఁడయి వినోదముఁ
బంచిపెట్టు సుధీప్రభావకీర్తి!
మిత్రవాత్సల్యము మీఱి యనుసరించు
సదయహృదయవాసి సాధువర్తి!
దర్భవారింటిమొలక సుధారసోక్తి!
బాబురావు వానిసతిని వరుసఁగూర్చి
కామితార్థముల నొసఁగి కావుమయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 105

ఓ రా మ చం ద్రా!

అందరిని నవ్వించుచు హాస్యమినుమడింప జేయుచు తన రచనల ద్వారా లోకమున ఒక వెల్గు గా వించి భక్తవర్యులైన మిత్రులతోనే ప్రొద్దు నవ్వించుచు కాలక్షేప మొనరించుచు, మంచి కీర్తిని తన రచనలద్వారా సేకరించిన దర్భా బాబురావు అనే రచయితను తన భార్య శ్రీమతి నాగుమణిని యెప్రొద్దు కాపాడుము తండ్రి రామచంద్రా యని కవి పలుకుచున్నాడు. బాబు రావుగారు వ్రాసిన కావ్యములవలన హాస్యరసచక్రవర్తి యని బిరుదు హొంది నాడు. తానుచేయు పనులలో కర్మయోగిగా యుండి కాలక్షేప మొనరించుచు, సాహిత్య లోకమునకొక వెలుగుగూర్చిన, సుధారసోక్తియైన రచయిత యీ సాధుమూర్తి.

★ దర్భా బాబురావు, ఎం.కాం.

★ శ్రీమతి దర్భా నాగుమణి—(భార్య)

కవులకు నెప్పుడుఁ గామితార్థము లిచ్చి
నీయండ నిలువఁగ నేర్పునిమ్ము!
భారతావనినెప్డు భాగ్యాలగని కాఁగ
వరమిచ్చి తనియంగ వరలనిమ్ము!
శాంతిసందేశాల శాసనాధిపతులు భా
రతమును బాలింపఁ బ్రబలనిమ్ము!
ఐకమత్యమ్మున నాంధ్రావని పెఱిఁగి
యొకబాట నడువంగ నోర్పునిమ్ము!

ఈఁతిబాధలు లేక మహీతలమ్ము
నీ కృపాబ్ధిని నిలువంగ నేర్పునిమ్ము!
సత్కవీట్పరిపాల! యశంపుమాల!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 106

## ఓ రామచంద్రా!

కవులను కాపాడుచు వారు యర్థించునవి తీర్చుచు నీవే వారి కండయై యుండునటులను, భారతభూమిని యెల్లవేళల సంపదలతో తులతూగునట్లు చేయుటకు వరమొసంగుచు, శాంతిసందేశాలతో భారతమునేలు శాసనాపతులకు బలముచేకూర్చుచు ఆంధ్రలోకమున ఐకమత్యమును ప్రభలంగ జేయుచు ప్రజలను ఒకబాట నడువంగ నోర్పునిచ్చుచు, ఈతిబాధలులేక నీకృపా మహిమతో వర్ధిలంగజూడుము స్వామియని యాశీస్సుపురస్సరమైన సందేశముగా గాపాడుము! తండ్రి! యని కవి ప్రార్థించుచున్నాఁడు.

# ఆ శీ స్సు లు

ఇఁక గౌరవస్థాన మిప్పించి భారతా
వనికి నభ్యుదయమ్ముఁ బలుకుమయ్య!
ఎల్లదేశాల పేరెన్నికఁగన్న యీ
జాతికాశీస్సు లొసంగుమయ్య!
ఐకమత్యాను రాగానుబంధముల, సు
శ్రీమంతముగ దీనిఁ జేయుమయ్య!
ధర్మమించుకయేని దప్పని కోవలో
దేశాభివృద్ధినిఁ దీర్పుమయ్య!

నిత్యమై నిఖిలమయి పునీతమై, మ
రున్నదీప్రభాసితమై, పురోగమించు
తల్లిగడ్డకు సేసలు చల్లుమయ్య!
రమ్యగుణసాంద్ర! రఘుకులరామచంద్ర! 107

<u>ఓ రా మ చం ద్రా!</u>

భారతావనికి గౌరవస్థానమిచ్చి అభ్యుదయ మొసగమనియు, ఎల్ల దేశాలలో భారతావని పేరుగాంచిన జాతికి శుభాశీస్సులిమ్మనియు, రాచరికము చేయువారియెడల నిలబడి శ్రీమంతముగ దేశమును దిద్దమనియు, దయాధర్మాలతో నిండి దేశము పురోభివృద్ధి కలుగునటుల జేయమనియు, నిత్యమై నీకు నిలయమైన యీ దేశము అన్నివిధాల పురోగమించు విధమున నీ ఆశీస్సులిమ్మని తాత్పర్యము కావ్యాంతమందు శుభమ్ములనిమ్మని శ్రీరామచంద్రుని కోరడమైనది.





గ్రంథకర్త

ఇతర రచనలు :-

1) తపోవనము - ప్రబంధము
2) ధర్మచక్రము – కావ్యము
3) శ్రీరామరక్ష - శతకము
4) తేనెచుక్కలు - ఖండకావ్యము
5) సంఘసంస్కర్త మహాయోగి వేమన - ప్రబంధం
6) ఖండకావ్యములు - (ప్రథమభాగము)
7) ,, - (ద్వితీయ భాగము)

ప్రతులకు

'కవితావిశారద' 'కవిమిత్ర' 'కవివతంస'
**తేళ్ళ వెంకట రామారావు**
భీమావారి వీధి
బాపట్ల - 522 101

&

**K. S. T. శాయి**
కన్వీనరు
"సహృదయ సాహితి"
విజయలక్ష్మీపురం
బాపట్ల - 522 101